


ESTD: 1999
www.voodayam.com
# వుదయం




ఆదిలాబాద్ | 15-04-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 329 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal
Follow us on

# ఎస్ సి, ఎస్ టి సీట్లు తగ్గే ప్రమాదం

ఎన్ డిఏ డీలిమిటేషన్ పై విరుచుకుపడిన ముఖ్యమంత్రి

- నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం వ్యూహం అంబేద్కర్ ఆలోచనకు విఘాతం
- మహిళల కోటా ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం • ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అవాంతరాలు పెంచుతున్న కేంద్రం
- అంబేద్కర్ రాజ్యాధికార లక్ష్యాన్నిసాధించుకోవాలంటే లోక్ సభలో ఎక్కువ స్థానాలను పొందాలి
- అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి) :** కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రొరేటా ప్రకారం నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గి ఆ వర్గాలు నష్టపోతాయని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమ లక్ష్యం రాజ్యాధికారం సాధించడమే అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం కలుగుతున్న సందర్భంలో దళితులు, మేధావులు ఈ విషయంపై ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ముఖ్య మంత్రి, మంత్రులు ప్రజాప్రతినిధులతో కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఆ అంబే ద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమాజంలో సమాన విలువ, గౌరవం కల్పించిన నాయకుడు అంబేద్కర్ అన్నారు. మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ము డిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.

**పునర్విభజనపై జాతీయ స్థాయిలో సమగ్ర చర్చ జరగాలి**

- అఖిల పక్ష భేటీని ఏర్పాటు చేయాలి
- మహిళల కోటాతో ముడిపెట్టడం సరికాదు
- ప్రజల్లో గందరగోళం సృష్టిచొద్దు
- ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

2

మిగతా 2లో

# 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

16 నుంచి 18 వరకు మూడు రోజులపాటు నిర్వహణ • చట్టసభల్లో మహిళల కోటా, నియోకవర్గాల పునర్విభజన కోసం రెండు రాజ్యాంగ సవరణలు • బిల్లులపై చర్చించనున్న పార్లమెంట్ • 2026 జనగణన నుంచి ఈ రెండు అంశాలను వేరుచేసేందుకు దోహదపడే బిల్లులు • బిల్లుల ఆమోదం తరువాత 850 స్థానాలకు పెరగనున్న లోక్ సభ బలం • మహిళలకు 273 స్థానాలు కేటాయింపు • 84 నుంచి 126-136 కు పెరగనున్న ఎస్ సి సీట్లు • 47 నుంచి 70 కి ఎస్ టి సీట్లు



**వుదయం డెస్క్, ఏప్రిల్ 14 :** మహిళా రిజర్వేషన్ బిల్లును త్వరిత గతిన తీసుకువచ్చేందుకు ప్రభుత్వం రంగాన్ని సిద్ధం చేసింది. జనగణనతో సంబంధం లేకుండా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటుగా, ప్రస్తుతమున్న స్థానాలను పెంచేందుకు ఏర్పాట్లను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం ఉద్దేశించిన ప్రత్యేక సమావేశం మొదటి రోజైన 16వ తేదీన ఈ బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. వీటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది. ఆ ప్రతులను వారికి పంపింది. సీట్ల పెంపు దామాషా ప్రకారం, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం. నారీ శక్తి వందన్ అధినియమ్ (మహిళా రిజర్వేషన్ల చట్టం) అమలును వేగవంతం చేసే ప్రణాళికలో భాగంగా ఈ లోక్‌సభ స్థానాల పెంపును ప్రతిపాదించారు. దీని ద్వారా సభలోని మొత్తం స్థానాల్లో సుమారు మూడో వంతు, అంటే 273 స్థానాలు మహిళా ప్రతినిధులకు రిజర్వు చేస్తారు. ఈ బిల్లుల ఆమోదం కోసం ఏప్రిల్ 16 నుండి 18 వరకు మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ బిల్లు ప్రతిని మంగళవారం నాడు పార్లమెంటు సభ్యులకు అందజేశారు.ఈ ప్రతిపాదన ప్రకారం, రాష్ట్రాలకు 815 సీట్లు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 సీట్లు కేటాయించనున్నారు. తద్వారా మొత్తం సభ్యుల సంఖ్య 850కి చేరుకుంటుంది. మహిళలకు కేటాయించాల్సిన సీట్లను నిర్ణయించడానికి ఒక డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్టు జాతీయ ఛానెల్ న్యూస్ 18 వెల్లడించింది. ఈ మార్పులు 2029 లోక్‌సభ ఎన్నికల నుండి అమల్లోకి వస్తాయని భావిస్తున్నారు.

**నారీ శక్తి వందన్ అధినియమ్ అంటే ఏమిటి?**

నారీ శక్తి వందన్ అధినియమ్ (అధికారికంగా రాజ్యాంగ [106వ సవరణ] చట్టం, 2023)ను భారత పార్లమెంటు సెప్టెంబర్ 2023లో ఆమోదించింది.

మిగతా 2లో

# బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి

ఎన్ డిఏ శాసన సభా పక్ష సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక



**పాట్నా, ఏప్రిల్ 14 (వుదయం):** అన్ని ఊహాగానాలను పటాపంచాలు చేస్తూ బీహార్ ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుత ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి. బీహార్ కి నూతన ముఖ్యమంత్రి ఎవరు అవుతారనే ఊహాగానాలకు తెరపడింది. నిన్నటి వరకూ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా అనంతరం ఆ పదవికి బిజెపి నుంచి అభ్యర్ధిని ఎన్నుకుంటారా లేక జెడి (యు) కార్యకర్తలు కోరుకుంటున్నట్టు నితీష్ కుమారుడు అవుతాడా అని మీడియాలో పలు ఊహాజనిత కథనాలు వచ్చిన తర్వాత మంగళవారం వాటన్నింటికీ తెరపడింది. ఆ పదవికి సామ్రాట్ చౌదరి ఎన్నికయ్యారు.

మిగతా 2లో

విలీనం, యూనియన్లు మినహా
# అన్నింటిపై చర్చలకు సిద్ధం

- విలీనంపై గత ప్రభుత్వం హడావిడిగా నిర్ణయం తీసుకున్నది
- పిఎఫ్, సిసిఎస్ బకాయిలను పెద్దఎత్తున తగ్గించాం
- 90కి పైగా డిపోలు లాభాల్లో నడుస్తున్నాయి
- 2978 కొత్త బస్సులు ప్రవేశ పెట్టాం
- 1134 మందికి కారుణ్య నియామకాలు చేపట్టాం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఎంఎస్) :** ఆర్టీసీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మె నిర్ణయం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఈ నెల 22 నుంచి సమ్మెలో దిగుతున్నట్టు ఆర్టీసీ కార్మికులు ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై గత ప్రభుత్వం హడావిడిగా నిర్ణయం తీసుకుందని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం ఈ అంశంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ అధ్యయనం చేస్తోందని, సంస్థ ఆర్థిక స్థితిగతులను బట్టి కమిటీ నివేదిక ఇస్తుందని తెలిపారు. విలీనం, కార్మిక సంఘాల గుర్తింపు మినహా మిగిలిన అన్ని సమస్యలపై చర్చించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తన తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.

మిగతా 2లో

# హొర్ముజ్‌లో ఆర్థిక ఉగ్రవాదం

భారత్, గల్ఫ్ లోని మిత్ర దేశాల నౌకాయానాన్ని సురక్షితం చేయాలి

విదేశాంగ మంత్రి జయశంకర్‌తో సంభాషణలో ఇజ్రాయెల్ మంత్రి గిడియాన్ సార్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (వుదయం):** మంగళవారం నాడు ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌తో జరిపిన సంభాషణలో, విదేశాంగ మంత్రి ఎస్.జయ్‌శంకర్ పశ్చిమ ఆసియాలో మారుతున్న భద్రతా పరిస్థితులపై చర్చించారు. పశ్చిమాసియాలో సంఘర్షణపై ఇరువురు నాయకులు అభిప్రాయాలను పంచుకున్నట్టు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ పై పోస్ట్ చేశారు.అంతకు ముందు, ఇజ్రాయెలీ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్‌తో కూడా పశ్చిమాసియా పరిస్థితిలోని పలు అంశాలను గురించి విదేశాంగ మంత్రి జయశంకర్ చర్చించారు. హొర్ముజ్ జలసంధిలో ఆర్థిక ఉగ్రవాదం ద్వారా నౌకాయాన స్వేచ్ఛకు ఇరాన్ చేస్తున్న హాని దృష్ట్యా, భారతదేశంతో సహా అన్ని దేశాలకు నౌకాయాన స్వేచ్ఛను కల్పించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సార్ అన్నారు. నా మిత్రుడు, భారతదేశ విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్‌తో ఎప్పటిలాగే ఒక మంచి సంభాషణ జరిగింది. మేం ఇరాన్, హొర్ముజ్ జలసంధి, లెబనాన్ అంశాలపై చర్చించుకున్నాం. ఇరాన్ అణు ఆయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించే షరతులపై (ఇరాన్‌లో అణు ఇంధన శుద్ధి జరగకూడదు, శుద్ధి చేసిన పదార్థాన్ని ఇరాన్ నుంచి తొలగించాలి) జరుగుతున్న చర్చలలో అమెరికా దృఢమైన వైఖరిని అవలంబించడం యావత్ అంతర్జాతీయ సమాజానికి అత్యంత కీలకమని నేను నొక్కిచెప్పాను, అని ఆయన ఎక్స్‌పై చేసిన ఒక పోస్టులో పేర్కొన్నారు. దానితో పాటుగా, హొర్ముజ్ జలసంధిలో ఆర్థిక ఉగ్రవాదం ద్వారా, నౌకాయాన స్వేచ్ఛకు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇరాన్ కలిగిస్తున్న

మిగతా 2లో

# రేపు మళ్లీ చర్చలు!

అమెరికా, ఇరాన్ మధ్య తాజా సంభాషణలకు తొలగిన అడ్డంకులు?



**వుదయం డెస్క్ :** యుఎస్, ఇరాన్‌ల మధ్య గురువారం నాడు తాజాగా మరొక విడత చర్చలు జరిగే అవకాశమున్నట్టు, అధికార వర్గాలను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ వెల్లడించింది. ఇస్లామాబాద్‌లో ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి చర్చలు ఎటువంటి పురోగతిని సాధించలేకపోయినప్పటికీ, తదుపరి సంప్రదింపులకు మార్గం సుగమం చేసిన నేపథ్యంలో ఈ సంభావ్య చర్చలు జరుగుతున్నాయి. వారాంతంలో ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ శాంతి చర్చలు, దశాబ్దానికి పైగా కాలంలో అమెరికా, ఇరాన్ అధికారుల మధ్య జరిగిన మొట్టమొదటి ప్రత్యక్ష సమావేశం కాగా, 1979 నాటి ఇరాన్ ఇస్లామిక్ విప్లవం తర్వాత జరిగిన అత్యున్నత స్థాయి సంప్రదింపులు కూడా ఇవే. అమెరికా ప్రతినిధి బృందంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ ఉండగా, ఇరాన్ తరపున పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఘాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రాతినిధ్యం వహించారు. సుమారు 21 గంటల పాటు సాగిన సుదీర్ఘ చర్చలు ఎటువంటి ఒప్పందం లేకుండానే ముగిసినప్పటికీ, తదుపరి సంభాషణల కోసం మార్గాలను మాత్రం తెరిచే ఉంచాయి. గత మంగళవారం కాల్పుల విరమణ ప్రకటన వెలువడిన నాలుగు రోజుల తర్వాత జరిగిన ఈ ఉన్నత స్థాయి చర్చల ముఖ్య ఉద్దేశం, ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా ఆంక్షలు, హొర్ముజ్ జలసంధితో సహా ప్రాంతీయ భద్రతకు సంబంధించి పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ, ఒక విస్తృత శాంతి

మిగతా 2లో

# దిగ్బంధనం వల్ల ఉద్రిక్తతలు తీవ్రం

అమెరికా చర్యలు మరింత అస్థిరతకు దారితీస్తాయి : చైనా

**వుదయం డెస్క్, ఏప్రిల్ 14 :** పశ్చిమాసియా ప్రాంతంలో ఇప్పటికే బలహీనంగా ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇటీవలి అమెరికా సైనిక చర్యలు మరింత అస్థిరపరుస్తాయని హెచ్చరిస్తూ, చైనా మంగళవారం ఆ దేశాన్ని తీవ్రంగా విమర్శించినట్లు అల్ జజీరా పేర్కొంది. హొర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పరిమితం చేయడానికి వాషింగ్టన్ తీసుకున్న చర్యలు ఉద్రిక్తతలను తగ్గించడం కన్నా, మరింత పెంచుతాయని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గ్వో జియాకున్ అన్నారు. అల్ జజీరా ప్రకారం, అమెరికా సైనిక కార్యకలాపాలను పెంచడం, లక్షిత దిగ్బంధన ప్రయత్న ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తాయని, ఇప్పటికే బలహీనంగా ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పశ్చిమ ఆసియాలో శాంతి, స్థిరత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో చైనా అధ్యక్షుడు గ్జీ జిన్‌పింగ్ నాలుగు సూత్రాల చట్రాన్ని ప్రతిపాదించినట్లు జిన్హువా పేర్కొంది. ఈ ప్రతిపాదన శాంతియుత సహజీవనం, జాతీయ సార్వభౌమాధికారం, అంతర్జాతీయ చట్టం పట్ల గౌరవం, అలాగే అభివృద్ధి, భద్రతా ప్రాధాన్యతల మధ్య మెరుగైన సమన్వయానికి ప్రాధాన్యత ఇస్తుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని అబుదాబి యువరాజు షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో బీజింగ్‌లో జరిగిన సమావేశంలో గ్జీ ఈ కార్యక్రమాన్ని వివరించారు. అంతకుముందు, మెరైన్‌ట్రాఫిక్ డేటాను ఉటంకిస్తూ సిఎన్ ఎన్ వెల్లడించిన ప్రకారం, ఇరాన్‌తో సంబంధం ఉన్న షిప్పింగ్‌ను లక్ష్యంగా చేసుకున్న

మిగతా 2లో

దక్షిణాదికి ఎటువంటి
# అన్యాయం జరుగదు

- డీలిమిటేషన్ వల్ల
- అన్ని రాష్ట్రాలకు సమన్యాయం
- జిఎస్ డిపి ఆధారంగా సీట్ల పెంపు
- ప్రజాస్వామ్య విరుద్ధం : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2

కరువొస్తే ముఖ్యమంత్రే
# కారకులవుతారు

- ప్రాణహితను వినియోగించుకోవాలంటే తుమ్మిడి హెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలి
- ప్రస్తుత పరిస్థితుల్లో మేడిగడ్డను పునరుద్ధరించుకోవడమే మంచిది : మాజీ మంత్రి జీవన్ రెడ్డి



అధికారం లేక
# విపక్షం విలవిల

నిప్పు తొక్కిన కోతుల్లా ప్రవర్తిస్తున్నారు

- కొండంత పని చేస్తున్నాం.. గడప గడపకూ చెప్పండి!
- ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం
- కాంగ్రెస్ కృషితోనే ప్రజా పాలన : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



2

# జగిత్యాల సభకు కెసిఆర్

- ప్రజల ముందు కాంగ్రెస్ నేతలు ప్రకటించిన డిక్లరేషన్లు గుర్తుకు తెస్తూ బిఆర్ఎస్ సభలు నిర్వహిస్తాం
- ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం తరువాత మే, జూన్ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం తీవ్రతరం
- అంబేద్కర్ బాటలోనే తెలంగాణ సాధించుకున్నాం : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్





# బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి

మొదటి పేజీ తరువాయి

మంగళవారం, తన మంత్రివర్గ చివరి సమావేశానికి అధ్యక్షత వహించి, గవర్నర్‌కు తన రాజీనామాను సమర్పించిన అనంతరం నితీష్ కుమారు ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగారు. ఆ వెంటనే ఎన్డీయే శాసనసభా పక్షం సమావేశమై సామ్రాట్ చౌదరిని తమ నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ ఎన్నికల రాష్ట్ర రాజకీయాలలో ఒక కీలకమైన పరివర్తనను సూచిస్తుంది. త్వరిత గతిన ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందన్న అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో చౌదరి ఇప్పుడు ప్రభుత్వ పగ్గాలు చేపట్టనున్నారు.

**నాయకత్వ మార్పు**.. కేంద్ర పరిశీలకునిగా హాజరైన శివరాజ్ సింగ్ చౌహాన సహా సీనియర్ బిజెపి నాయకులు, పాట్నాలో జరిగిన శాసనసభ పక్ష సమావేశాన్ని పర్యవేక్షించారు. నిర్ణయ ప్రక్రియ సమయంలో బి.ఎల్. సంతోష్, వినోద్ తావడే వంటి నాయకులు కూడా ఉన్నారు. శాసనసభ పక్ష నాయకుడిగా చౌదరి ఎన్నికతో, ముఖ్యమంత్రి పగ్గాలను ఆయన చేపట్టడం లాంఛనప్రాయమే. ఆయన బుధవారం లోక్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారని భావిస్తున్నారు. ఆయన ఎంపిక గురించి చాలామంది ముందే ఊహించినదే.

**రాజకీయ ప్రయాణం**.. ప్రస్తుతం సామ్రాట్ చౌదరి బీహార్ డిప్యూటీ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. హోం శాఖ ఆయన వద్దే ఉంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన అంతకు ముందు శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. ఆయన రాజకీయ జీవితం రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) కార్యకర్తగా 1990లో ప్రారంభమైంది. కాలక్రమంలో ఆయన రాజకీయ విధేయతలను మార్చుకున్నారు. 2014లో జనతాదళ్ (యు)లో చేరిన ఆయన 2018లో బిజెపిలో చేరారు. రబ్రీ దేవి ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా సేవలు అందించడం సహా పలు ప్రభుత్వాలలో మంత్రిపదవులను కూడా ఆయన నిర్వహించారు. చౌదరి ముంగేర్ జిల్లాకు చెందిన వారు. సమతా పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నాయకుడు శకుని చౌదరి కుమారుడు. దాదాపు మూడు దశాబ్దాలకు పై రాజకీయ జీవితంలో ఉన్న చౌదరి, బీహార్‌లో కీలక రాజకీయ శక్తిగా ఎదిగి, అంతిమంగా ముఖ్యమంత్రి పగ్గాలను చేపడుతున్నారు.

# జగిత్యాల సభకు కెసిఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి) :** ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు డిక్లరేషన్లు ప్రకటించిన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తూ వాటిని అమలు చేసేలా అధికార పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు కేసీఆర్ హాజరు కాబోతున్నారని ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఈ రెండు కార్యక్రమాలు అయ్యాక మే, జూన్ నెల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలను ట్రాక్ ఎక్కించబోతున్నట్లు వెల్లడించారు. తొలుత ఎస్సీ, ఎస్టీలతోనే మొదలు పెట్టబోతున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు డిక్లరేషన్లు ప్రకటించి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.

**అంబేద్కర్ బాటలో తెలంగాణ సాధన**.. అంబేద్కర్ బాటలో తెలంగాణ సాధించామని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ను తన రాజకీయాల కోసం వాడుకుందని, రెండు సార్లు పార్లమెంట్ కు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అంబేద్కర్ కు భారతరత్న ఇవ్వలేదన్నారు. కనీసం పార్లమెంట్ లో ఆయన ఫోటో కూడా పెట్టలేదన్నారు. 125 అడుగుల విగ్రహాన్ని సంకెళ్లతో బంధిస్తే తాము ఆరోజు వార్నింగ్ ఇస్తే ఈరోజు అంబేద్కర్ విగ్రహం దగ్గర గేట్లు తెరుచుకున్నాయన్నారు. కాంగ్రెస్ ది అరాచక, మూర్ఖపు ప్రభుత్వం అని ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. వెయ్యి గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోందన్నారు.

# రేపు మళ్లీ చర్చలు

మొదటి పేజీ తరువాయి

చక్రాన్ని సాధించడం.ఇరుపక్షాలు ఒప్పందానికి చేసుకునేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు వచ్చినప్పటికీ, కీలక అంశాలపై నెలకొన్న తీవ్ర విభేదాలు చివరికి పురోగతిని నిలిపివేశాయి. ఒకవేళ జరిగితే, దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగుతాయా లేక వాషింగ్టన్, తెహ్రాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతాయా అనే విషయాన్ని నిర్ధారించడంలో రాబోయే విడత చర్చలు కీలకం కావచ్చు.

**అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు ఎందుకు విఫలమయ్యాయి?**

అత్యంత కీలకమైన ఈ చర్చల సందర్భంగా, భవిష్యత్తులో తెహ్రాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయకుండా నిరోధించడానికి దీర్ఘకాలిక ఆంక్షలు అవసరమని వాదిస్తూ, 20 ఏళ్ల పాటు అణు కార్యకలాపాలను నిలిపివేయడానికి ఇరాన్ అంగీకరించాలని అమెరికా ప్రతిపాదించింది. పాకిస్తాన్ నుండి బయలుదేరే ముందు జేడీ వాన్స్ మాట్లాడుతూ, అటువంటి కాలపరిమితి ఇరాన్ ఇప్పుడే కాదు, కేవలం రెండేళ్ల తర్వాతే కాదు, దీర్ఘకాలం పాటు బాంబును తయారు చేయకుండా ఉండేలా చూస్తుందని అన్నారు.

## విలీనం, యూనియన్లు మినహా
# అన్నింటిపై చర్చలకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

**సంస్థ బలోపేతానికి చర్యలు**

గతంలో ఉన్న రూ.1205 కోట్ల పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్ల CCS బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామని మంత్రి ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికే 2978 కొత్త బస్సులను ప్రవేశపెట్టామని, 1134 మందికి కారుణ్య నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. కొత్త ఉద్యోగ నియామకాల ప్రక్రియ కూడా చివరి దశలో ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీ ఉనికి ప్రశ్నార్థకం కాలేదని, పైగా 90కి పైగా డిపోలు ఇప్పుడు లాభాల్లో నడుస్తున్నాయని వెల్లడించారు. ఇటీవలే 2.1 శాతం డీఏ అమలు చేశామని, పీఆర్సీ అంశం కూడా పరిశీలనలో ఉందని మంత్రి వెల్లడించారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యం అనే మూడు సూత్రాలతో తమ ప్రభుత్వం పని చేస్తోందని, కార్మికులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమ్మె ఆలోచన విరమించుకోవాలని పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# హొర్ముజ్‌లో ఆర్థిక ఉగ్రవాదం

మొదటి పేజీ తరువాయి

హానిని ఎదుర్కోవడానికి, భారతదేశంతో పాటు గల్ఫ్ ప్రాంతంలోని మిత్రదేశాలతో సహా, అన్ని దేశాల నౌకాయాన స్వేచ్ఛను సురక్షితం చేసే చర్యలు అవసరమని కూడా నేను పేర్కొన్నాను, అని ఆయన తెలిపారు. జయశంకర్ తన అధికారిక యుఎఇ పర్యటనను ముగించి, తిరిగి వచ్చిన అనంతరం ఈ సంభాషణ జరిగింది. తన ఉన్నత స్థాయి చర్చల ప్రధాన అంశం గురించి ప్రస్తావిస్తూ, నేను యుఎఇ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్‌ను కలిశాను. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుంచి ఒక సందేశాన్ని నేను తీసుకువెళ్లాను. మా సంభాషణ వ్యూహాత్మక సంబంధంపైనా, అలాగే ఇంధనం, ఆర్థిక వాణిజ్యం వంటి వివిధ కార్యక్రమాలపైనా కేంద్రీకృతమైంది. యుఎఇ ఒక కీలక భాగస్వామి, కనుక మేం ఆ అంశంపై చర్చించాం అని ఎఎన్‌ఐ వార్తా సంస్థ విదేశాంగ మంత్రి వివరించారు.

# ఎస్ సి, ఎస్ టి సీట్లు తగ్గే ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పెంపు అని మొదట ప్రస్తావించారన్న సీఎం... అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తే దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని చెబుతున్నారని చెప్పారు. ఆ ప్రాతిపదిక ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య కేంద్రం అవాంతరాలు పెంచుతుందన్నారు. . దక్షిణాదిలో సీట్లు తగ్గడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడు సీట్లు తగ్గుతాయని చెప్పారు. ఏ లెక్కన దక్షిణాది కోటాను తగ్గిస్తారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల పెంపుపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. చెప్పిన మాటపై నిలబడే ప్రభుత్వం తమది అన్నారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసి చూపించిన రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే అన్నారు. కులగణన చేస్తామని చెప్పి. చేసి చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. మంచి పనికి తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందన్నారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని అంబేద్కర్ చెప్పిన మాటలు ఆచరణలోకి రావాలంటే మన సీట్లను సాధించుకోవాలన్నారు. అప్పుడే మన హక్కుల కోసం మాట్లాడగలమని చెప్పిన సీఎం.. ఆ మేరకు మేధావులు ఆలోచన చేయాలని కోరారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలకు సమాన అవకాశాలు కల్పించవచ్చని మార్గదర్శకం చేసిన మహానాయకుడు అంబేద్కర్ అన్నారు. విద్య ఒక్కటే అన్ని సమస్యల నుంచి మనల్ని విముక్తి చేస్తుందని, జీవితాల్లో వెలుగులు నింపుతుందని, సమాజంలో సరైన గౌరవం దక్కుతుందని బలంగా విశ్వసించారన్నారు. అంబేద్కర్ ఆలోచనే ప్రజాపాలన విధానం అని చెప్పారు. రక్తం చిందించకుండా శాంతితో యుద్ధాన్ని గెలవొచ్చని మహాత్మగాంధీ ప్రపంచ దేశాలకు చాటి చెబితే, ఆ దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పరిపాలించవచ్చని నిరూపించిన వారు అంబేద్కర్ అన్నారు. ఈ దేశానికి మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారన్నారు. భారత రాజ్యాంగంలో అంబేద్కర్ జోడించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని



చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలే ముందు భాగంలో నిలిచి పోరాటం చేశారని సీఎం వ్యాఖ్యానించారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన గద్దరన్న, మారుమూల పల్లెల్లో జయ జయహే తెలంగాణను మారుమోగించిన అందెశ్రీని సీఎం స్మరించుకున్నారు. దళిత, గిరిజన సామాజిక వర్గానికి మంత్రిపదవులు, ఇతర పదవులు, అధికారులకు ప్రాధాన్యత విషయాల్లో గత ప్రభుత్వాలకు, ప్రజాప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను పోల్చుకోవాలని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలోనే అత్యధిక ప్రాధాన్యత దక్కిందని అనేక ఉదాహరణలు చెప్పారు. కులాల మధ్యన విభజన జరుగుతుందని, సమాజంలో మరింతగా అంతరాలు పెరుగుతున్నాయని ఆలోచన చేసి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. దేశానికి భవిష్యత్తును అందించే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పేదలకు నాణ్యమైన విద్య అందడం లేదని, నాణ్యమైన విద్యను అందించడానికి అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లలో అత్యధికంగా దళితులకు ఇచ్చామన్న సీఎం.. 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తే అందులో 87 శాతం ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఉద్యోగాలొచ్చాయన్నారు. సివిల్ సర్వీసెస్ లో ప్రోత్సహించాలని రాజీవ్ గాంధీ అభయహస్తం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఒకవైపు అప్పులు, తప్పులను సవరిస్తూనే రాష్ట్రంలో పరిపాలనను చక్కబెడుతూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న మంచి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. ప్రజల కోసం అందిస్తున్న ప్రజాపాలనను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## అధికారం లేక
# విపక్షం విలవిల

**ఖమ్మం, ఏప్రిల్ 14 (ఎఎంఎస్) :** గత పాలకులు గోరంత చేసి కొండంత చెప్పుకున్నారు.. కానీ మన ప్రభుత్వం కొండంత అభివృద్ధి చేస్తున్నా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడి ఉన్నాం. కార్యకర్తలు నడుం బిగించి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ వివరించాలి" అని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన జిల్లా, నగర కాంగ్రెస్ నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకరణ మహోత్సవంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కొనసాగుతున్నది కార్యకర్తల ప్రభుత్వమని పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా, పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలనే తపనతో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని చెప్పారు. కార్యకర్తల కష్టం, పోరాట ఫలితంగానే నేడు మనం అధికారంలో ఉన్నామని, ఆ బాధ్యతను గుర్తెరిగి ప్రతి ఒపని చేయాలని సూచించారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన వారు అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి విమర్శించారు. అధికారం పోయిందన్న కసితో నిప్పు తొక్కిన కోతుల్లా ఎగురుతున్నారని ఎద్దేవా చేశారు. వారి మాయ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎద్దేవా చేశారు. మనం చేసిన అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమాన్ని గడప గడపకూ వివరించగలిగితే కాంగ్రెస్ విజయ పరంపరను ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు.టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా, నగర కాంగ్రెస్ నూతన కార్యవర్గ సభ్యులు ఉత్సాహంగా బాధ్యతలు చేపట్టారు. డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామదాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కరువొస్తే ముఖ్యమంత్రే
# కారకులవుతారు

**జగిత్యాల, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో భవిష్యత్తులో కరువు వస్తే, అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీయే కారణమవుతారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాణహిత నదీ జలాలను వినియోగించుకోవాలంటే తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని సూచించారు. కానీ ఆ దిశగా రేవంత్ ప్రభుత్వానికి చొరవ లేదని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మేడిగడ్డ ప్రాజెక్టును పునరుద్ధరించుకోవడం ఒక్కటే మార్గమని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఆ పనులు పూర్తి చేయాలని సూచించారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే కేసీఆర్‌ను దోషిగా చూపారని ఆవేదన వ్యక్తం చేశారు, కానీ ఆయన తెలంగాణ పునర్నిర్మాణానికి స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు. ఇప్పటికే మూడు వ్యవసాయ కాలాలు గడిచిపోయాయన్న జీవన్ రెడ్డి..మేడిగడ్డ పునరుద్ధరణ వీలైనంత త్వరగా చేపట్టకపోతే రైతులకు నష్టం తప్పదన్నారు.

## దక్షిణాదికి ఎటువంటి
# అన్యాయం జరుగదు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఎఎంఎస్) :** డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ విధానమని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ నమూనాను కిషన్ రెడ్డి తప్పుపట్టిన ఆయన... అసలు అలాంటి నమూనా ఎక్కడా లేదని ఆయన కొట్టిపారేశారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో కూడా ఇదే హైబ్రిడ్ విధానాన్ని అమలు చేస్తారా? అని సీఎంను ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన కాకుండా వేరే లెక్కలు తీస్తే.. రేపు ఆదిలాబాద్‌కు సీట్లు తగ్గించి, హైదరాబాద్‌కు పెంచుతారా?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు, విధానాలకు వ్యతిరేకమని కిషన్ రెడ్డి విమర్శించారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ఆర్థిక వనరుల ఆధారంగా సీట్లు కేటాయించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. తెలంగాణ ఆదాయంలో 70 శాతం హైదరాబాద్ నుంచే వస్తోందని చెప్పారు. అలాగని 70 శాతం సీట్లు హైదరాబాద్ పరిసరాల్లోనే ఉండాలా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చెప్పినట్లు ఆర్థిక వనరులు, ఇతర అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటే దక్షిణాది కంటే గుజరాత్ వంటి రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. కేంద్రం తీసుకునే ఏ నిర్ణయమైనా అన్ని ప్రాంతాల ప్రయోజనాలను కాపాడేలా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ వితండ వాదాన్ని రేవంత్ రెడ్డి పక్కనబెట్టి బిల్లుకు సహకరించాలని కిషన్ రెడ్డి సూచించారు. జనగణనతో పాటే కులగణన కూడా చేపట్టబోతున్నామని చెప్పారు. ఈ ప్రక్రియకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# దిగ్బంధనం వల్ల ఉద్రిక్తతలు తీవ్రం

మొదటి పేజీ తరువాయి

అమెరికా ఆంక్షలను ధిక్కరిస్తూ, మలావి జెండా కలిగిన, చైనా యాజమాన్యంలోని ఒక నౌక హొర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించింది. రిచ్ స్టారీ' అనే ఈ ట్యాంకర్, ఫుల్ స్టార్ షిప్పింగ్ లిమిటెడ్ యాజమాన్యంలో ఉంది. ఈ సంస్థ షాంఘై జువాన్‌రన్ షిప్పింగ్ కో లిమిటెడ్‌తో అనుబంధం కలిగి ఉంది. ఇరాన్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలపై ఇది 2023 నుండి అమెరికా ఆంక్షల పరిధిలో ఉంది. ఇది గతంలో, ఏప్రిల్ 2023 వరకు హాంకాంగ్ జెండా కింద ప్రయాణించిందని సిఎన్ ఎన్ తెలిపింది. మెరైన్‌ట్రాఫిక్ డేటా ప్రకారం, ఆ నౌక మొదట సోమవారం మధ్యాహ్నం యుటిసి సమయంలో జలసంధి గుండా వెళ్ళడానికి ప్రయత్నించింది, కానీ ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపం సమీపంలో తన మార్గాన్ని కొద్దిసేపు మార్చుకుని, అదే రోజు రెండవ ప్రయత్నంలో విజయవంతంగా ప్రయాణాన్ని పూర్తి చేసింది.పశ్చిమ ఆసియా ప్రాంతంలో యుఎస్ నౌకాదళం గణనీయమైన ఉనికిని కలిగి ఉందని, ఇందులో యుఎస్‌ఎస్ అబ్రహం లింకన్ అనే విమాన వాహక నౌక, అనేక డిస్ట్రాయర్‌లతో సహా సుమారు 15 నౌకలు ఉన్నాయని, ఇవి సముద్ర కార్యకలాపాలలో పాల్గొనవచ్చని సిఎన్ ఎన్ కూడా వివరించింది. అయితే, ఈ నౌకల కచ్చితమైన మోహరింపు, పాత్ర ఇంకా అస్పష్టంగానే ఉన్నాయి. ఆ నివేదిక ప్రకారం, వారాంతంలో పాకిస్తాన్‌లో జరిగిన చర్చలు విఫలమవడంతో, ఇరాన్ నౌకాశ్రయాలపై నావికా దిగ్బంధనాన్ని విధించాలని అమెరికా అధ్యక్షుడు ఆదేశించిన విషయం తెలిసిందే.

# డీలిమిటేషన్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి) :** దేశంలో నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగకుండా జాతీయ స్థాయిలో విస్తృత చర్చలు జరపాలని సీఎం ఎ. రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అన్ని రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని మంగళవారం రాసిన లేఖలో కోరారు. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు, ఏకాభిప్రాయ సాధన ద్వారానే ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ప్రభావం కలిగించే అంశమైనందున బాధ్యతతో అత్యవసరంగా ఈ లేఖ రాసినట్లు తెలిపారు. ప్రస్తుతం మహిళల రిజర్వేషన్, పునర్విభజన, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను ఒకదానితో ఒకటి ముడి పెట్టి ప్రజలలో గందరగోళం సృష్టిస్తున్నారని, అవి పూర్తిగా వేర్వేరు విషయాలని స్పష్టం చేశారు. మహిళల రిజర్వేషన్ బిల్లుకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లలోనే 33 శాతం మహిళల రిజర్వేషన్‌ను యథాతథంగా వెంటనే అమలు చేయాలని, అన్ని రాష్ట్ర అసెంబ్లీల్లో కూడా అమలు చేయాలని కోరారు. మహిళల రాజకీయ సాధికారత కేవలం చట్టపరమైన మార్పు మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ఒక నైతిక అవసరమని పేర్కొన్నారు. పునర్విభజనకు సంబంధించి గతంలో కూడా సీట్ల సంఖ్య పెంచకుండా కేవలం నియోజకవర్గాల సరిహద్దులను మార్చుతూ డిలిమిటేషన్ నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా దేశవ్యాప్తంగా అలాంటి ప్రక్రియను చేపట్టవచ్చని తెలిపారు.లోక్‌సభ సీట్లను 850కు పెంచే ప్రతిపాదన అసలైన వివాదాస్పద అంశమని పేర్కొన్నారు. ప్రస్తుత సీట్లను పెంచి వాటిని ప్రోరాటా పద్ధతిలో కేటాయించే ఆలోచనపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రిజర్వేషన్‌కు పూర్తి మద్దతు ఇవ్వటంతో పాటు, సీట్ల సంఖ్య పెంపు లేకుండా డిలిమిటేషన్‌కు తాము పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. జనాభా లేదా ప్రోరాటా పద్ధతిలో లోక్‌సభ సీట్ల పెంపు ప్రతిపాదనను అనేక రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించబోవని తెలిపారు. ప్రోరాటా పద్ధతిలో అమలు చేస్తే దేశంలో తలెత్తబోయే పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు.1970ల నుంచి దేశం జనాభా నియంత్రణ విధానంపై దృష్టి పెట్టినప్పటికీ, రాష్ట్రాల వారీగా జనాభా నియంత్రణ అమలు జరిగిన తీరు భిన్నంగా ఉందన్నారు. జనాభాలో తేడాల వల్ల జాతీయ ఐక్యతపై ప్రభావం పడే ప్రమాదాన్ని గుర్తించి, ఇందిరా గాంధీ, అటల్ బిహారి వాజ్‌పేయి



వంటి నాయకులు ఈ అంశాన్ని ఒక్కోసారి 25 సంవత్సరాల పాటు వాయిదా వేసినట్లు తెలిపారు.ఆర్థిక సహకారం, సామాజిక, మానవ అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రోరాటా పద్ధతిలో సీట్ల పెంపు చేస్తే దేశ ఫెడరల్ సమతుల్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అన్ని ప్రాంతాల సమాన ప్రాతినిధ్యం దేశానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. సీట్ల పెంపుతో దక్షిణ రాష్ట్రాలపై పడే ప్రభావాన్ని కేంద్రం పూర్తిగా విశ్లేషించలేదని అభిప్రాయపడ్డారు.తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలు దశాబ్దాలుగా జనాభా స్థిరీకరణ, ఆరోగ్యం, మానవ అభివృద్ధి రంగాల్లో కృషి చేశాయని తెలిపారు. ఇవన్నీ జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా చేపట్టిన చర్యలని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రతిపాదనతో ఈ రాష్ట్రాలన్నీ నిర్మాణాత్మకంగా నష్టపోతాయని, రాజకీయంగా బలహీనపడే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రోరాటా మోడల్ కేవలం గణాంకాల మార్పుగా కాకుండా, రాజకీయ అసమతుల్యతకు దారి తీస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు నిధుల పంపిణీలో ఇప్పటికే పక్షపాతం, వివక్ష ఉన్నట్లు తెలిపారు. బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఎక్కువ నిధులు పొందుతుంటే, తెలంగాణకు తక్కువ నిధులు వస్తున్నాయని ఉదాహరణగా చెప్పారు. ఇది దక్షిణాది–ఉత్తరాది అసమానతకు సంకేతమని పేర్కొన్నారు. నిధుల వివక్షకు అదనంగా ఇప్పుడు సీట్ల పెంపు కారణంగా రాజకీయంగా అన్యాయం జరుగుతుందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా సహకరించినప్పటికీ, పార్లమెంట్‌లో వారి ప్రాధాన్యం తగ్గిపోతుందని, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తరాది–మధ్య ప్రాంత రాష్ట్రాలు లాభపడతాయని తెలిపారు. అభివృద్ధిలో పాలుపంచుకున్న రాష్ట్రాలకు శిక్ష పడుతుందని, జనాభా పెరిగిన రాష్ట్రాలకు ప్రోత్సాహకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇది అంకెల విషయం కాదని, దేశ సమగ్రత, స మాన త్వం, న్యాయానికి సంబంధించిన ప్రాథమిక అంశమని స్పష్టం చేశారు. ద క్షిణ రాష్ట్రాలు జాతీయ ఆదాయానికి నిరంతరం సహకరిస్తూ, సుపరిపాలన, అభివృద్ధి ప్రమాణాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఈ కృషిని పట్టించుకోకుండా దేశ ఐక్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు.

ప్రోరాటా మోడల్‌ను దక్షిణ రాష్ట్రాలు అంగీకరించవని, ఈ అంశంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉత్పన్నమవుతుందన్నారు. అందరికీ న్యాయం జరిగేలా ఒక స్థిరమైన పరిష్కారం అవసరమని సూచించారు. హైబ్రిడ్ మోడల్ ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అందరి ప్రాతినిధ్యంతో పాటు అన్ని రాష్ట్రాల సహకారాన్ని ఈ మోడల్ సమతుల్యం చేస్తుందని వివరించారు. సుప్రీంకోర్టు సూచించిన 50 శాతం– 50 శాతం విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. హైబ్రిడ్ మోడల్ ప్రకారం, కొత్తగా పెంచే సీట్లలో సగాన్ని ప్రోరాటా పద్ధతిలో, మిగతా సగాన్ని రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యం (జీఎస్డీపీ), అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా కేటాయించాలని సూచించారు.స్వామి వివేకానంద చెప్పినట్లుగా, మన ఆలోచనలకు తలుపులు తెరిచి కొత్త భావనలు స్వీకరిస్తే, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రక్రియ అందరికీ న్యాయంగా, ఆమోదయోగ్యంగా ఉండే ఉత్తమ పరిష్కారాన్ని కనుగొంటుందని పేర్కొన్నారు. హైబ్రిడ్ మోడల్ ద్వారా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు నష్టపోకుండా ఉండటంతో పాటు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సూత్రం అమలవుతుందన్నారు.ఈ అంశంపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపి, అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఒక ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. దేశ బలం భిన్నత్వంలో ఏకత్వమని, ఇలాంటి కీలక నిర్ణయాలు ఆ ఏకత్వాన్ని బలోపేతం చేసేలా ఉండాలని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అందరికీ న్యాయం చేసే పరిష్కారాన్ని కనుగొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 16 నుంచి పార్లమెంట్
# ప్రత్యేక సమావేశాలు

మొదటి పేజీ తరువాయి

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల సందర్భంగా, సెప్టెంబర్ 19, 2023న లోక్‌సభలో ఈ బిల్లు ప్రవేశపెట్టారు. సెప్టెంబర్ 20, 2023న, అనుకూలంగా 454 ఓట్లు, వ్యతిరేకంగా 2 ఓట్లతో ఇది ఆమోదం పొందింది. సెప్టెంబర్ 21, 2023న రాజ్యసభ, 214 ఓట్లతో ఏకగ్రీవంగా దీనిని ఆమోదించింది. సెప్టెంబర్ 28, 2023న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దీనిపై సంతకం చేయడంతో ఇది చట్టంగా రూపుదిద్దుకుంది.

**నిబంధనలు** : 33% రిజర్వేషన్: లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు, ఢిల్లీ శాసనసభలోని మొత్తం సీట్లలో మూడింట ఒక వంతును మహిళలకు రిజర్వ్ చేస్తుంది. 2023లో ఆమోదించినప్పటికీ, అసలు చట్టం అమలులోకి రావడానికి ముందు కొత్తగా జన గణన, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అవసరం. ఈ బిల్లు అమలులో ఉన్న చట్టపరమైన అడ్డంకులను అధిగమించడమే ఈ సమావేశం లక్ష్యం. జన గణన నుంచి వేరుచేయడం: కొత్త జన గణన, తదుపరి నియోజకవర్గాల పునర్విభజన అవసరం నుంచి రిజర్వేషన్‌ను వేరుచేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. వాస్తవానికి, 2023లో అమల్లోకి వచ్చిన ఈ చట్టం, తదుపరి జన గణన (2027కి వాయిదా పడింది) తర్వాతే అమల్లోకి వచ్చేది, దీనివల్ల ఈ అమలు 2034 వరకు వాయిదా పడే అవకాశం ఉండేది. ఆలస్యమైన 2021 జనాభా గణన ఫలితాల కోసం వేచి ఉండకుండా, 2011 జన గణన డేటాను ఉపయోగించాలని ప్రభుత్వం యోచిస్తోంది, దీనివల్ల 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి దీనిని అమలు చేయడానికి వీలవుతుంది.

సీట్ల విస్తరణ: లోక్‌సభలోని మొత్తం సీట్ల సంఖ్యను పెంచడం ఈ ప్రణాళికలో ఒక కీలక భాగం. వీటిలో, 273 సీట్లు మహిళల కోసం కేటాయిస్తారు. ప్రస్తుత సభ్యులకు ఉన్న సీట్ల సంఖ్యను తగ్గించకుండానే, మహిళల కోటాను అమలు చేయడానికి ఈ విస్తరణ వీలు కల్పిస్తుంది. నివేదికల ప్రకారం, షెడ్యూల్డ్ కులాల వారికి కేటాయించిన సీట్లు 84 నుండి 126/136కు, అలాగే షెడ్యూల్డ్ తెగల వారికి కేటా



యించిన సీట్లు 47 నుండి 70కి పెరిగే అవకాశం ఉంది.

**నియోజకవర్గాల పునర్విభజన:** కొత్త జనాభా గణాంకాల కోసం వేచి చూడకుండా, 2011 జనాభా లెక్కల డేటా ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను తిరిగి గీయడానికి ప్రభుత్వం 2026 పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. విజయవంతమైన జనాభా నియంత్రణ కారణంగా కేరళ, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు తక్కువ సీట్లతో శిక్షించకుండా, వారి ఆందోళనలను పరిష్కరించడమే ఈ చర్య ఉద్దేశ్యం. రాష్ట్రాల సాపేక్ష రాజకీయ ప్రాబల్యాన్ని కాపాడుకోవడానికి, జనాభా నియంత్రణకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిష్కరించడానికి, సీట్లను దామాషా పద్ధతిలో పెంచే అవకాశం ఉంది.

**చట్టపరమైన ప్రక్రియ:** ఈ చర్యకు రెండు కీలక రాజ్యాంగ సవరణలు అవసరం. వీటికి పార్లమెంటు ఉభయ సభలలోనూ మూడింట రెండు వంతుల మెజారిటీ తప్పనిసరి : కాంగ్రెస్ అధినేత ఖర్గేతో ప్రధాని మోడీ ఏమన్నారు? అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణ స్థల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో, మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు నిమిత్తం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని ప్రధాని మోడీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరారు. మహిళల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకున్న చర్యలకు మద్దతు ఇవ్వడాన్ని పార్టీలకతీతంగా అందరూ పంచుకోవాల్సిన ఉమ్మడి బాధ్యతగా పరిగణించాలని ఆయన నొక్కి చెప్పారు. ఈ బిల్లు మహిళల ప్రయోజనాల కోసమే తీసుకువస్తున్నట్టు ఖర్గేతో పేర్కొంటూ, దీనికి అందరి సమిష్టి మద్దతును ప్రధాని కోరారు. దీనికి ప్రతిస్పందనగా, కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయం తీసుకునే ముందు, ఈ ప్రతిపాదనపై అంతర్గతంగా చర్చించుకుంటుందని ఖర్గే తెలిపారు. ఈ విషయంపై తగినంత లోతుగా చర్చించిన అనంతరం తమ వైఖరిని తెలియజేస్తామని ఆయన సూచించారు. సోమవారం నాడు విజ్ఞాన్ భవన్‌లో జరిగిన జాతీయ నారీ శక్తి వందన్ సమ్మేళనంలో పాల్గొన్న ప్రధాన మంత్రి , ఈ చర్యను 21వ శతాబ్దపు అత్యంత కీలక నిర్ణయాలలో ఒకటిగా అభివర్ణించారు. కాగా, ఈ బిల్లు ప్రతిని అందించడంలో జరిగిన జాప్యాన్ని, అలాగే దాని సమయాన్ని ప్రతిపక్షం ప్రశ్నిస్తోంది.




"డాక్టర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ఈ దేశానికి రాజ్యాంగాన్ని అందించారు. కానీ నేడు, ఆర్ఎస్ఎస్-బిజెపిల విద్వేష పూరిత సిద్ధాంతం ఆ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తోంది. ఆర్ఎస్ఎస్-బిజెపి వారు రాజ్యాంగంపై నేరుగా దాడి చేయలేరు. కానీ వివిధ సంస్థలలో తమ సొంత మనుషులను నియమించడం ద్వారా, ఓట్లను దొంగిలించడం ద్వారా, వారు ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన అన్నారు. ప్రేమ, ఐక్యత ద్వారా మాత్రమే దేశం ముందుకు సాగుతుంది."

* లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, రాహుల్ గాంధీ

## వేమన పద్యం

ఒరుని చెరచెదమని యుల్లమందెంతురు
తమకు చేటెరుగని ధరణి నరులు
తమ్ము జెరచువాడు దైవంబులేడొకో
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# బోనులో ఎన్నికల సంఘం

ఓటర్ల జాబితాలో తమకు ఓటు ఉండడం, స్వదేశంలో ఓటు హక్కు వినియోగించుకోవడం రాజ్యాంగ హితమైనవే కాదు,వ్యక్తుల హృదయగతమైనవి కూడా అని కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఎరుకపరచవలసి రావడం అత్యంత బాధాకరం. ఎన్నికల సంఘం ఉన్నదే ఓటర్ల ఓటు హక్కును కాపాడడం కోసం. ఎన్నికల్లో అక్రమాలను నిరోధించి ఓటుకు రక్షాకవచంగా పని చేయడమే ఎన్నికల కమిషన్ పరమావధి.అందుకు పూర్తి విరుద్ధంగా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల నుంచి పెద్ద ఎత్తున ఓటర్లను తొలగిస్తున్నదనే అభిప్రాయం ప్రజల్లో బలపడిపోయింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ లో సాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ వివాదాస్పదమై సుప్రీం కోర్టుకు ఎక్కిన తర్వాత ఈ ప్రక్రియను అనుమానించవలసిన పరిస్థితి నెలకొన్నది. ఎన్నికల ను పురస్కరించుకొని మొదట బీహార్ లో జరిపిన సర్ ప్రక్రియను ఆ తర్వాత రెండవ దశగా చేపట్టారు. అది ముగిసిన తర్వాత 12 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత రాష్ట్రంలో 5 కోట్ల 20 లక్షల ఓట్లను తొలగించినట్లు సమాచారం.ఒక్క పశ్చిమ బెంగాల్ లోనే 90 లక్షల ఓట్లను తీసేశారు.మరణించిన వారి పేర్లను, ఇతరేతర చిన్న చితక కారణాల వల్ల కొన్ని ఓట్లు తొలగించడం సహజమే కాని కోట్లాది ఓట్లను రద్దు చేయవలసిరావడమే ఆందోళనకరం.ఇంకా చాలా రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ జరగవలసి ఉంది. హిందుత్వ సిద్ధాంతం దిక్సూచిగా నడుస్తున్న పాలక బిజెపి తనకు ససేమిరా ఓటు వేయని వర్గాలను ఓటర్ల జాబితాల నుంచి తొలగింప జేయాలన్న వ్యూహాన్ని ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్నదనే అనుమానం వ్యాపించి ఉంది.సరిహద్దు రాష్ట్రాల్లోకి బంగ్లా దేశ్, పాకిస్తాన్ వంటి దేశాల నుంచి వచ్చే చొరబాటుదార్లను ఏరివేసే పేరిట భారతీయులైన ముస్లింల పేర్లనూ తొలగిస్తున్నారనే భయాలు వ్యక్తమవుతున్నాయి.భారత సైన్యంలో టెక్నీషియన్ గా పనిచేసిన ముహమ్మద్ దావూద్ పేరును, ఆయన ముగ్గురు పిల్లల పేర్లనూ పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితా నుంచి తీసి పారేశారు. ఓటు హక్కుకు పౌరసత్వానికి కనిపించని బంధం ఉంది.ఒక వ్యక్తి తన సొంత గడ్డగా భావించి దానితో పెనవేసుకునే దేశంలో ఓటు హక్కును కోల్పోవడం అమిత బాధాకరంగా ఉంటుంది. ఎన్నికల సంఘం బెంగాల్ లో చేపట్టిన హేతుబద్ధ లోపాలు లొసుగుల పరిశీలన అనేదానిని ఒక్క బెంగాల్ లోనే ఎందుకు జరిపిస్తున్నారని సుప్రీం కోర్టు ఇ సి ని ప్రశ్నించిందంటే దాని వాలకాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి ని తప్పించినప్పుడే సర్ అన్యాయాలకు అవకతవకలకు గట్టి బీజాలు పడ్డాయి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.


voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# భారత కమ్యూనిజానికి అతివాద మితవాదాలు చేసిన నష్టం

భారత కమ్యూనిస్టు ఉద్యమం నేడు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నది. సిద్ధాంత పరమైన విభేదాలతో పార్టీ అనేక చీలికలకు లోను అయ్యింది. సిపిఐ, సిపిఐ ఎం పార్టీలు పాలక వర్గ పార్టీలతో ఎన్నికల పొత్తులతో పార్లమెంటరీ విధానంలో కలిసి పని చేస్తుంటే, మావోయిస్టు పార్టీ సాయుధ పోరాటం పేరుతో విధ్వంసక విధానాలు అమలు జరిపింది. చివరికి ఆ పార్టీ నాయకత్వం పాలక ప్రభుత్వాల ముందు లొంగిపోయే విధానం అనుసరిస్తున్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలోనే అతివాద-మితవాద ధోరణులు ముందుకు వచ్చి నేటికి కొనసాగుతున్నాయి. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఇది ఒక పార్టీకి చాలా సుదీర్ఘ కాలం. ఇంత సుదీర్ఘ చరిత్ర ఉన్న భారత కమ్యూనిస్టు ఉద్యమం నేడు వెనక పట్టుపట్టటానికి అందుకు కారణాలు ఏమిటి అన్న లోతుల్లోకి వెళ్లాలి.

1925లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీకి జాతీయోద్యమంలో స్వతంత్ర కార్యక్రమంతో ముందుకు పోలేకపోయింది. పి సి జోషి నాయకత్వాన ఉన్న కేంద్ర కమిటీ , సంస్కరణ వాదాన్ని ,వర్గ సామరస్యాన్ని అమలు జరిపింది. బ్రిటిష్ సామ్రాజ్య వాద వలస పాలన నుండి దేశ విముక్తి కోసం స్వతంత్ర ప్రజా ఉద్యమాన్ని నిర్మించకుండా గాంధి నాయకత్వాన ఉన్న ఉద్యమం చుట్టూ తిరిగే కార్యాచరణ అమలు జరిపింది. వర్గ ఉద్యమాల దృక్పధాన్ని పక్కన పెట్టింది. ఫలితంగా కమ్యూనిస్టు పార్టీ జాతీయోద్యమ నాయకుడిగా రూపొందలేక పోయింది. జోషి నాయకత్వాన ఉన్న పార్టీ కేంద్ర నాయకత్వం కాంగ్రెస్ విధానాల చుట్టూ తిరుగుతున్నా దేశంలోని అనేక ప్రాంతాల్లో రైతాంగ ఉద్యమాలు ముందుకు వచ్చాయి. 1943లో కయ్యూరు రైతుల తిరుగుబాటు, 1946- 51 లో తెలంగాణ రైతాంగ పోరాటం, 1946 లో తిరువాన్కూర్ సంస్థానంలో పున్నప్రవాయలార్ ఉద్యమం, 1948లో బెంగాల్లో తెభాగ ఉద్యమాలు ఆయా రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాన జరిగాయి. ఈ పోరాటాల్లో చారిత్రక ప్రాధాన్యత కలిగిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. ఈ పోరాటం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన నైజాం నిరంకుశ పాలనకు, జమీందార్లకు , జాగీర్దార్లకు వ్యతిరేకంగా, వెట్టి చాకిరీ రద్దు, దున్నేవానికే భూమి, భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం తెలంగాణ ప్రజలు సాగించిన సాయుధ తిరుగుబాటు. పది లక్షల ఎకరాల భూములను ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. 10 వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయి. జమీందార్లు, జాగీర్దార్లు పట్టణాలకు పారిపోయారు. ఈ పోరాటం లో 4 వేల మంది కామ్రేడ్స్ ప్రాణాలు కోల్పోయారు.

జోషీ సంస్కరణ వాద విధానాలకు వ్యతిరేకంగా పార్టీలో సిద్ధాంత పోరాటం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో 1948లో పార్టీ రెండవ కాంగ్రెస్ ప్రారంభమైంది. ఈ కాంగ్రెస్ స్వాతంత్ర్యాన్ని భూటకపు స్వాతంత్ర్యం అని, జాతీయ బూర్జువా వర్గంతో సహా బూర్జువా వర్గం మొత్తం సామ్రాజ్యవాద శిబిరంలో చేరిందని, ఫ్యూడల్ ,బూర్జువా వర్గాలు అధికారాన్ని చెలాయిస్తున్నాయని, దేశ వ్యాపిత తిరుగుబాటు పంథాతో విప్లవం సాగుతుందని, ఈ విప్లవం జనతా ప్రజాతంత్ర విప్లవమని, జనతా ప్రజాతంత్ర విప్లవం,సోషలిస్టు విప్లవం ఒకదానితో ఒకటి పెనవేసుకుసాగుతాయనీ, స్థూలంగా రష్యా మార్గమని నిర్వచించింది. పి సి జోషి నాయకత్వాన వున్న కేంద్ర కమిటీ యొక్క సంస్కరణవాద విధానాలను వ్యతిరేకించింది. ఈ కాంగ్రెస్ తెలంగాణ రైతాంగ పోరాటాన్ని కూడా సంస్కరణవాద పోరాటంగా కొట్టి వేసింది. తన ఒంటెత్తువాద కోణం నుంచి తెలంగాణ పోరాటాన్ని నిరాకరించింది. కార్యదర్శిగా పి సి జోషి స్థానంలో రణదివెను ఎన్నుకుంది. 1947 స్వాతంత్ర్యం బూటకమని చెప్పడం వరకు ఈ మహాసభ సరిగ్గానే చెప్పింది. బూర్జువా వర్గం గురించి స్పష్టమైన అవగాహన ఇవ్వలేక పోయింది. అంతేగాక అతివాద, ఒంటెత్తు విధానాలు చేపట్టింది. ప్రజాతంత్ర విప్లవం, సోషలిస్టు విప్లవ దశలను కలగాపులగం చేసింది. మిత్ర వర్గాల, శత్రు వర్గాల మధ్య ఖచ్చితమైన విభజన లేదు. కంటికి కన్ను, పంటికి పన్ను నినాదం తో వ్యక్తులపై దాడులు, ఆస్తుల విధ్వంసం కార్యక్రమం ఇవ్వబడింది. ఈ పంథా రెండు విధాల నష్టం కలిగించింది. సరైన దిశలో సాగుతున్న తెలంగాణ రైతాంగ ప్రజా ప్రతిఘటనోద్యమం పక్క దారి పట్టటానికి దారి తీసింది. గ్రామీణ ప్రాంతాల్లో గెరిల్లా స్థావరాల నిర్మాణం, వ్యవసాయ విప్లవోద్యమ విస్తరణ, విప్లవోద్యమ దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా దేశ వ్యాపితంగా చేయవలసిన సన్నాహాలు వమ్ముచేయబడ్డాయి. రెండు- కేంద్ర కమిటీలో మితవాద, అవకాశవాదం భారత కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వంలో తిష్ట వేసి కూర్చోవటానికి అవకాశం ఇచ్చింది. అంతిమంగా అతివాద ఒంటెత్తువాదం, మితవాద లొంగుబాటు వాదం విప్లవ ప్రజా ఉద్యమాన్ని బలి తీసుకున్నాయి. అందుకే లెనిన్ మహాశయుడు అతివాద అవకాశవాదం, మితవాద అవకాశవాదం బొమ్మా బొరుసువంటివనీ, కవల పిల్లలని నొక్కి చెప్పాడు. ఆంధ్రా థీసిస్: పార్టీ లోని రెండు పెడధోరణుల నుండి తెలంగాణ ప్రజా విప్లవ పోరాట నాయకత్వంలోని ఒక సెక్షన్ విడగొట్టుకుంది. ఈ సెక్షన్ కామ్రేడ్స్ చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య ల నాయకత్వాన 1948 ఏప్రిల్ లో ఒక థీసిస్ ని రూపొందించి కేంద్ర కమిటీ ముందు ఉంచింది. దీనినే ఆంధ్రా థీసిస్ అంటారు. ఈ థీసిస్



భారత వ్యవస్థ దళారీ బూర్జువా, భూస్వామ్య వ్యవస్థ అనీ, కార్మిక వర్గ నాయకత్వాన కార్మిక, కర్షక మైత్రిని నెలకొల్పుతూ, జాతీయ బూర్జువా వర్గాన్ని కలుపుకు రావడం విప్లవ వ్యూహంగా పేర్కొంది. గ్రామీణ ప్రాంతంలో కూలీలు, పేద,మధ్య తరగతి , ధనిక రైతాంగంతో కూడిన ఐక్య సంఘటన ఏర్పాటు చేయడం, ప్రజా విప్లవ పంథాలో వ్యవసాయ విప్లవోద్యమాన్ని నిర్మించడం, గ్రామాలను విముక్తి చేస్తూ, విముక్తి ప్రాంతాలను నిర్మించుకుంటూ సాగే విప్లవం అని పేర్కొంది. ఈ థీసిస్ కేంద్ర కమిటీ ముందు ఉంచే నాటికి తెలంగాణలో అమలవుతున్న విధానాలు ఈ థీసిస్ కి అనుగుణమైనది. సరైన ఈ థీసిస్ ని రణదెవె నాయకత్వాన ఉన్న కేంద్ర కమిటీ తిరస్కరించి, అవహేళన చేసింది. పి సి జోషి ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు ఐక్య జాతీయ సంఘటన విధానంతో అమలు జరిపిన సంస్కరణవాద, మితవాద పంధాన, రణదివే ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు దేశ వ్యాపిత ఒట్టెత్తు అతివాద తిరుగుబాటు పంధాను కమ్యూనిస్టు పార్టీ అమలు జరిపింది. ఈ రెండు పంధాలు విప్లవోద్యమ నిర్మాణానికి తీవ్ర నష్టం కలిగించాయి. దేశ విప్లవ పరిస్థితుల్లో ఉన్న అసమానతలను గ్రహించకుండా రణదివే దేశ వ్యాపిత తిరుగుబాటుకు పిలుపు ఇచ్చాడు. 1948లో పార్టీ పై నెహ్రూ ప్రభుత్వం నిషేధం విధించి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. పార్టీకి జరుగుతున్న నష్టాల నేపథ్యంలో కేంద్ర కమిటీ 1950లో సమావేశమై ఆంధ్రా థీసెస్ ను చర్చించి, రణదివే పంధాను వ్యతిరేకించి ఆయన స్థానంలో చంద్ర రాజేశ్వరరావుని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నది. కామ్రేడ్ రాజేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నిక కావటంతో సరైన మార్గంలో విప్లవోద్యమం ముందుకు పోతుందని పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాసులు ఆశించారు. సరైన పంధా అమలు జరగకుండా అతివాద, మితవాదులు ఐక్యంగా ఎలా అడ్డు పడతారో కూడా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తెలియ చేసింది. నెహ్రూ సైన్యాలు ప్రవేశం తర్వాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని విరమించాలని మితవాదులు పేర్కొన్నారు. రావి నారాయణరెడ్డి ఢిల్లీ వెళ్లి రైతాంగ సాయుధ పోరాటాన్ని విరమించాలని కరపత్రాలు పంపిణీ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ గురించి పార్టీలో బిన్నాభిప్రయాలు ముందుకు వచ్చాయి. అతివాద, మితవాద ధోరణులకు ప్రాతినిధ్యం వహించే నాయకుల అడ్డంకులు, అవరోధాలను ఎదుర్కొని సరైన పంధాను అమలు జరపడంలో, ఆ పంధాకు ప్రాతినిధ్యం వహించే నాయకత్వంలో ఉన్న ఊగిసలాట ధోరణి ఫలితంగా, పోరాటం కొనసాగించాలా లేక విరమించాలా అన్నవిషయంపై ప్రతిష్టంభన ఏర్పడింది. కామ్రేడ్ స్టాలిన్ సలహా కోసం చంద్ర రాజేశ్వరరావు, బసవపున్నయ్య, అజయ్ ఘోస్, ఎస్ ఎ డాంగే ప్రతినిధి బృందం రష్యాకు వెల్లడం జరిగింది. స్టాలిన్ ఇరు పక్షాల వాదనలు విని, వివరణలు తీసుకుని వాటి ఆధారంగా ప్రతినిధుల బృందానికి సూచనలు చేసి, పోరాటాన్ని కొనసాగించలేని పరిస్థితుల్లో తాత్కాలిక విరమణ చేసి పోరాటాన్ని తిరిగి పునర్ నిర్మాణం చేయాలని చెప్పటం జరిగింది. తాను చేసిన సూచనలను అమలు జరపాలా వద్దా అన్నది మీరే నిర్ణయించుకోవాలని కూడా స్టాలిన్ చెప్పారు. స్టాలిన్ తో చర్చలు సందర్భంగా ఆంధ్రా థీసిస్ ప్రాతినిధ్యం వహించిన రాజేశ్వరరావు బసవపున్నయ్య లు తమ అభిప్రాయాలను గట్టిగా చెప్పలేక పోయారు.చివరికి పోరాట విరమణ ఆమోదం జరిగింది.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమించిన తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా అజయ్ కుమార్ ఘోష్ బాధ్యత చేపట్టాడు. 1951 పాలసీ స్టేట్ మెంట్ లో పంథా గురించి ఇలా చెప్పింది." అనేక నెలల పాటు సుదీర్ఘ చర్చ జరిగిన తర్వాత దేశ స్వాతంత్ర్యాన్ని, ప్రజల ఆనందాన్ని సాధించటానికి సరైన పంధాకు సంబంధించిన నూతన అవగాహనకు పార్టీ ఇప్పుడు వచ్చింది. ఈ పంధాను రష్యా పంధా అని లేక చైనా పంథా అని పిలవం. ఇది మార్క్స్, ఏంగిల్స్, లెనిన్, స్టాలిన్ ల బోధనలకు అనుగుణమైనదిగా, చరిత్రలో జరిగిన అన్ని పోరాటాలు, ప్రత్యేకించి రష్యా, చైనాలు అందించిన గుణపాఠాలను వినియోగించుకునేదిగా ఉండాలి, ఉంటుంది. వ్యక్తిగత హింసావాదానికి మార్క్సిజం, లెనినిజంలో స్థానం లేదని కూడా చెప్పింది.

పార్టీ లో అజయ్ ఘోష్ నాయకత్వాన ఉన్న మితవాద, అవకాశ వాదం పైచేయి సాధించి 1951 పాలసీ స్టేట్ మెంట్ నుండి వైదొలగింది. 1953 డిసెంబర్ 1954 జనవరి పార్టీ కాంగ్రెస్, ' స్వాతంత్ర్యాన్ని సాధించాలి ' అనే దానికి బదులు '' స్వాతంత్ర్యాన్ని రక్షించాలి '' అన్న సూత్రీకరణను తెచ్చింది. పార్లమెంట్ మార్గంలో ప్రజాస్వామిక ఐక్య సంఘటన ప్రభుత్వ ఏర్పాటు చేయటాన్ని లక్ష్యంగా పేర్కొంది . జనతా ప్రజాస్వామిక లక్ష్యాన్ని ఎత్తివేసింది. 1955నాటికి భారత స్వాతంత్ర్యం గురించి 1951 పాలసీని తిరగతోడింది. 1956 ఏప్రిల్ పాల్ఘాట్ మహాసభ భారతదేశం '' నూతనంగా స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం పొందిన దేశం అన్న సూత్రీకరణ చేసింది. జాతీయ ప్రజాస్వామిక సంఘటన, '' ప్రజల ప్రజాస్వామిక సంఘటన" అన్న రెండు సూత్రీకరణల ప్రాతిపదికన కేంద్ర కమిటీ రెండు గ్రూపులుగా విడిపోయింది . 1958 అమృత్ సర్ మహాసభ శాంతియుత పద్ధతుల ద్వారా అధికారంలోకి రావచ్చని పేర్కొంది. 1960 విజయవాడ లో జరిగిన మహాసభ లో రెండు సెక్షన్ల మధ్య విభేదాలు తీవ్ర మైనాయి. ఈ విభేదాలకు కారణం 1951 స్టేట్ మెంట్ నుంచి అజయ్ ఘోష్ వర్గం తప్పుకోవడమే.

తీవ్ర భిన్నాభిప్రాయాల నేపథ్యంలో 1964లో పార్టీ చీలికకు దారి తీసింది. సిపిఐ నుంచి విడిపోయిన సిపిఐ (యం) పార్టీ ఏర్పడింది. భారత బూర్జువావర్గాన్ని బడా బూర్జువా వర్గంగా, అది సామ్రాజ్యవాదంపై ఆధారపడేదిగా ఉంటుందని చెప్పినప్పటికీ దాని దళారీ స్వభావాన్ని గుర్తించలేదు. బడా బూర్జువా, భూస్వామ్య రాజ్య నియంతృత్వ స్వభావాన్ని గుర్తించ నిరాకరించింది. శాంతియుత పద్ధతుల్లో శ్రామిక వర్గ అధికారాన్ని నెలకొల్పటంపై నమ్మకం ప్రకటించింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వెడల నమ్మకం పెట్టుకుంది. ఐక్య సంఘటన ప్రభుత్వాలను కాపాడుకొనుట ముఖ్యమని భావించింది.'' ప్రస్తుత అభివృద్ధి దశలో మొత్తం పార్టీ యొక్క భవిష్యత్ ఈ మంత్రి వర్గాలను జయప్రదంగా నిర్వహించడంతో సన్నిహితంగా ముడిపడి ఉంది. అలాగే మంత్రివర్గాల్లోని మన పార్టీ పాత్రతో అది ముడిపడి ఉంది.' '' మిశ్రమ ప్రభుత్వాల ద్వారా శాంతియుత విప్లవానికి మంచి అవకాశాలు ఉన్నాయి '' ( నూతన పరిస్థితుల్లో-నూతన కర్తవ్యాలు- సిపియం డాక్యుమెంట్ 1967) దీన్ని గమనిస్తే సిపిఐ, సిపియం మధ్య మాటల తేడా తప్ప ఒకే విధానం కలిగి ఉన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, బూర్జువా , భూస్వామ్య పార్టీలతో కలిసి ఐక్య సంఘటన ప్రభుత్వాల ఏర్పాటు వీటి లక్ష్యం.

(మిగతా రేపు )



బొల్లిముంత సాంబశివరావు
9885983526

# లోభి కడుపు నిండదు.. లోకం ఆకలి తీరదు

మానవ పరిణామ క్రమంలో అడవి నుంచి అంతరిక్షం వరకు సాగిన ప్రయాణంలో మనిషి తనతో పాటు తెచ్చుకున్నవి రెండు ప్రాథమిక గుణాలు ఒకటి చేతులు చాచి ఇచ్చే దాతృత్వం , రెండు గుప్పిట బిగించి దాచుకునే లోభం . ప్రకృతి ఒడిలో మొదలైన ఈ ద్వంద్వ యుద్ధం నేడు అత్యాధునిక సమాజపు పునాదులను కదిలిస్తోంది. దాతృత్వం సమాజాన్ని అల్లుకుపోయే దారంలా పనిచేస్తే, లోభం ఆ దారాన్ని తెంపివేసే కత్తెరలా మారుతోంది. నేటి గ్లోబల్ విలేజ్ యుగంలో ఈ రెండింటి మధ్య సాగుతున్న సంఘర్షణను నిశితంగా పరిశీలిస్తే, దురదృష్టవశాత్తూ లోభం అనే విషవృక్షమే తన కొమ్మలను వేగంగా విస్తరిస్తోందని అర్థమవుతుంది. చాలామంది భావించేట్లు లోభం అంటే కేవలం బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకోవాలనే తాపత్రయం మాత్రమే కాదు. అది అంతకు మించిన ఒక మానసిక రుగ్మత. అధికారం కోసం ఆరాటం, కీర్తి ప్రతిష్టల కోసం పాకులాట, పరాయి భూమిని కబళించాలనే తపన, గుర్తింపు కోసం ఎంతకైనా తెగించే తత్వం వీటన్నింటి సారాంశమే లోభం. ఒక వ్యక్తి లోభానికి లోనైనప్పుడు, అది అతని వ్యక్తిగత వినాశనంతో ఆగదు. అడవిలో రాజుకున్న చిన్న నిప్పుకణికలా అది క్రమంగా విస్తరించి, పచ్చని కుటుంబాలను, వేల జీవితాలను, చివరకు ఒక సంపూర్ణ సామాజిక వ్యవస్థను బూడిద చేయగలదు.చరిత్ర పుటలు తిరగేస్తే, లోభం వల్ల కుప్పకూలిన సామ్రాజ్యాల శిథిలాలు మనకు దర్శనమిస్తాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన రోమన్ సామ్రాజ్యం పతనానికి బయటి శత్రువుల కన్నా లోపలి పాలకుల అత్యాశే ప్రధాన కారణమని చరిత్రకారులు ఘోషిస్తారు. ప్రజల కష్టార్జితాన్ని పన్నుల రూపంలో పిండి, విలాసాల కోసం, వ్యక్తిగత ఆస్తుల కోసం వెచ్చించిన నాటి పాలకులు తమ సొంత గోతిని తామే తవ్వుకున్నారు. భారతదేశ చరిత్రలోనూ రాజవంశాల మధ్య జరిగిన రక్తపాతాల వెనుక ఉన్నది భూమి పట్ల, సింహాసనం పట్ల ఉన్న ఈ లోభమే.నేటి భారతీయ సమాజంలో ఈ విషపు వేళ్ళు మరింత లోతుగా చొచ్చుకుపోయాయి. ఒక పేద రైతు సాగు భూమిని చౌకగా కాజేయడానికి బడా రాజకీయ శక్తులు పన్నే కుతంత్రాల నుండి, కార్పొరేట్ దిగ్గజాలు తమ లాభాల గ్రాఫ్ పెంచుకోవడం కోసం వేలాది మంది ఉద్యోగులను అకస్మాత్తుగా వీధిన పడేసే నిర్దాక్షిణ్య నిర్ణయాల వరకు అన్నీ లోభపు వికృత రూపాలే. పచ్చని అడవులను కాంక్రీట్ వనాలుగా మార్చే కలుషిత పరిశ్రమల వెనుక ఉన్నది అభివృద్ధి కాదు, ప్రకృతిని దోచుకోవాలనే దురాశ మాత్రమే.లోభి కడుపు నిండదు, కానీ అతని లోభం వల్ల వేరే వారి జీవితాలు నిండలేవు.ఆర్థిక రంగంలో లోభం సృష్టించే



మారణకాండ అంతర్జాతీయ స్థాయిలో స్పష్టంగా కనిపిస్తుంది. 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం (Subprime Crisis) దీనికి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. వాల్‌స్ట్రీట్ బ్యాంకర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల మితిమీరిన అత్యాశ వల్ల కోట్లాది మంది సామాన్యులు తమ జీవితకాల పొదుపును, ఇళ్లను కోల్పోయారు. ఒక వ్యక్తి లేదా ఒక చిన్న సమూహం యొక్క లోభానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అమాయక ప్రజలు మూల్యం చెల్లించాల్సి రావడం కన్నా క్రూరత్వం మరొకటి ఉండదు.అతి భయంకరమైన విషయం ఏమిటంటే, సేవ ప్రధానంగా ఉండాల్సిన విద్యా, వైద్య రంగాలు నేడు వ్యాపార సామ్రాజ్యాలు గా మారిపోయాయి. లాభమే పరమావధిగా నడిచే కార్పొరేట్ పాఠశాలలు, కేవలం ఫీజులు కట్టగల వారికే జ్ఞానాన్ని విక్రయిస్తున్నాయి. దీనివల్ల ప్రతిభ ఉన్నా పేదరికం కారణంగా వెనుకబడిపోయే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో తయారయ్యే తరం నైతిక విలువలను (Ethical Values) విస్మరించి, కేవలం ఆర్థిక విలువలను (Materialistic Values) మాత్రమే పరమావధిగా భావిస్తోంది.

వైద్య రంగంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రోగి ప్రాణం కంటే ఫార్మా కంపెనీల ప్రాఫిట్ మార్జిన్లకే ప్రాధాన్యత పెరిగింది. నిస్సహాయతను పెట్టుబడిగా మార్చుకుని, మందుల ధరలను కృత్రిమంగా పెంచడం మానవత్వానికే మచ్చ. ఆహార రంగంలోనైతే, కేవలం అమ్మకాలు పెంచుకోవడానికి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కల్తీ ఉత్పత్తులను మార్కెట్లోకి వదులుతున్న పారిశ్రామిక లోభం సమాజాన్ని రోగగ్రస్తం చేస్తోంది.రాజకీయాల్లో లోభం అంటే అది అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలనే వ్యసనం. పదవిని అడ్డం పెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకోవడం, అభివృద్ధి నిధులను తమ జేబుల్లోకి మళ్లించుకోవడం నేడు సర్వసాధారణమైపోయింది. ఒక నేత అవినీతికి పాల్పడినప్పుడు, అతను కేవలం డబ్బు దొంగిలించడం లేదు, ఒక తరం అభివృద్ధిని, ఒక గ్రామం యొక్క భవిష్యత్తును దొంగిలిస్తున్నాడు. పేదల కోసం కేటాయించిన సొమ్ము లోభుల విలాసాలకు ఖర్చవుతున్నప్పుడు సమాజం నైతికంగా దివాళా తీస్తుంది.

"వైద్య రంగంలోనూ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రోగి ప్రాణం కంటే ఫార్మా కంపెనీల ప్రాఫిట్ మార్జిన్లకే ప్రాధాన్యత పెరిగింది. నిస్సహాయతను పెట్టుబడిగా మార్చుకుని, మందుల ధరలను కృత్రిమంగా పెంచడం మానవత్వానికే మచ్చ. ఆహార రంగంలోనైతే, కేవలం అమ్మకాలు పెంచుకోవడానికి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కల్తీ ఉత్పత్తులను మార్కెట్లోకి వదులుతున్న పారిశ్రామిక లోభం సమాజాన్ని రోగగ్రస్తం చేస్తోంది. రాజకీయాల్లో లోభం అంటే అది అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలనే వ్యసనం. పదవిని అడ్డం పెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకోవడం, అభివృద్ధి నిధులను తమ జేబుల్లోకి మళ్లించుకోవడం నేడు సర్వసాధారణమైపోయింది. ఒక నేత అవినీతికి పాల్పడినప్పుడు, అతను కేవలం డబ్బు దొంగిలించడం లేదు, ఒక తరం అభివృద్ధిని, ఒక గ్రామం యొక్క భవిష్యత్తును దొంగిలిస్తున్నాడు. పేదల కోసం కేటాయించిన సొమ్ము లోభుల విలాసాలకు ఖర్చవుతున్నప్పుడు సమాజం నైతికంగా దివాళా తీస్తుంది."

అసమానత వృద్ధి రేటు గత 20 ఏళ్లలో 26% పెరుగుదల గా వుంది , పేదరికానికి మూలం 68% కేసులు లోభం వల్లనే వనరుల అసమాన పంపిణీ వల్లే ప్రకృతి వనరుల తరుగుదల ఏటా 15% గా వుంది .అధిక దోపిడీ మనం ప్రస్తుతం డిజిటల్ లోభం యుగంలో ఉన్నాం. సోషల్ మీడియా దిగ్గజాలు వినియోగదారుల దృష్టిని (Attention) దోచుకుని, వారి డేటాను విక్రయించి కోట్లు గడిస్తున్నాయి. మనిషి ఏకాగ్రతను, మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తూ, వారిని తమ అల్గారిథమ్స్ కు బానిసలుగా మార్చుకోవడం ఒక ఆధునిక నేరం. ఇది కేవలం వ్యాపారం కాదు, ఒక తరం యొక్క మేధస్సును లోభంతో పణంగా పెట్టడం.ఆర్థిక లోభం వలన సంపదను కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకరించడం.రాజకీయ లోభం తో అధికారం కోసం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కడం.పర్యావరణ లోభం తో భావి తరాల వనరులను నేడే దోచుకోవడం.విద్యా లోభం చదువును కేవలం లాభసాటి సరుకుగా మార్చడం.వైద్య లోభం రోగాల మీద వ్యాపారం చేయడం.పరిష్కార మార్గం ఎక్కడ ఉంది?లోభాన్ని చట్టాలతో పూర్తిగా అరికట్టడం అసాధ్యం. ఎందుకంటే చట్టాలను అమలు చేసే వారిలోనూ లోభం ఉండవచ్చు. ఇది వ్యక్తిగత స్థాయి నుంచి మొదలు కావాల్సిన మార్పు.సంతృప్తి (Contentment) అవసరానికి మించి ఆశించడం మరొకరి హక్కును హరించడమే అనే స్పృహ ప్రతి మనిషిలో కలగాలి. కేవలం ర్యాంకుల కోసం కాకుండా, సామాజిక బాధ్యతను నేర్పే పాఠ్యాంశాలు విద్యా వ్యవస్థలో చేరాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో జవాబుదారీతనం పెరగాలి. అవినీతికి పాల్పడితే తప్పించుకోలేమనే భయం ఉండాలి. లోభాన్ని ఒక గొప్పతనంగా చూసే ధోరణి మారాలి. ఆడంబరాల కంటే సామాన్య జీవనం, దాతృత్వం పట్ల గౌరవం పెరగాలి. లోభం అనేది ఒక అంటువ్యాధి లాంటిది. ఇది మొదట వ్యవస్థలను నీరుగారుస్తుంది, తర్వాత మానవ సంబంధాలను చిన్నాభిన్నం చేస్తుంది, చివరకు సమాజపు ఆత్మను చంపేస్తుంది. వేమన చెప్పినట్లు, అల్పుడు ఆడంబరంగా పలికి తన లోభాన్ని కప్పిపుచ్చుకోవచ్చు, కానీ కాలక్రమేణా ఆ లోభమే అతన్ని ఏకాకిని చేస్తుంది.ఒక ఆరోగ్యకరమైన, సుస్థిరమైన సమాజం కావాలంటే మనం మన మనసుల్లోని లోభపు గోడలను కూల్చాలి. ప్రకృతి మన అవసరాలను తీర్చగలదు కానీ మన అత్యాశను కాదు. లోభం లేని చోట లోకం సుభిక్షంగా ఉంటుంది అనే సత్యాన్ని మనం గ్రహించాలి. మన పిల్లలకు మనం ఇచ్చే అతిపెద్ద ఆస్తి బ్యాంక్ బ్యాలెన్స్ కాదు, లోభం లేని స్వచ్ఛమైన సమాజం. ఇప్పుడే మనం మేల్కొనకపోతే, భావి తరాలు పీల్చే గాలి, తాగే నీరు కూడా లోభపు విషంలో మునిగిపోతాయి. మార్పు మనతోనే మొదలవ్వాలి, మన ఇంటి నుంచే ప్రారంభమవ్వాలి.



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169




# జాతీయం-అంతర్జాతీయం



## ఐప్యాక్ డైరెక్టర్‌ను విడుదల చేయాలి : టీఎంసీ

**ఈడీని 'రాజకీయ సాధనంసగా కేంద్రం వాడుకుంటోందని విమర్శ**



**కోల్‌కత, ఏప్రిల్ 14 (వుదయం) :**

బొగ్గు అక్రమ రవాణాకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసు ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిన ఇండియన్ పిఏసి కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐపాక్ ) డైరెక్టర్ వినేష్ చందేల్‌ను వెంటనే, బేషరతుగా విడుదల చేయాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరిక్ ఓ'బ్రియన్ మంగళవారం డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం చట్ట అమలు చర్యలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాల్ నుంచి కేంద్ర ఏజెన్సీలను ఉపసంహరించుకోవాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

కోల్‌కతాలో జరిగిన విలేకరుల సమావేశంలో టీఎంసీ ఎంపీ మాట్లాడుతూ, వినేష్ చందేల్‌ను తక్షణమే, బేషరతుగా విడుదల చేయాలని మేః డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికలకు ముందు బెంగాల్ నుంచి కేంద్ర ఏజెన్సీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని ఒక రాజకీయ సాధనంగా వాడుకుంటున్నారని, ఎన్నికలకు ముందు ఇటువంటి చర్యలు ఎన్నికల విధ్వంసానికి పాల్పడటంగా పరిగణించాలని ఓ'బ్రియన్ ఆరోపించారు.

పిఎంఎల్ ఎ కింద ఆ ఏజెన్సీ పనితీరును ఆయన విమర్శించారు. అవినీతి కేసులున్న ప్రతిపక్ష నాయకులు బీజేపీలో చేరిన తర్వాత శుభ్రపడిపోయారని కూడా ఆయన తీవ్రంగా విమర్శించారు.

నిన్నరాత్రి తమ కొత్త పేరును ప్రకటించుకున్న ఒక సంస్థ గురించి మాట్లాడుకుందాం. ఆ సంస్థను ఇంతకుముందు ఈడీ అని పిలిచేవారు. ఇప్పుడు వారు తమ పేరును 'ఎక్స్‌ట్రీమ్లీ డెస్పరేట్' (అత్యంత నిస్సహాయులు)గా మార్చుకున్నారు. పోలింగ్‌కు 10 రోజుల ముందు చట్టాన్ని అమలు చేయడం కాదు. ఇది ఎన్నికల విధ్వంసం. పీఎంఎల్‌ఏ విషయంలో ఈడీ గురించి మేం ఇదివరకే చెప్పాం, అయినా మళ్ళీ చెబుతున్నాం. అవినీతి కేసులున్న 25 మంది ప్రతిపక్ష నాయకుల్లో 23 మందిపై నిర్మా ఎఫెక్ట్ ఉంది. వారు బీజేపీలో చేరిన వెంటనే, వారికి ఒక నిర్మా ప్యాకెట్ ఇచ్చి, వారందరినీ శుభ్రం చేస్తారు. కాబట్టి ఇది మనందరికీ తెలిసిన ఒక రాజకీయ సాధనం. నిధుల అక్రమ తరలింపు నిరోధక చట్టం (పిఎంఎల్ఎ), 2002 నిబంధనల కింద, ఆరోపణలు ఎదుర్కొంటున్న బొగ్గు అక్రమ రవాణా కేసు సంబంధించి ఇండియన్ పిఏసి కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐపాక్) డైరెక్టర్ వినేష్ చందేల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసినట్లు ఒక పత్రికా ప్రకటన తెలిపింది. ఐపాక్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్, 33 శాతం వాటాదారు అయిన వినేష్ చందేల్‌ను, ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించిన అనంతరం, సోమవారం నాడు అరెస్టు చేశారు.

## బిజెపి, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నాయి

**రాయ్‌గంజ్, ఏప్రిల్ 14 (వుదయం) :**

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మంగళవారంనాడు పశ్చిమ బెంగాల్‌లోని రాయ్‌గంజ్‌లో జరిగిన ఒక ఎన్నికల సభలో ఆరోపించారు. బాబాసాహెబ్ భీమ్‌రావు అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తమ సొంత మనుషులను సంస్థలలో నియమించి, ఓట్లను దొంగిలించడం ద్వారా రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పంద చట్రంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీని విమర్శిస్తూ, ఆయన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని గాంధీ ఆరోపించారు. డాక్టర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ఈ దేశానికి రాజ్యాంగాన్ని అందించారు. కానీ నేడు, ఆర్ఎస్ఎస్‌బిజెపిల విద్వేషపూరిత సిద్ధాంతం ఆ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తోంది. ఆర్ఎస్ఎస్‌బిజెపి వారు రాజ్యాంగంపై నేరుగా దాడి చేయలేరు. కానీ వివిధ సంస్థలలో తమ సొంత మనుషులను నియమించడం ద్వారా, ఓట్లను దొంగిలించడం ద్వారా, వారు ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన అన్నారు.

2023 నాటి 'భారత్ జోడో యాత్ర'ను గుర్తుచేసుకుంటూ, భారత్ జోడో యాత్ర సమయంలో, మేం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశాం. మా పోరాటం ఆర్ఎస్ఎస్‌బిజెపిల ద్వేషపూరిత భావజాలానికి వ్యతిరేకంగా సాగుతోంది. మేం 4,000 కిలోమీటర్లు నడిచి, నఫ్రత్ కె బజార్ మె మొహబ్బత్ కి దుకాణ్ హై (ద్వేషపు సంతలో ప్రేమ దుకాణాన్ని తెరవాలి) అనే నినాదాన్ని వినిపించాం. ద్వేషం, హింస లేదా విభజనల ద్వారా ఏదీ సాధించలేమని మేం దేశం మొత్తానికి ఒక సందేశాన్ని ఇచ్చాం. ప్రేమ, ఐక్యత ద్వారా మాత్రమే దేశం ముందుకు సాగుతుందని రాహుల్ పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని మోడీని ఎద్దేవా చేస్తూ, ఆయన తన కళ్ళలోకి చూసి మాట్లాడలేరని రాహుల్ గాంధీ అన్నారు. ఇదిలా ఉండగా, గాంధీ అధికార టీఎంసీపై కూడా దాడి చేశారు. రాష్ట్రంలోని పారిశ్రామిక రంగాన్ని వామపక్ష, టీఎంసీ ప్రభుత్వాలు నాశనం చేశాయని ఆయన ఆరోపించారు.



గతంలో బెంగాల్ ఒక పారిశ్రామిక కేంద్రంగా ఉండేది. అప్పట్లో కమ్యూనిస్టులు, ఇప్పుడు టిఎంసి బెంగాల్‌లోని పారిశ్రామిక రంగాన్ని పూర్తిగా నాశనం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఎలాగూ అవినీతిపరుడే, కానీ అవినీతిలో టిఎంసి కూడా ఏమాత్రం వెనుకబడి లేదు. శారదా చిట్ ఫండ్ కుంభకోణంలో 17 లక్షల మంది పెట్టుబడిదారులకు చెందిన రూ. 1,900 కోట్లు తిరిగి చెల్లించలేదు. రోజ్ వ్యాలీ చిట్ ఫండ్ కుంభకోణంలో 31 లక్షల మంది పెట్టుబడిదారులకు చెందిన రూ. 6,600 కోట్లు ఇప్పటికీ తిరిగి చెల్లించలేదు, అని ఆయన ఆరోపించారు.

రాయ్‌గంజ్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ మోహిత్ సేన్‌గుప్తాను నిలబెట్టగా, టీఎంసీ సిట్టింగ్ ఎమ్మెల్యే, పశ్చిమ బెంగాల్ మంత్రి అయిన కృష్ణ కళ్యాణిని బరిలోకి దింపింది. కళ్యాణి 2021లో బీజేపీ టికెట్‌పై ఈ స్థానాన్ని గెలుచుకున్నారు, ఆ తర్వాత టీఎంసీలో చేరారు. ఈ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు బీజేపీ కౌశిక్ చౌదరిని పోటీకి నిలిపింది. గత ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయిన కాంగ్రెస్, టిఎంసి, బిజెపి మధ్య జరుగుతున్న తీవ్ర పోటీలో తనదైన ముద్ర వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23 మరియు 29 తేదీలలో రెండు దశల్లో జరగనుండగా, ఓట్ల లెక్కింపు మే 4న ఉంటుంది.

## ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్



**వుదయం డెస్క్, ఏప్రిల్ 14 :**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రరూపం దాల్చిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోడీ కి ఫోన్ చేసి మాట్లాడారు. దాదాపు 40 నిమిషాల పాటు వీరు సంభాషించినట్లు సమాచారం. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్‌అమెరికాల మధ్య ద్వైపాక్షిక సహకారం, హర్మూజ్ జలసంధిని తెరవడంపై ప్రధానంగా చర్చించినట్లు ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అమెరికాఇరాన్‌ల మధ్య శాంతి చర్చలు విఫలమైన వేళ అగ్రనేతల సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

''మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయ పురోగతిని సమీక్షించాం. అన్ని రంగాల్లో సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలో పరిస్థితులపైనా చర్చించాం. హర్మూజ్‌ను తెరవడం, సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది'' అని మోడీ పేర్కొన్నారు. ఈ పరిణామాలపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందించారు. ఇద్దరి నేతల మధ్య సంభాషణ సానుకూలంగా సాగిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాలను ప్రధాని మోడీకి ట్రంప్ వివరించారని తెలిపారు.

## పరిష్టంగా ప్రజాస్వామ్యం

**మహిళల రిజర్వేషన్లపై ప్రధాని**

**వుదయం డెస్క్, ఏప్రిల్ 14 :**




రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయని, దీంతో మన రాజ్యాంగం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన దేశ మహిళలకు ఓ లేఖ రాసి దాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ''ప్రస్తుతం పలు రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారు. అదేవిధంగా చట్ట సభల్లోనూ వారి ఉనికిని చాటేందుకే ఈ రిజర్వేషన్ల ప్రక్రియ మొదలుపెట్టాం. పార్లమెంట్‌లో ఏప్రిల్ 16 నుంచి జరగనున్న మూడు రోజుల సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' బిల్లులో సవరణలు ప్రవేశపెడతాం. దీనిపై ఏమాత్రం ఆలస్యం జరిగినా అది భారతదేశ మహిళలకు అన్యాయం చేసినట్టే. 2029 లోక్‌సభ ఎన్నికల సమయానికి మహిళల రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి'' అంటూ దేశ మహిళలకు రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు.

''భారతదేశ కుమార్తెలు వారి హక్కుల కోసం జీవితాంతం వేచి చూడటం సబబు కాదు. చట్టసభల్లో వారి గొంతుకను గట్టిగా వినిపించే సమయం వచ్చింది. దీంతో ప్రజాస్వామ్యం కూడా దృఢంగా మారనుంది. జరగబోయే పార్లమెంట్ సమావేశానికి, రాజ్యాంగ సవరణ ఆమోదం కోసం, దేశం నలుమూలలా ఉన్న కోట్లాది మంది మహిళల ఆశీస్సులు కోరుకుంటున్నాను. మీరంతా మీ స్థానిక ఎంపీలకు లేఖ రాసి పార్లమెంట్ సభల్లో పాల్గొనాలని వారిని కోరండి'' అని మోడీ ఆ లేఖలో రాసుకొచ్చారు. 2023 పార్లమెంటు సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన ఈ బిల్లులో సవరణలు జరుగుతున్నాయి. లోక్‌సభలో 1/3 వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని నిర్ణయించారు. అంటే మొత్తం 816 లోక్‌సభ స్థానాల్లో మహిళలకు దాదాపు 273 సీట్లను కేటాయించేలా చట్టంలో సవరణలు చేయనున్నారు.

దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ అంశాన్ని అమలు చేయడంలో మా చిత్తశుద్ధిని పునరుద్ఘాటిస్తూ..నారీశక్తికి నేను రాసిన లేఖ ఇది..'' 2029 లోక్ సభ, విధాన సభ ఎన్నికల నుంచి మహిళలకు రిజర్వేషన్లను అందించే నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా ఉన్న మాతృమూర్తులు, సోదరీమణులు, కుమార్తెలు స్వాగతిస్తున్నారు. భారత నారీశక్తికి అంకితం చేసిన ఈ లేఖలో, దశాబ్దాల నాటి ఆకాంక్షను వీలైనంత త్వరగా సాకారం చేయడం గురించి నా ఆలోచనలను దేశ ప్రజలతో పంచుకుంటున్నాను' అని సామాజిక మాధ్యమం ఎక్స్ పై ఆయన పోస్ట్ చేశారు.

## బిల్లు కట్టలేక పాక్ అవస్థలు



**వుదయం డెస్క్, ఏప్రిల్ 14 :**

అమెరికాఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచింది. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోన్న ఆ దేశం.. చర్చల ఫలితంతో సంబంధం లేకుండా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది.దీనికి సంబంధించిన మీడియా కథనాల ప్రకారం..

పశ్చిమాసియా ఘర్షణలకు ముగింపు పలికి అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చుకోవాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం అమెరికాఇరాన్ మధ్య శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చింది. అందుకు ఇస్లామాబాద్‌లోని సెరెనా హోటల్ వేదికైంది. అటు యూఎస్.. ఇటు ఇరాన్ నుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు వచ్చారు. చర్చల్లో ఎలాంటి ఫలితం రాలేదు కానీ.. హోటల్ బిల్లులు మాత్రం మోగిపోయాయని నిఘా వర్గాలను పేర్కొంటూ కథనాలు వచ్చాయి. ఆ బిల్లుల్ని పాక్ ప్రభుత్వం చెల్లించలేదట. సమస్యను పరిష్కరించేందుకు హోటల్ యజమాని రంగంలోకి దిగాల్సి వచ్చిందని రాసుకొచ్చాయి. రెండు దేశాలకు ఆతిథ్యం ఇచ్చినప్పుడు వచ్చే రొటీన్ ఖర్చులు కూడా చెల్లించడంలో పాక్ విఫలమైందని పేర్కొన్నాయి. పాక్ దౌత్య ఆశయాలకు, అంతర్గతంగా నెలకొన్న ఆర్థిక అస్థిరతలకు మధ్య ఎంతో దూరముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్థిక సమస్యల నుంచి తాత్కాలికంగా గట్టెక్కేందుకు అంతర్జాతీయ ద్రవ్యనిధిని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మరోవైపు ద్రవ్యోల్బణం ఏడు నుంచి తొమ్మిది శాతం మధ్య ఉంది. ఈ సమస్యల మధ్య మరోదఫా యూఎస్‌ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. ఏప్రిల్ 21తో రెండువారాల కాల్పుల విరమణ ముగియనుంది. ఈ లోపే ఆ చర్చలు ఉండొచ్చని తెలుస్తోంది.

## కీలక రంగాల స్థిరత్వం కోసం తీసుకుంటున్న చర్యలపై ప్రభుత్వ వివరణ

**వుదయం డెస్క్, ఏప్రిల్ 14 :**

పశ్చిమ ఆసియాలో మారుతున్న పరిస్థితులపై సమాచారాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈరోజు నేషనల్ మీడియా సెంటర్‌లో ఒక సమావేశం నిర్వహించింది. ఇంధన నిల్వలు, సముద్రయాన కార్యకలాపాలు, అక్కడ ఉన్న భారతీయులకు అందుతున్న సహాయం, కీలక రంగాల స్థిరత్వం కోసం తీసుకుంటున్న చర్యలను పెట్రోలియం సహజ వాయువు, నౌకాయాన జలమార్గాల శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల అధికారులు మీడియాకు వివరించారు. హోర్ముజ్ జలసంధి వద్ద చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో, పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్‌పీజీ నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ అధికారులు ప్రస్తుత ఇంధన సరఫరా పరిస్థితిపై తాజా సమాచారాన్ని అందించారు. అందులోని ముఖ్యాంశాలు:



**ప్రజలకు సలహాలు- అవగాహన**

★ పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ కొనుగోళ్ల విషయంలో ఆందోళన చెంది తొందరపాటుతో వ్యవహరించవద్దని, సమాచారం కోసం అధికారిక వర్గాలను మాత్రమే నమ్మాలని ప్రజలకు సూచించారు.

★ పుకార్లను నమ్మవద్దని, సరైన సమాచారం కోసం అధికారిక వర్గాలపై మాత్రమే ఆధారపడాలని సూచించారు.

★ ఎల్‌పీజీ వినియోగదారులు డిజిటల్ బుకింగ్ వేదికలను ఉపయోగించాలని, డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళ్లకుండా ఉండాలని సలహా ఇచ్చారు.

★ పీఎన్‌జీ, ఎలక్ట్రిక్ లేదా ఇండక్షన్ స్టవ్‌ల వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను ఉపయోగించాల్సిందిగా పౌరులను ప్రోత్సహిస్తున్నారు.

★ ప్రస్తుత పరిస్థితుల్లో పౌరులందరూ తమ దైనందిన వినియోగంలో ఇంధనాన్ని పొదుపు చేయవలసిందిగా కోరారు.

**ప్రభుత్వ సంసిద్ధత - సరఫరా నిర్వహణ చర్యలు**

★ ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ, గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ, పీఎన్‌జీ, సీఎన్‌జీ (రవాణా) సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రభుత్వం 100% సరఫరాను నిర్ధారించింది.

★ వాణిజ్య అవసరాలకు ఎల్‌పీజీ సరఫరాలో ఆసుపత్రులు, విద్యా సంస్థలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇవే కాకుండా ఫార్మా, ఉక్కు, ఆటోమొబైల్, విత్తనోత్పత్తి, వ్యవసాయం వంటి రంగాలకు కూడా ప్రాధాన్యత కల్పించారు. అలాగే, వలస కార్మికులకు అందించే 5 కేజీల ఎఫ్‌టిఎల్ సరఫరాను, 2026 మార్చి 2, 3 తేదీలలో జరిగిన సగటు రోజువారీ సరఫరా ఆధారంగా రెట్టింపు చేశారు.

★ ప్రభుత్వం ఇప్పటికే సరఫరా, డిమాండ్ రెండింటిలోనూ పలు క్రమబద్ధీకరణ చర్యలను అమలు చేసింది. ఇందులో భాగంగా రిఫైనరీ ఉత్పత్తిని పెంపొందించడం, గ్యాస్ బుకింగ్ కాలపరిమితిని పట్టణ ప్రాంతాల్లో 21 నుంచి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వరకు పెంచడం, అలాగే వివిధ రంగాలకు సరఫరాలో ప్రాధాన్యతలను నిర్ణయించడం వంటి చర్యలు చేపట్టారు.

★ ఎల్‌పీజీ డిమాండ్‌పై ఒత్తిడిని తగ్గించడానికి కిరోసిన్, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

★ చిన్న, మధ్యతరహా వినియోగదారులకు పంపిణీ చేయడం కోసం రాష్ట్రాలకు అదనపు బొగ్గును సరఫరా చేయాలని బొగ్గు మంత్రిత్వ శాఖ కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌ను ఆదేశించింది.

★ గృహ, వాణిజ్య వినియోగదారులకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్‌లను సులభతరం చేయాలని రాష్ట్రాలకు సూచించారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సహా సంస్థాగత యంత్రాంగాలతో సమన్వయం

★ నిత్యావసర వస్తువుల చట్టం 1955, ఎల్‌పీజీ నియంత్రణ ఉత్తర్వు 2000 ప్రకారం పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా పర్యవేక్షణ, అక్రమ నిల్వ నల్లబజారు నిరోధక చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది.

★ కాలుష్య రహిత, సురక్షిత, స్వయం సమృద్ధి సహిత ఇంధన భవిష్యత్తును ప్రోత్సహించే దిశగా ముసాయిదా రాష్ట్ర సీబీజీ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. సీబీజీ తయారీ కోసం రాష్ట్రాలు తమ పరిధిలోని పెట్టుబడిదారు అనుకూల, అమలు హితవైన వ్యవస్థను ఈ నమూనా విధానం ద్వారా సృష్టించుకోవచ్చు.

## ఎన్నికల మేనిఫెస్టో విడుదల


**ఏడాదికి మూడు ఎల్‌పిజీ సిలెండర్లు ఉచితం**
**తైపూసంను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తాం**
**మహిళలకు నెలకు రూ. 2,000 ఆర్థిక సహాయం**

**చెన్నై, ఏప్రిల్ 14 (వుదయం) :**

మరో పదిరోజుల్లో జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ (బిజెపి) తన మానిఫెస్టోను మంగళవారం విడుదల చేసింది. ఇందులో కుటుంబ పెద్దలుగా ఉన్న మహిళలందరికీ నెలకు రూ. 2,000 ఆర్థిక సహాయం, అలాగే ప్రతి కుటుంబానికి ఒకేసారి రూ. 10,000 మొత్తాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది.

దీనితో పాటుగా మూడు ఎల్పీజీ సిలెండర్లను పొంగల్, తమిళ పుత్తాండు, దీపావళికి ఉచితంగా ఇస్తామని వాగ్దానం చేసింది.

అలాగే, భగవాన్ మురుగన్ గౌరవార్థం తైపూసంను రాష్ట్రపండుగగా ప్రకటిస్తామని, అలాగే తిరుప్పరంకుంద్రం కొండ శిఖరంపై కార్తీక దీపం వెలిగించే సంప్రదాయం తిరిగి ప్రారంభమయ్యేలా చూస్తూ, దానిని కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ ప్రకటించింది. తిరుపరకుంద్రం కొండపై ఉన్న దీప తూన్ (దీప స్తంభం)పై సంప్రదాయ దీపాన్ని వెలిగించేందుకు జస్టిస్ స్వామినాథన్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ హామీ ఇచ్చారు. ఈ వ్యవహారం అనుమతిని నిరాకరించిన అధికార డిఎంకెకి, కొండ మీద దీపం వెలిగించేందుకు భక్తులను అనుమతించాలని డిమాండ్ చేసిన బిజెపి డిమాండ్ చేయడంతో వివాదంగా మారింది. ఈ వివాదం కోర్టు ఉల్లంఘన పిటిషన్లకు దారి తీయడమే కాదు, గత ఏడాది పార్లమెంటులో కూడా ప్రతిధ్వనించింది.



ఇలా ఉండగా, బిజెపి తన మేనిఫెస్టోలో సరసమైన ధరలకు భూసేకరణకు వీలు కల్పించడం ద్వారా, హైస్పీడ్ రైల్ కారిడార్లు సెమీ అర్బన్ రైలు, జల విద్యుత్ రైలు ప్రాజెక్టు, చెన్నైని ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలతో కలిపే కొత్త స్లీపర్ వందే భారత్ రైళ్ల వంటి ప్రాజెక్టుల ద్వారా కనెక్టివిటీని విస్తరించడం ద్వారా తమిళనాడు రైల్ నెట్‌వర్క్‌ను సమూలంగా సంస్కరిస్తామని కూడా హామీ ఇచ్చింది. మహిళల కోసం, సులభతరమైన జీరోఎఫ్ఐఆర్ రిపోర్టింగ్, బాధితులుసాక్షుల రక్షణ, లైంగిక నేరాలతో సహా ఘోరమైన కేసుల కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, బస్సులు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలలో 100 శాతం బ్లైండ్‌స్పాట్ రహిత సీసీటీవీ, గరిష్ఠ నిర్భయ నిధుల వినియోగం ద్వారా మహిళలపై నేరాలను అరికడతామని పార్టీ హామీ ఇచ్చింది. తయారీ యూనిట్లకు రూ. 50 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, తప్పనిసరిగా 20 శాతం ప్రభుత్వ కొనుగోళ్ల కోటాను అందించి మహిళా సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలు, ఎంఎస్ఎంఈలను బలోపేతం చేస్తామని బీజేపీ తెలిపింది.

అధికారంలో ఉన్న డీఎంకె నేతృత్వంలోని కూటమిని తీవ్రంగా విమర్శిస్తూ, బీజేపీ తరపున అందరికీ తమిళ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తమిళనాడులో ప్రస్తుతం ఒక నిరంకుశ, ప్రజా వ్యతిరేక, కుటుంబ పాలన కొనసాగుతోంది. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే నేతృత్వంలోని మహా కూటమి, ఎన్నికల అనంతరం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఎఐఎడిఎంకె ఇప్పటికే తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది, ఇప్పుడు మేము మా మేనిఫెస్టోను విడుదల చేశామని బిజెపి అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ అన్నారు. బిజెపి మిత్రపక్షం ఎఐఎడిఎంకె తన మేనిఫెస్టోలో కుటుంబానికి నెలకు రెండువేలు హామీ ఇచ్చిన తర్వాత విడుదలైంది. అలాగే, రేషన్ కార్డుపై బియ్యంతో పాటు పప్పుదినుసులను కూడా ఇస్తామని, వాటితో పాటుగా రిఫ్రిజిరేటర్లను కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. స్త్రీలతో పాటుగా పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రకటించింది. వీటితో పాటుగా, ప్రతి రేషన్ కార్డు దారుకి, ఏడాది మూడు ఉచిత వంట గ్యాస్ సిలెండర్లను ఇస్తామని ఎఐఎడిఎంకె హామీ ఇచ్చింది. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ, ఏఐఏడీఎంకేతో కలిసి 27 స్థానాల్లో పోటీ చేస్తోంది.

## ఇకపై ప్రజల దృష్టికి దూరంగా నీరవ్ మోడీ కేసు

**వుదయం డెస్క్, ఏప్రిల్ 14 :**

పరారీలో ఉన్న వ్యాపారవేత్త నీరవ్ మోడీకి ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్‌లో ఉన్న యూరోపియన్ మానవ హక్కుల న్యాయస్థానం (ఇసిహెచ్‌ఆర్), అజ్ఞాతత్వాన్ని (ఎనానిమిటీ) మంజూరు చేసింది. దీనితో అతని కేసు విచారణను ప్రజల దృష్టికి దూరంగా నిర్వహించడానికి మార్గం సుగమమైందని, అధికారులను ఉటంకిస్తూ మంగళవారం పీటీఐ నివేదించింది. తనను భారత్‌కు అప్పగించవద్దంటూ యుకె హైకోర్ట్ ఆఫ్ జస్టిస్‌కు చేసిన విజ్ఞప్తిని తిరస్కరించడంతో నీరవ్ ఇసిహెచ్‌ఆర్‌లో అప్పీల్ చేశారు. యూరోపియన్ మానవ హక్కుల ఒప్పందంపై యుకె కూడా సంతకం చేసిన దేశం. ఒక దరఖాస్తుదారునికి అజ్ఞాతత్వాన్ని మంజూరు చేసి, కేసు ఫైలు గోప్యంగా ఉన్న సందర్భాలలో, ఆ కేసుకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని కోర్టు అందించదు, అని ఈసీహెచ్‌ఆర్ పత్రికా కార్యాలయం చెప్పినట్లుగా పీటీఐతో పేర్కొంది. సుమారు పదిహేనురోజుల్లో, నీరవ్ మోడీ పిటిషన్‌పై ఈసీహెచ్‌ఆర్ విచారణ జరిపే అవకాశం ఉంది. కోర్టు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వాదనలను కూడా వింటుంది, ఆ తర్వాత తీర్పు ఇచ్చే అవకాశం ఉందని అక్కడి వర్గాలు తెలిపాయి. మోడీ అభ్యర్థనను తిరస్కరిస్తే, ప్రస్తుతం లండన్ జైలులో ఉన్న అతడిని భారత్‌కు అప్పగించే ప్రక్రియలో ఉన్న చివరి న్యాయపరమైన అడ్డంకి కూడా తొలగిపోతుంది.



మార్చిలో, యూకే హైకోర్టు, అప్పగింతకు వ్యతిరేకంగా తన కేసును తిరిగి తెరవాలన్న మోడీ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ తిరస్కరణ నిరవ్ మోడీకి యుకెలో అందుబాటులో ఉన్న అన్ని న్యాయపరమైన మార్గాలను మూసివేసింది. దీని పర్యవసానంగా, ఆయన ఇసిహెచ్ ఆర్‌ను ఆశ్రయించారు. రక్షణ సలహాదారు సంజయ్ భండారి అప్పగింత విషయంలో ఫిబ్రవరి 2025లో ఇచ్చిన తీర్పుపై ఆధారపడి తన అప్పీలును పునఃప్రారంభించాలని దరఖాస్తు చేసుకున్నారు.

తన బాలీవుడ్ ఖాతాదారులు, అంతర్జాతీయ బొటిక్ స్టోర్లు, కేన్స్ వేదికపై తన సందర్శనల ద్వారా విశేష గుర్తింపు పొందిన ఆ 55 ఏళ్ల ఆభరణాల వ్యాపారి, 2019 మార్చి 19న యుకెలో అరెస్టు అయినప్పటి నుండి వాండ్స్‌వర్త్ జైలులో నిర్బంధంలో ఉన్నారు. భారతదేశంలో పరారీ నేరస్తుడిగా ప్రకటితమైన మోడీపై, ప్రస్తుతం బెల్జియం జైలులో ఉన్న మెహుల్ చోక్సీతో కుమ్మక్కై, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ. 13,000 కోట్ల మోసానికి సూత్రధారిగా వ్యవహరించారన్న ఆరోపణ ఉంది. సిబిఐ వివరాల ప్రకారం, మొత్తం దుర్వినియోగం అయిన నిధులలో రూ. 6,498.20 కోట్లను కేవలం మోడీ ఒక్కడే అక్రమంగా తరలించాడు.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యం కావాలి
### మంత్రి పొంగులేటి



**ఖమ్మం ,కల్లూరు,ఏప్రిల్14 (వుదయం బ్యూరో):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కల్లూరు మండల కేంద్రంలోని మెయిన్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే నేడు అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ , జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు, పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్



**ఖమ్మం ,కల్లూరు,ఏప్రిల్14 (వుదయం బ్యూరో):** భారత రాజ్యాంగ నిర్మాత Dr. B. R. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ కార్యాలయములో జరిగిన జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారమహోత్సవమునకు ముఖ్య అతిధిగా విచ్చేసిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ TPCC అధ్యక్షులు మరియు MLC , తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు , రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనన్న , ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి మరియు శ్రీ నూతి సత్యనారాయణ గౌడ్ DCC, ఖమ్మం అధ్యక్షులు చేతుల మీదుగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులుగా పదవి ప్రమాణ స్వీకారం చేసి, నియామక పత్రమును అందించినారు. ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞతలు మరియు ధన్యవాదములు తెలియచేయడమైనది. తూములూరి లక్ష్మీ నరసింహారావు ఉపాధ్యక్షులు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ.

## రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు సిద్ధం కావాలి



**నల్లగొండఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి) :** భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలను దెబ్బతీసే విధానాలను ప్రజలు ఐక్యంగా ఎదుర్కోవాలని ఆయన అన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం డీఈఓ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, బాధ్యతలు కల్పించిన గొప్ప లౌకిక రాజ్యాంగమని అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని బలహీనపరచే విధంగా కేంద్ర ప్రభుత్వం మనువాద సిద్ధాంతాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని పేర్కొన్నారు.బ్రిటిష్ పాలనలో కార్మికుల హక్కుల కోసం పోరాడి అనేక చట్టాలు సాధించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడిన ఆయన, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అవుట రవీందర్, గుండాల నరేష్, జంజరాల శ్రీనివాస్, గంజి రాజేష్, సీహెచ్ అనురాధ, కే సైదులు, మన్నే శంకరయ్య, పెరిక కృష్ణ పాల్గొన్నారు.

## వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి
### – డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య

**హనుమకొండ, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి) :**



జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓఆర్ఎస్ (ORS) ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.బయటకు వెళ్లేటప్పుడు, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే పలుచని కాటన్ దుస్తులు ధరించాలి, తలకు టోపీ లేదా రుమాలు కట్టుకోవాలి. ఉపాధి హామీ కూలీలకు పని మధ్యలో నీడలో విశ్రాంతి తీసుకోవాలి. తరచూ చల్లని నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తాగుతూ శరీరాన్ని డీహైడ్రేషన్ నుండి కాపాడుకోవాలి. వృద్ధులు, పిల్లల పట్ల జాగ్రత్త,చిన్న పిల్లలను ఎండలో ఆడుకోనివ్వకూడదు. వృద్ధులు బయట చెట్ల కింద గాలి వేడిగా ఉండే అవకాశం ఉన్నందున ఇంట్లోనే సురక్షితంగా ఉండాలి.లక్షణాలు గుర్తిస్తే, కళ్లు తిరగడం, వాంతులు, ఛాతీ నొప్పి, అధిక అలసట వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (PHC) వెళ్లాలి.అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయి.జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉప కేంద్రాలు మరియు ఆశా కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా ఉన్నాయని డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు. ఎండల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని ఆయన పేర్కొన్నారు.

## రాజ్యాంగంతోనే అందరికీ సమాన హక్కులు

**సిరిసిల్ల రాజయ్య, ఎంపీ కడియం కావ్య**
**ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు**
**అంబేద్కర్ భవన్‌లో నివాళులర్పించిన ప్రముఖులు**




**హనుమకొండ, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి):** భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వారు కాదని, ఆయన అందరి వాడని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. మంగళవారం రోజున హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వమే లక్ష్యంగా ఆయన పని చేసారని కొనియాడారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ మహిళలకు ఓటు హక్కు, విద్యావకాశాలు, ప్రసూతి సెలవులు, 8 గంటల పని దినం వంటి హక్కులు అంబేద్కర్ కృషి వల్లనే సాధ్యమయ్యాయని తెలిపారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఆయుధంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు.ఎండీ రియాజ్ (గ్రంథాలయ సంస్థ చైర్మన్) మాట్లాడుతూ సామాజిక న్యాయానికి రాజ్యాంగమే బలమైన పునాది అని, విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు సూచించారు.మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ...

అంబేద్కర్ మార్గంలో నడవడం అందరి బాధ్యతని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో బహుజన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి మాట్లాడుతూ దేశ ఐక్యతకు రాజ్యాంగమే ఆధారం. హక్కులతో పాటు విధులను కూడా సక్రమంగా నిర్వహించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవోలు రమేష్, నారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం
### ఐటీడీఏ పీఓ బి. రాహుల్



**భద్రాచలం 14 ఏప్రిల్ 26 (వుదయం ప్రతినిధి):** భారత రాజ్యాంగ రూపశిల్పి, మహానుభావుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు భారతదేశ చరిత్రలో అజరామరమని, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకమని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న అంటరానితనం, అసమానతలు, కుల వివక్షలను నిర్మూలించేందుకు అంబేద్కర్ చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం దేశానికి దిశానిర్దేశం చేసిందని అన్నారు అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా, అణగారిన వర్గాల స్వరంగా నిలిచిన మహానేత అని, దళితులు, గిరిజనులు, మహిళలు, కార్మికులు, కర్షకుల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానంగా ఎదగాలనే లక్ష్యంతో ఆయన పలు సంస్కరణలు చేపట్టారని వివరించారు.గిరిజన ప్రాంతాల్లో విద్యా అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పని తీరులో ప్రతిబింబించాలని అన్నారు. డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో మరింత శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. ఆర్‌సిఓ గురుకులం అరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, పివిటీజి అధికారి గన్యా నాయక్, ఏపీఓ పవర్ వేణు తదితరులు కూడా అంబేద్కర్ సేవలను స్మరించుకొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీఎం జీసిసి సమ్మయ్య, ఏ సీఎంవో రమేష్, ఏ డిఎంహెచ్ఓ సైదులు, ఏవో సున్నం రాంబాబు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ, జయరాజ్, ఐటిడిఏ సిబ్బంది, పర్యవేక్షకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మనిషి జీవితంలో మార్పు తెచ్చిన మహోన్నత వ్యక్తి డా, బీఆర్ అంబేద్కర్

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ఏప్రిల్ 14(వుదయం):** బడుగు, బలహీన వర్గాల వారికి రాజ్యాంగాన్ని నిర్మించి మనిషి జీవితంలో మార్పు తెచ్చిన మహోన్నత వ్యక్తి డా, బీఆర్ అంబేద్కర్ అని చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యం అని నిరూపించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు రుణపడి ఉంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం డాక్టర్,, బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాలకు అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సభా వేదికపై ఏర్పాటు చేసిన డా, బీఆర్ అంబేద్కర్ ఫోటోకు పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి మున్సిపల్ చైర్మన్, అడిషనల్ ఎస్పీ తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని ఈ ఉత్సవాలు ఇంత ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గొప్ప చదువులు వెనుకబడిన, బడుగు, బలహీన, వెనుకబడిన, మైనార్టీల వర్గాల కోసం తెలంగాణ ప్రభుత్వం సూర్యాపేట జిల్లాలో 3 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టిందని, తొండ, చిలుకూరు, గడ్డిపల్లి లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం ఒక్కొక్క స్కూల్ కు రూ. 200 కోట్ల ఖర్చు చేస్తుందని వివరించారు. అదే విధంగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు అత్యాధునిక సదుపాయాలతో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

జిల్లా ఎస్పీ కె నరసింహ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని, గొప్ప మహనీయుడు, అని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణా రెడ్డి, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి కొల్లి లత, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీఉద్దీన్, జిల్లా అధికారులు, సూర్యాపేట తాసిల్దార్ కృష్ణయ్య, డిసిసి జిల్లా ప్రెసిడెంట్ గుడిపూడి నరసయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ,

మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ,నేతలుబొల్లెద్దు వీరయ్య, చింతలపాటి చిన్న శ్రీరాములు, జీడి బిక్షం, ములకలపల్లి రాములు, డాక్టర్ రామ్మూర్తి, పల్లెటి లక్ష్మణ్, టిఎన్జీవోస్ సెక్రటరీ దున్న శ్యామ్, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు వివిధ సంఘాల నాయకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం
### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి) :** అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల (ఏప్రిల్ 14-20) సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అగ్ని నివారణ అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

1944 ఏప్రిల్ 14న ముంబై డాక్‌యార్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 66 మంది అగ్నిమాపక సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోటళ్లలో అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉండాలని, ప్రతి అంతస్తులో 'ఎస్కేప్ ప్లాన్' ప్రదర్శించాలని ఆదేశించారు.

సాంకేతిక భద్రత, ఏసీ డ్యాంపర్లను ఆటోమేటిక్ డిటెక్టివ్ సిస్టమ్‌కు అనుసంధానం చేయాలని, విద్యుత్ వైరింగ్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని సూచించారు. సిబ్బందికి అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన కల్పించాలని, తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వంటగది, ఎల్‌పీజీ సిలిండర్ల నిల్వ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, మున్సిపల్ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్పర్సన్ అయేషా బేగం, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ కిషోర్, జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె. కుమారస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జ్ఞాన దినోత్సవంగా అంబేద్కర్ జయంతి

**- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య**
**- రాజ్యాంగం అందించిన ఓటు హక్కు సామాన్యుడిని శాసనసభకు పంపింది**
**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
**ఘనంగా బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు**



**వరంగల్, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి) :** వరంగల్ జిల్లాలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం రోజున అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. కాశిబుగ్గలోని అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం కేఎంసీ ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ప్రధాన వేడుకల్లో ముఖ్య అతిథులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.ముఖ్య అతిథులు సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని 'జ్ఞాన దినోత్సవం'గా జరుపుకోవడం గర్వకారణమని, ఆయన చూపిన బాటలో యువత విద్య అనే ఆయుధంతో సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ మనువాదం మహిళలపై ఆంక్షలు విధిస్తే, అంబేద్కర్ రాజ్యాంగం వారికి సమాన హక్కులు కల్పించిందని కొనియాడారు.

వరంగల్‌లోని నాయుడు పెట్రోల్ బంక్ జంక్షన్‌లో అంబేద్కర్, జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఈ నెల 20లోపు భూమిపూజ చేస్తామని, జిల్లాలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ వివక్ష లేని సమాజం కోసం అంబేద్కర్ 11 భాషల్లో ప్రావీణ్యం సంపాదించి, రాజ్యాంగాన్ని మలిచారని, ఆయన ఆశయ సాధనే మన కర్తవ్యమని పేర్కొన్నారు.కులాంతర వివాహాలు, సామాజిక సమానత్వం కోసం కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రూ. 2.50 లక్షల విలువైన బాండ్లను అందజేశారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. విరాళం ప్రకటించిన అడ్వకేట్ నిమ్మని శేఖర్ రావు అంబేద్కర్ భవనం కోసం రూ. 5 లక్షల విరాళం ప్రకటించగా, వారిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వై.వి. గణేష్, సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనే మనందరి లక్ష్యం కావాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
**ఘనంగా డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు**



**జనగామ, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. మంగళవారం రోజున డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మునిసిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ లతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు.

విద్య మరియు సామాజిక చైతన్యం ద్వారానే సమాజంలో గొప్ప మార్పులు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు.నేటి తరం అంబేద్కర్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ అభివృద్ధి పథంలో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసిపి పండరి చేతన్ నితిన్, ఆర్డీఓ గోపీరాం, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవి లత, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.అలాగే ఉత్సవ కమిటీ అధ్యక్షులు గద్దర కిషోర్, ప్రముఖులు డాక్టర్ సుగుణాకర్ రాజు, డాక్టర్ రాజమౌళి, గద్దల నరసింహారావు, అడ్వకేట్ సాదిక్ అలీతో పాటు వివిధ సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై బాబాసాహెబ్ విగ్రహానికి అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

## విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక సమానత్వం సాధ్యం
### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కలెక్టర్**

**ఖమ్మం, ఏప్రిల్ 14 (వుదయం ప్రతినిధి):** భారత రాజ్యాంగ రూపకర్తగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడిగా డా. బీఆర్ అంబేద్కర్ చిరస్థాయిగా నిలిచారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ లో ఆయన విగ్రహానికి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, అంబేద్కర్ చూపించిన మార్గం సమానత్వం, విద్య, స్వాభిమానం అనే విలువలపై ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్య ద్వారా మాత్రమే సామాజిక, ఆర్థిక పురోగతి సాధ్యమని, యువత అంబేద్కర్ బాటలో నడిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. అంబేద్కర్ దూరదృష్టి వల్లే భారతదేశం ఒక ప్రజాస్వామ్య, సమానత్వం ఆధారిత దేశంగా ఎదిగిందని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే మూల విలువలను రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు అందించారని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. యువత విద్యను సాధనంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సామాజిక న్యాయం సాధించడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని తెలిపారు. రాజ్యాంగం ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగం స్ఫూర్తిగా జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 14 (వుదయం జిల్లా ప్రతినిధి):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం స్ఫూర్తిగా భూపాలపల్లి జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చి దిద్దుతామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. డా బిఆర్ అంబేద్కర్ 135 జయంతిని పురస్కరించుకుని ఎస్సి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, ఎస్సి, ఎస్టీ, బిసి సంగాల ప్రతినిధులతో కలిసి డా బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 7 కోట్లతో అంబేద్కర్ భవనం, 2 కోట్లతో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసించేందుకు గణపురం మండలం మైలారంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నామని తెలిపారు. భూపాలపల్లి నుండి గూడెప్పాడు వరకు 664 కోట్లుతో నాలుగు వరుసల రహదారి నిర్మాణం చేయనున్నామని నల్ తెలిపారు. బైపాస్ రహదారి నిర్మాణానికి 500 కోట్ల మంజూరు చేసినట్లు తెలిపారు. డా బిఆర్ వ్రాసిన రాజ్యాంగం చాలా గొప్పదని తెలిపారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తామంటే కుదరదని తెలిపారు. జిల్లాలో కూడళ్లు అభివృద్ధికి వ్యాపారులు సహకరించాలని సూచించారు. రహదారుల వెడల్పులో దుకాణాలు పోతే మున్సిపాలిటీ ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించి వ్యాపారాలు నిర్వహణకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ డా బిఆర్ అంబేద్కర్ మనం చేయాల్సిన పనులు చట్టం ద్వారా తెలియజేశారని తెలిపారు. ఆయన గొప్ప సోషల్ రిఫార్మర్ ని అని తెలిపారు. మనకు ఆర్టికల్ 14, 17 ద్వారా ఫండమెంటల్ రైట్స్ అన్నిటిని రాజ్యాంగంలో పొందుపరిచారని తెలిపారు. రాజ్యాంగం ద్వారా మనకి ఎన్నో హక్కులు కలికిరిపించబడ్డాయని ఆ సమయంలో తన ముందు చూపు ద్వారా అన్ని హక్కులు కల్పించారాణి అభినందించారు. అంబేద్కర్ సోషల్ జస్టిస్ ఎకనామిక్ జస్టిస్, అండ్ పొలిటికల్ జస్టిస్ మూడు అంశాలు మనకు చాలా అవసరం ఉందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్ కల్పించి విద్యా ఉద్యోగాలతో పాటు జీవించే హక్కును కల్పించాలని తెలిపారు. బాగా చదువుకోవటం వల్ల మంచి ఉద్యోగాలను సాధించగలరని చక్కటి జీవితాన్ని జీవించగలరని ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీసెస్ తో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సాధించగలుగుతున్నారని ఆయన తెలిపారు..ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్,మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఎస్సి అభివృద్ధి అధికారి ఇందిర, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, జిల్లా అధికారులు, ఎస్సి, ఎస్టీ, బిసి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## లౌకిక రాజ్యాంగ రక్షణే డాక్టర్ అంబేద్కర్ కు ఘన నివాళి



**ఆదిలాబాద్: వుదయం,**
దేశ వ్యాప్తంగా పెరుగుతున్న మనువాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడి లౌకిక భారత రాజ్యాంగాన్ని రక్షిస్తేనే బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు ఘనమైన నివాళి అవుతుందని సీపీఎం ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు.మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తూ, మనువాద భావజాలాన్ని అమలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశాన్ని మత ఆధారంగా విభజించే విధానాలు కొనసాగుతున్నాయని అన్నారు.బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై దాడులు పెరిగినట్లు ప్రభుత్వ ఎన్‌సీఆర్‌బీ నివేదికల ద్వారా స్పష్టమవుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్ వ్యవస్థను బలహీనపరుస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.
భారత రాజ్యాంగాన్ని కాపాడటం, మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాడటం, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించడం ప్రజల తక్షణ కర్తవ్యమని పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ ఆశించిన సమానత్వ సమాజ నిర్మాణానికి సీపీఎం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్. మంజుల, జిల్లా నాయకులు అరిఫా, నర్మదా, ఆశన్న, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**జగిత్యాల (వుదయం ప్రతినిధి)**
జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా ప్రాంగణంలో నిర్వహించారుఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా సుపరెండెంట్ ఆఫ్ అశోక్ కుమార్ లతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి అనంతరం ఏర్పాటు చేసిన వేదిక వద్ద గల అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని పేర్కొన్నారు సమానత్వం స్వేచ్ఛ సౌభ్రాతృత్వం అనే మూల విలువలను రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు అందించారని తెలిపారు అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు సమాజంలో ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు యువత విద్యను సాధనంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు సామాజిక న్యాయం సాధించడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని తెలిపారు రాజ్యాంగం ద్వారానే ఏర్పడిన ప్రభుత్వాలు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు ప్రజలందరూ కలిసి మెలిసి ఉండి రాజ్యాంగ విలువలకు కట్టుబడి రాజ్యాంగం అందించిన అవకాశాలను ఉపయోగించుకొని వ్యక్తిగతంగా ఎదిగి జగిత్యాల జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచాలని కోరారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడిగా చిరస్థాయిగా నిలిచారని అన్నారు రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రతి ఆర్టికల్ దేశ ప్రజల హక్కులు బాధ్యతలు సామాజిక న్యాయం సమానత్వాన్ని పరిరక్షించేందుకు ఆర్టికల్స్ గురించి సవివరంగా తెలుసుకోవాలన్నారు అలాగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దూరదృష్టి వల్లే భారతదేశం ఒక ప్రజాస్వామ్య సమానత్వం ఆధారిత దేశంగా ఎదిగిందని కొనియాడారు అనంతరం ఆయన చూపిన మార్గంలో నడవాలని రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టాలని అందరిని కోరారు అంతకుముందు అంబేద్కర్ జీవిత చరిత్ర మహనీయుల గొప్పతనం గురించి వివిధ కుల సంఘాల ప్రతినిధులు ఉపన్యసించారు జిల్లా అదనపు కలెక్టర్ లు బిఎస్ లత బి రాజ గౌడ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్ డీఎఫ్ఓ సురేష్ డిపిఆర్ఓ నరేష్ మార్కెట్ కమిటీ చైర్మన్ లు కౌన్సిలర్లు స్థానిక ప్రజా ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ తహసీల్దార్ లు వివిధ శాఖల అధికారులు కుల సంఘాల ప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):**
ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) కామారెడ్డి జిల్లా విభాగం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం జిల్లా కేంద్రంలోని కర్షక్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు నిరంతర రక్తదానం ఎంతో అవసరమని, సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం పట్ల అవగాహన పెంచుకొని ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దాతలకు కలెక్టర్ స్వయంగా సర్టిఫికెట్‌లు, హెల్మెట్లు అందజేశారు. అదనపు కలెక్టర్ విక్టర్, ఐవిఎఫ్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు.



## రోడ్డు భద్రతా అవగాహన సదస్సు



**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా, జిల్లా పోలీస్ శాఖ, రెవెన్యూ, రవాణా శాఖల సమన్వయంతో మంగళవారం కరీంనగర్ కోర్టు చౌరస్తాలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం విశిష్ట అతిథులుగా పాల్గొని, రహదారి భద్రతపై ప్రజలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం 'అరైవ్ అలైవ్' కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ చిత్రా మిశ్రా అందరితో రోడ్డు నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో అధిక శాతం ద్విచక్ర వాహనదారులే ఉండటం విచారకరమన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం వల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. పోలీసుల నిరంతర నిఘా, చర్యల వల్ల జిల్లాలో ప్రమాదాల రేటు 17 శాతం తగ్గిందని తెలిపారు. ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని సీపీ తెలిపారు. రహదారి ప్రమాద బాధితుల కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సీపీ వివరించారు. రహవీర్ పథకం ద్వారా ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు రూ. 1.5 లక్షల వరకు ఉచిత నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంది. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం తరపున ప్రత్యేక ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, పోలీస్ సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకున్నారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనతో దేశాభివృద్ధి సాధ్యం



**మంచిర్యాల/(వుదయం ప్రతినిధి)**
రాజ్యాంగ నిర్మాత, సమానత్వ సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన తో దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ 175 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐ.బి చౌరస్తాలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, వివిధ బి. సి. సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, ఇన్చార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, వివిధ బిసి సంఘాల నాయకులతో కలిసి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, దళిత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు సదా స్మరణీయమని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించడమే కాకుండా సమాజంలో సమానత్వం, మహిళల అభివృద్ధి, కుల, మత, వర్ణ, వర్గ ప్రాంత విభేదాలు లేకుండా దేశ పౌరులుగా అందరూ సమానమైన అని తెలుపుతూ రాజ్యాంగ రచన చేశారని, విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆనాటి సమాజంలోని అసమానతలను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి, సమాన అవకాశాల కోసం రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. మన దేశ రాజ్యాంగం వివిధ దేశాల రాజ్యాంగాల ప్రేరణతో రూపొందించబడిందని, తద్వారా నేడు దేశ పరిపాలన సులభతరమైందని తెలిపారు. .డి సి పి మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వ మానవతావాది అని, అందరి వాడని తెలిపారు. తాను ఎదుర్కొన్న కష్టాలు మరెవ్వరూ అనుభవించకూడదనే సంకల్పంతో సమానత్వానికి పునాది వేశారని తెలిపారు. మహిళలకు అవకాశాలు కల్పించడం, కార్మికులకు 8 గంటల పని విధానం అమలు, ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం వంటి కీలక సంస్కరణలకు కృషి చేశారని అన్నారు.అనంతరం డా. బి.ఆర్. అంబేద్కర్ పై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బీర్పూర్ శ్రీనివాస్ రచించి, మామిళ్ళ లచ్చన్న ఆలపించిన గీతాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్ గొప్పతనాన్ని ప్రతిబింబిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నాటకాలు అందరినీ అలరించాయి. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహకాలు అందజేశారు. అంతకుముందు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద మంచిర్యాల పట్టణంలోని ఐ. బి. చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అధికారులు, బి.సి. సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ లో అంబేద్కర్ జయంతి



**ఆసిఫాబాద్ వుదయం ప్రతినిధి**
ఆసిఫాబాద్ జిల్లాలో భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె. హరిత, ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు కోవలక్ష్మి డాక్టర్ పాల్వ హరీష్ బాబు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన అడుగుజాడల్లో నడవాలని అంబేద్కర్ అందరివాడని అన్నారు. సిర్పూర్ నియోజకవర్గం కాగజ్నగర్ తో పాటు వివిధ మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన జయంతి వేడుకలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విట్టల్ పాల్గొని విగ్రహానికి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలలో జయంతి వేడుకలను జరుపుకున్నారు.
జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సుగుణ, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, గ్రంథాలయ చైర్మన్ అనిల్, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్యాం నాయక్, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ఘనంగా బాబా సా హెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు

**పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రజాప్రతినిధులు**
**సమానత్వం,సామాజిక న్యాయమే ఆశయమని ఉద్ఘాటన**




**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):**
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ధర్మపురి పట్టణంలో అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద మున్సిపల్ పాలకవర్గం, వివిధ శాఖల అధికారులు,రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా పట్టణం లోని ప్రధాన కూడలిలో ఉన్న అంబేద్క ర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జై భీమ్ నినాదాలతో చౌరస్తా హోరెత్తింది. అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ దేశానికి దిశానిర్దేశం చేసిన మహ నీయుడు అంబేద్కర్ అని,ఆయన రచించిన రాజ్యాంగం వల్లే నేడుఅట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయంచేకూరుతోందని కొనియాడారు. సమాజంలో సమానత్వం,విద్య యొక్క ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నాయకులు పేర్కొన్నారు.అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తూ,ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడ మే మనం ఆయనకు ఇచ్చే అసలైన గౌరవమని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మీ, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న,మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్ రావు,తహసీల్దార్ ఏ. శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలు ముల లావణ్య, వైస్ చైర్మన్ సంగ. నర్సింహులు,కౌన్సిలర్లు అయ్యోరీ వేణు గోపాల్,సంగనభట్ల సంతోషి, కొమురెల్లి పవన్, ముదుసుల ప్రశాంత్, వాంకుడోత్ విజయ్ బాబు, జంజిరికాని సువర్ణ, వీరవేణి నాగలక్ష్మీ, సంగి ఆనంద్, జక్కు పద్మ,చుక్క సంధ్య, చిపిరి శెట్టి రాజేష్,వేముల రమాదేవి, వొజ్జల లక్ష్మణ్, మాజీ జెడ్పిటిసి బాదినేని రాజేందర్, అంబేద్కర్ కమిటీ చైర్మన్ అరికిల్లా సతీష్, సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, నాయకులు సౌల్ల భీమయ్య, వేముల రాజేష్, సింహరాజు ప్రసాద్, సుముఖ్, సౌల్లా నరేష్, అశెట్టి శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



## మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి దుద్దిళ్ళ

**మహిళా సాధికారతకు వీ-హబ్ కీలక వేదిక**
**ఏఐ శిక్షణతో యువతకు కొత్త అవకాశాలు**
**టాస్క్ ద్వారా నైపుణ్యాభివృద్ధి – ఉద్యోగాలకు మార్గం**
**టి-ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి ఆధునిక విద్య**
**వీ-హబ్ ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**



**పెద్దపల్లి, (వుదయం ప్రతినిధి)**
మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు.మంగళవారం పెద్దపల్లి పట్టణంలో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలతో కలిసి వీహబ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, వీహబ్ మహిళా సాధికారతకు ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. పెద్దపల్లికి వీహబ్ తీసుకురావడానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అనేకసార్లు ప్రతిపాదనలు ఇచ్చారని గుర్తు చేశారు. మహిళలు చిన్న వ్యాపార యూనిట్లు ప్రారంభించి CEO స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో వీహబ్ పనిచేస్తుందని అన్నారు. గత రెండేళ్లుగా వీహబ్ CEO సీత అద్భుతంగా సేవలందిస్తున్నారని ప్రశంసించారు.టిఫైబర్ ద్వారా ఆధునిక విద్యను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చిన్న టీవీ కూడా కంప్యూటర్‌లా ఉపయోగపడే విధంగా టెక్నాలజీ అందుబాటులోకి వస్తోందని తెలిపారు. ఇప్పటికే గ్రామాలకు టి ఫైబర్ చేరిందని, త్వరలో ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, దీనికి ప్రజల సహకారం అవసరమని కోరారు. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, భవిష్యత్తులో ఇవి విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. పిల్లలు చిన్న వయసులోనే AI టూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. టాస్క్ వంటి కార్యక్రమాలు ఈ లక్ష్యంతోనే ప్రారంభించామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వైఎస్సార్ కాలంలో మహిళలను లక్షాధికారులుగా చేస్తామని చెప్పి సాధించామని, ఇప్పుడు అదే విధంగా కోటీశ్వరులుగా చేస్తామని అన్నారు. SHGలకు ఇచ్చే బ్యాంక్ లింకేజ్ రుణాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వీహబ్ ద్వారా SHG ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మహిళలు ఉత్పత్తి నాణ్యతతో పాటు ప్యాకేజింగ్, బ్రాండింగ్‌పైనా దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఈ సదుపాయాలను నియోజకవర్గ స్థాయికి విస్తరించనున్నామని చెప్పారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలో సుమారు 91 వేల మహిళలు ఉన్నారని, వారు వివిధ రకాల ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, నూనెలు తయారు చేస్తున్నారని తెలిపారు. ఈ ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు రామగుండంలో మరో వీహబ్ ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. టీ ఫైబర్ ఎండి శివ ప్రసాద్, వీ హబ్ సీఈఓ సీత , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధన పాటు పడాలి

**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 14**
అంబేద్కర్ ఆశయ సాధన ప్రతి ఒక్కరూ పాటు పడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఉన్న బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే తదితరులు పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ నిర్మాణాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలు వారి దేశాల రాజ్యాంగాన్ని రచించాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కొనియాడారు. గత నెలలో ఐడీఓసీ లో జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించామని, అన్ని శాఖల జిల్లా అధికారులు జయంతి వేడుకలకు హాజరయ్యారని తెలిపారు. అంబేద్కర్ విశ్వ నాయకుడని పేర్కొన్నారు. ఆయన అందరి వారు అని తెలిపారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూపారెడ్డి, రాజు, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఏఎస్ డబ్ల్యూఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



## రాజ్యాంగం స్ఫూర్తితోనే అభివృద్ధి



**నిజామాబాద్, వుదయం,**
భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం స్ఫూర్తితోనే భారతదేశంలో అన్ని వర్గాల వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రాజ్యంగంలో ఆలిండియా సర్వీసెస్ గురించి పొందుపర్చిన ఆర్టికల్ 311 ద్వారానే తాను ఐ.ఏ.ఎస్ కాగలిగానని గుర్తు చేశారు. అన్ని వర్గాల వారికి రాజ్యాంగబద్ధంగా హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పులాంగ్ చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమారాణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఆయా సంఘాల నాయకులు రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## అంబేద్కర్ ఆశయ సాధన ప్రతి ఒక్కరి బాధ్యత



**నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**
**నారాయణపేట ,ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**

భారత రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు దిక్సూచిగా నిలిచిన డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఎస్పీ డాక్టర్ వినీత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్పీ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో వాడవాడలా అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పి ఆయన రచించిన రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు ఇదివరకే వివరించడం జరిగిందన్నారు. చదువు ఒక్కటే మార్గమని ఎంచుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కష్టపడి చదివి విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి భారత రాజ్యాంగాన్ని రచించడానికి తన మేధాశక్తిని ఉపయోగించాడని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు భారత రాజ్యాంగంలో అన్ని అంశాలను పొందుపరిచి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అభివృద్ధి కొరకు ఎంతగానో కృషి చేశారని కలెక్టర్ అన్నారు. ఆనాడే విదేశాలలో విద్యానభ్యసించిన ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మనం కూడా ఉన్నత విద్య కొరకు విదేశాలకు వెళ్లేంత స్థాయికి ఎదగాలని అన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ప్రపంచానికే ఆదర్శమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నేడు మన దేశంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేయడం వల్ల అన్ని రంగాల అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతున్నదని తెలిపారు. అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఒక గొప్ప సందేశం, మార్గదర్శకం అని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను ఎదుర్కొంటూ ఆయన చూపిన దారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.కులమతాలకు అతీతంగా ఐక్యంగా నిలబడి, అన్యాయాలపై సంఘటితంగా పోరాడితేనే సమాజంలో సుస్థిర మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. అంబేద్కర్ గారు ఎదుర్కొన్న కష్టాలు, అవమానాలు ఉన్నప్పటికీ ఆయన వెనుకడుగు వేయకుండా విద్యను ఆయుధంగా మార్చుకుని ఉన్నత స్థానానికి చేరుకున్నారని గుర్తు చేశారు.

చదువు ఒక్కటే మనిషి జీవితాన్ని పూర్తిగా మార్చగల శక్తివంతమైన సాధనం అని ఎస్పీ స్పష్టం చేశారు. విద్య ద్వారా అవగాహన పెంపొందించి, అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేత సత్య యాదవ్, సదా శివ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్,ఎస్ . డి.సి.రాజేందర్ గౌడ్, ఆర్ అండ్ బి ఈ.ఈ.వెంకట్రాములు,షెడ్యూల్ కులాల అధికారి అబ్దుల్ ఖలీల్,మున్సిపల్ కమిషనర్, నరసయ్య, సి పి.ఓ.కాగా వాహన్, డి .పి. ఆర్.ఓ.రషీద్, ఆర్టిఓ మేఘా గాంధీ, కౌన్సిలర్ మహేష్, సంఘం నాయకులు, శరణప్ప, ఆశప్ప, కృష్ణ, సూర్యకాంత్,ఈశ్వరమ్మ, మాధవ సోఫీ, రమేష్,విద్యార్థులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



- ఆ మహనీయుని ఆశయాలను కొనసాగిద్దాం
- ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన కలెక్టర్ ప్రతి మాసింగ్, ఎస్పీ డివి శ్రీనివాసరావు

**మెదక్ , ఏప్రిల్ 14 (వుదయం )**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ అడుగు జాడల్లో నడుస్తూ ఆ మహనీయుని ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.మెదక్ జిల్లా కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాందాస్ చౌరస్తాలో నిర్వహించగా కలెక్టర్ ప్రతిమా సింగ్ , ఎస్పీడీ.వి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనందంగా జీవిస్తున్నామన్నారు. ఉన్నత భావాలతో రచించిన రచనలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకొని, జీవితాలను ప్రభావితం చేశాయన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగం స్వేచ్ఛను,సమానత్వాన్ని ప్రసాదించిందని, సమాజంలో ప్రజలందరూ ఆనందంగా జీవించేందుకు రాజ్యాంగం దో హ ద ప డిం ద న్నా రు . కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి,ఎస్సీ కార్పొరేషన్ అధికారి డిఆర్డిఓ శ్రీనివాసరావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఎఫ్ ఓ జో.జి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు ఆకుల పెంటయ్య, కమిటీ చైర్మన్ దుబాషి సంజీవ్ , వైస్ చైర్మన్ గరుగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, కార్యదర్శి నాగరాజు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్ ,ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**



రోడ్డు భద్రత అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చేపట్టిన పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి, స్పష్టమైన మార్పు తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో శ్రీపురం చౌరస్తాలో జరుగుతున్న రోడ్డు జీబ్రా క్రాసింగ్ పెయింటింగ్ పనులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.....,పట్టణంలోని ప్రధాన కూడలిల వద్ద రోడ్డుపై "గో స్లో" వైట్ పేయింట్ వేయడం, స్కూల్ జోన్ల వద్ద ప్రత్యేక హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, స్పీడ్ బ్రేకర్లు సరిగ్గా నిర్మించడం వంటి చర్యలు ప్రజల్లో అప్రమత్తత పెంచుతాయని తెలిపారు. ప్రమాదాల ప్రధాన కారణాలను విశ్లేషించి చర్యలు తీసుకోవాలని అన్నారు. పనులు పూర్తి చేయడమే కాదు, నాణ్యతను కూడా నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమైనది అన్నారు.

అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నియమాలను పట్టించుకోకపోవడం, యువత స్పీడ్పై నియంత్రణ ఉండకపోవడం వలన డ్రైవింగ్ సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు వాటి నివారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

రోడ్డు భద్రత ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం తో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించే అరైవ్ అలైవ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్టీవో చిన్న బాలు, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

## క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**




**గద్వాల ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**

క్రీడలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకే కాక అందరిలో స్నేహ సంబంధాలను పెం పొం దిం చ డా ని కి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్జిటియు (సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్) జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గద్వాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన టిపిఎల్ (టీచర్స్ ప్రీమియం లీగ్) క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు మంగళవారం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు మొదటిసారి ఈ క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, తాము నేర్చుకున్న క్రీడా నైపుణ్యాలను తమ పాఠశాలలోని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. 200 మంది క్రీడాకారులకు 12 టీములుగా క్రికెట్ మ్యాచ్ లను సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతగా నిలిచిన గట్టు గేమర్స్ జట్టుకు రూ. 20 వేల చెక్కు, రన్నర్స్ గా నిలిచిన గద్వాల గ్లాడియేటర్స్ జట్టుకు రూ.15 వేల చెక్కు తో పాటు పతకాలు, ట్రోఫీలను కలెక్టర్ అందజేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు కూడా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈవో విజయలక్ష్మి, ఇన్చార్జి డి వై ఎస్ ఓ రామలింగేశ్వర్ గౌడ్, వివిధ మండలాల విద్యాధికారులు, ఇతర అధికారులు, ఎస్జిటియు నేతలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక న్యాయానికి అంబేద్కర్ చూపిన మార్గం ఆదర్శనీయం

**మంత్రి దామోదర్ రాజనర్సింహ**
**సంగారెడ్డి, ,ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**

భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని తెలిపారు. భారత రాజ్యాంగ రూపకర్తగా దేశ నిర్మాణంలో ఆయన చేసిన అపార సేవలను మంత్రి స్మరించుకున్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి అమలు చేస్తోందని, సమాన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, విద్యా,ఉపాధి అవకాశాలు అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితోనే కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. యువత అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం

**వనపర్తి ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం : రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కే శివసేనారెడ్డి క్రమశిక్షణ, ఉన్నత చదువులతో జీవితంలో ఏదైనా సాధించగలం : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం, అందరూ ఆయన అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు వనపర్తి పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో షెడ్యూల్డ్ కాస్ట్ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షులు డా. జి. చిన్నా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కే. శివసేన రెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు అంబేద్కర్ జీవితం పై పాటలు ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం ముఖ్య అతిథులు అంబేద్కర్ జీవితం, ఆయన ఆశయాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి గురించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షులు డా. జి. చిన్నా రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం విద్యా ద్వారానే అంటరానితనం అస్పృశ్యతను దూరం చేయవచ్చని నమ్మారన్నారు. ఆయన ఆ రోజుల్లోనే ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని లైబ్రరీలో అన్ని పుస్తకాలు చదివిన ఘనతను సాధించారన్నారు. దేశంలో స్వాతంత్రం వచ్చిన తర్వాత ఆయన న్యాయశాఖ మంత్రిగా పనిచేసినట్లు తెలిపారు. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం దేశంలో అమలవుతోందని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం దేశంలో పాలన జరగాలని, రాజ్యాంగ ఉల్లంఘనలపై ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ లాంటి మహనీయుల కృషి ఫలితమే నేడు సమాజంలో సమానత్వం విరాజిల్లుతోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ సారిస్తోందని, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ఉన్నత విద్యాలయాలు నెలకొల్పుతోందని తెలిపారు. కాబట్టి తల్లిదండ్రు లు పిల్లల్ని బాగా చదివించాలని విద్య ద్వారానే ఉన్నత స్థాయికి రాగలమని గుర్తు చేశారు.

క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కే. శివసేన రెడ్డి మాట్లాడుతూ విద్య ద్వారానే జ్ఞానం లభిస్తుందని, అంబేద్కర్ చెప్పినట్లుగా ఆయన సిద్ధాంతాలను అనుసరిస్తూ బాగా చదువుకోవాలని సూచించారు. ఆయన రాసిన రాజ్యాంగం ద్వారానే ఎంతోమందికి నేడు ఎన్నో మంచి పనులు జరుగుతున్నాయని, కాబట్టి ఆయన దేవుడు లాంటి మనిషి అని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రపై పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి ఆయన ఘనతను తెలియజేయాలన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం సమాజానికి ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని అన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడమే కాకుండా సమాజానికి సేవ చేయడం కూడా ముఖ్యమైన అని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఉన్నత చదువుల ద్వారా ఏదైనా సాధించగలరని తెలిపారు. ఇంట్లో ఒక మహిళ చదువుకుంటే ఆ ఇంటి మొత్తానికి జ్ఞానాన్ని పంచుతుందని కాబట్టి మహిళలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులను ముఖ్య అతిథులు శాలువా, మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంధం నాగరాజు, ఉపాధ్యక్షులు చిరంజీవి, సభ్యులు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు, కళాకారులు, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు పోలీస్ శాఖ 'ఉద్యోగ మిత్ర' వరం

**ఏప్రిల్ 25న సిద్దిపేటలో మెగా జాబ్ మేళా.. 1500 పైగా కొలువులు సిద్ధం**
**120కి పైగా ప్రముఖ కంపెనీల భాగస్వామ్యం:**
**సిపి రష్మీ పెరుమాళ్ వెల్లడి**
**సిద్దిపేట, ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**



సిద్దిపేట జిల్లా నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ అదిరిపోయే శుభవార్త చెప్పింది. యువతకు ఉపాధి మార్గాలను చూపిస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర పేరిట భారీ మెగా జాబ్ మేళాను నిర్వహించనుంది. ఈ నెల ఏప్రిల్ 25వ తేదీన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం జరగనున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అధికారికంగా ప్రకటించారు.జాబ్ మేళా ఏర్పాట్లపై నిన్న మార్క్ పోలీస్ స్టేషన్లో వివిధ కంపెనీల ప్రతినిధులు మరియు సమన్వయకర్తలతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్ మేళా నిర్వహణకు సంబంధించిన రూట్ మ్యాప్ను సిద్ధం చేశారు. కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, నిరుద్యోగుల బాగు కోసం సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీపీ వివరించారు.

దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దాదాపు 120కి పైగా ప్రముఖ కంపెనీలు. సుమారు 1500లకు పైగా ఖాళీల భర్తీ. రంగాల వారీగా ఐటీ (IT), ఫార్మా, బ్యాంకింగ్, రిటైల్ మరియు మ్యానుఫ్యాక్చరింగ్ వంటి విభిన్న రంగాలు.పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుంది. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి. అర్హత కలిగిన అభ్యర్థులు భారీ సంఖ్యలో హాజరై ఈ మేళాను విజయవంతం చేయాలిఅన్నారు.ఈ జాబ్ మేళాకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరియు వేదిక వివరాలను త్వరలోనే పూర్తిస్థాయిలో వెల్లడిస్తామని పోలీస్ అధికారులు తెలిపారు.

## పుల్కల్‌లో గ్యాస్ సరఫరాలో భారీ నిర్లక్ష్యం వినియోగదారులు ఇబ్బందులు






**పుల్కల్ ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**

పుల్కల్ మండలంలోని సాయి భారత్ గ్యాస్ ఏజెన్సీపై వినియోగదారుల ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులు దర్యాప్తు చేపట్టగా, గ్యాస్ సిలిండర్ల సరఫరాలో తీవ్రమైన నిర్లక్ష్యం బ య ట ప డిం ది . అ ధి కా రు ల పరిశీలనలో మొత్తం 1275 మంది వినియోగదారులు సిలిండర్ల కోసం బుకింగ్ చేసుకున్నట్లు తెలిసింది. అయితే అందులో కేవలం 290 సిలిండర్లు మాత్రమే డెలివరీ చేయబడగా, ఇంకా 52 సిలిండర్లు డెలివరీ చేయాల్సి ఉంది. మొత్తం 988 బుకింగ్స్ పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితి వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది.ఈ అంశంపై జిల్లా పౌర సరఫరాల అధికారి (DCSO) గ్యాస్ కంపెనీ సేల్స్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే సరఫరా చేపట్టాలని ఆదేశించారు. అలాగే డీలర్లకు సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.అధికారులు ఏజెన్సీకి స్పష్టమైన గడువు విధిస్తూ, ఏప్రిల్ 15 నాటికి 344 సిలిండర్లు, ఏప్రిల్ 16 నాటికి మొత్తం పెండింగ్‌లో ఉన్న సిలిండర్ల సరఫరాను పూర్తి చేయాలని ఆదేశించారు

.ఇదిలా ఉండగా, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా 40 నుంచి 50 సిలిండర్లను నిల్వలో ఉంచాలని ఏజెన్సీ యజమానిని DCSO హెచ్చరించారు.గ్యాస్ సిలిండర్ల బుకింగ్ చేసిన వారికి సమయానికి డెలివరీ చేయకపోవడం పట్ల అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఫిర్యాదులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## బెల్ట్ షాపుల నిర్వహణ పై పల్లా సీరియస్

**చేర్యాల ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**



జనగామ నియోజకవర్గంలో బెల్ట్ షాపులపై తీవ్ర విమర్శలు చేశారు
సిండికేట్ వ్యవస్థ ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటోందాని
సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపల్ పట్టణ కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి అనంతరం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జనగామ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, ప్రజల ఆరోగ్యాలతో సిండికేట్ వ్యవస్థ ఆడుకుంటోందని ఆరోపించారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎక్సైజ్ శాఖ గానీ పోలీసు శాఖ గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. అధిక ధరలకు మద్యం విక్రయించి ప్రజలను ఆర్థికంగా ఆరోగ్యపరంగా నష్టపెడుతున్న ఈ సిండికేట్ వ్యవస్థను తక్షణం అరికట్టాలనీ ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తక్షణం బెల్ట్ షాపులపై తగు చర్యలు తీసుకోకపోతే, రానున్న రోజుల్లో మహిళలతో కలిసి బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి వాటిని మూసేయాల్సి వస్తుంది ప్రభుత్వాన్ని హెచ్చరించారు

.గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలు పెరగడం వల్ల కుటుంబాలు, యువత విపరీతంగా నష్టపోతున్నా దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు అధికారులు తక్షణం స్పందించి గ్రామాల్లో పుట్ట గొడుగుల్ల పుట్టుకొస్తున్న బెల్ట్ షాపుల పై చర్యలు తీసుకోవాలన్నారు.

## అంబేద్కర్ ఆశయాలతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

**ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి**
**మహబూబ్ నగర్ ,ఏప్రిల్ 14**
**(వుదయం ప్రతినిధి)**



అంబేద్కర్ ఆశయాలను లక్ష్యంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సమాజ అభివృద్ధి, సమానత్వం, ప్రజల ఐక్యత కోసం ప్రభుత్వం దృఢ సంకల్పంతో కట్టుబడి పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో బస్టాండ్ సమీపంలో ఉన్న చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మహబూబ్ నగర్ పట్టణం అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకాలని, వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అంబేద్కర్ దేశానికి రాజ్యాంగం అందించడమే కాకుండా బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు, సమానత్వం, ఓటు హక్కు కల్పించిన గొప్ప నాయకుడు, సంఘ సంస్కర్త అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవిత చరిత్ర చదవాలని,ఆయనజీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. . ముఖ్యంగా అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు అని కొనియాడారు. జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. అంతకు ముందు దళిత, కుల, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక అసమానతలు, అంటరానితనం, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారుడని పేర్కొన్నారు.


కులరహిత సమసమాజ నిర్మాణం కోసం ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని సునీత,ఆర్.డి.ఓ నవీన్, కుల సంఘాల నాయకులు కంచి లక్ష్మణ్, బోయపల్లి నర్సింహులు, ఎం. బాలయ్య, మల్లెపోగు శ్రీనివాస్ , జిల్లా అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**
**మెదక్, ఏప్రిల్ 14(వుదయం )**

వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. వడగాలుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 నుండి 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచించారు.ప్రజలు పుష్కలంగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని, తేలికపాటి దుస్తులు ధరించాలని తెలిపారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.జిల్లాలో తాగునీరు, చలివేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి వడగాలుల నుంచి రక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకోవాలి



**జన్నారం, (ఉదయం విలేఖరి)**
అంబేద్కర్ ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ కోరారు. మంగళవారం రోజున అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని ఆమె పొనకల్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ప్రపంచ మేధావి అంబేద్కర్ అని ఆమె కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అప్పాలా జలపతి,వార్డ్ సభ్యులు మోసిన్, రజాక్, ఈఓ రాహుల్ ఉన్నారు.

### అగ్నిమాపక వారోత్సవాల
## పోస్టర్లను ఆవిష్కరించిన సర్పంచ్



**జన్నారం, (ఉదయం విలేకరి)**
అగ్ని ప్రమాద నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ కోరారు. మంగళవారం రోజున ఆమె స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక అధికారి శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ,అగ్నిమాపక సిబ్బందితో కలిసి అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లు,కరపత్రాలు,స్టిక్కర్ల ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ ఆ శాఖకు సంబంధించిన జెండాను సగం వరకు ఎగరవేశారు.1944 ఏప్రిల్ 14వ తేదీన ముంబైలోని విక్టోరియా డాక్ యార్డ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో చనిపోయిన సిబ్బందికి శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ఉపసర్పంచ్ అప్పల జలపతి,వార్డు సభ్యులు రాజక్, సంతోష్,ఈవో రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్, అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జన్నారంలో అంబేద్కర్ జయంతి



**జన్నారం, (ఉదయం విలేకరి)**
జన్నారం పట్టణంలో అంబేద్కర్ జయంతిని అంబేద్కర్ మండల్ సంఘం అధ్యక్షుడు సిటిమల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రోజున అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా అంబేద్కర్ సంఘ నాయకులు బస్టాండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జన్నారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేద్కర్ అని అందరికీ ఆదర్శప్రాయుడు, భారత రాజ్యాంగం రచించి అందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడు ఆయన అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు సిటిమల భరత్ కుమార్,పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్,మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, సాయిని ప్రసాద్ నేత, అంబేద్కర్ అవార్డు గ్రహిత అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్,బీసీ కులాల పోరాట సంఘం రాష్ట్ర కన్వినర్ కోడూరి చంద్రయ్య,అంబేద్కర్ సంఘం జిల్లా సీనియర్ నాయకులు అక్కవత్తుల దేవయ్య,అంబేద్కర్ సంఘం మండల సీనియర్ నాయకులు దుమల్ల రమేష్,అంబేద్కర్ సంఘం మండల సీనియర్ నాయకులు దాముక కరుణాకర్,బీసీ కులాల పోరాట నాయకులు సుల్వ జనార్ధన్,అంబేద్కర్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రత్నం మాణిక్యం,అంబేద్కర్ సంఘం మండల సీనియర్ నాయకులు కొండూకూరి ప్రభుదాస్,అంబేద్కర్ సంఘం మండల నాయకులు దుమల్ల ప్రవీణ్,సామాజిక వేత్త ఉద్యమ కారుడు మామిడి విజయ్, బీసీ నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బంజపల్లి గ్రామంలో ఘనంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు




**నిజాంసాగర్ (ఉదయం ప్రతినిధి)**
నిజాంసాగర్ మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం డా.బీ ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ అనీస్ పటేల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశానికి అపార సేవలు అందించారని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ప్రతి భారతీయుడికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరికీ విద్యా హక్కు, సమాన అవకాశాలు కలగాలని ఆయన కలలు కనారని, ఆ ఆశయాలను సాధించడం మనందరి బాధ్యత అని ఆయన వివరించారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. యువత చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరాలని, అంబేద్కర్ ఆలోచనలను జీవితంలో అమలు చేయాలని సూచించారు. గ్రామంలో ఐక్యత, సహకారం పెంపొందితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అనీస్ పటేల్, గ్రామ కార్యదర్శి భీమ్ రావు, నెల్లి కృష్ణమూర్తి, కంబాపురం సాయిలు, కారోబార్ సాయిలు,గాండ్ల రమేష్, పసుల రాములు, కరణం శ్రీనివాస్, లక్ష్మణ్ దాస్,సత్య గౌడ్, కమ్మరి రాములు, ఆయిటి రాజు, అబ్దుల్ జమీల్, కోయల్కర్ మౌలాజి, మేకల సంగమేశ్వర్, సిబ్బంది ఎండి.షాదుల్, చాకలి మల్లేష్, దళిత నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనరేట్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి



**కరీంనగర్ ఉదయం ప్రతినిధి)**
భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నేడు వేడుకలను అత్యంత గౌరవప్రదంగా నిర్వహించారు.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కమిషనరేట్ కార్యాలయం లో డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో అంబేద్కర్ చేసిన కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. సమానత్వం, న్యాయం మరియు సౌభ్రాతృత్వం ప్రాతిపదికన సమాజాన్ని స్థాపించడానికి ఆయన చేసిన నిరంతర పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను కాపాడాలని సి.పి. గౌష్ ఆలం స్పష్టం చేశారు. ప్రతి పౌరుడికి, ముఖ్యంగా అణగారిన వర్గాలకు హక్కులు అందేలా చూడటం మన బాధ్యత అని అన్నారు. ప్రజా సేవకులు అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని చిత్తశుద్ధితో, సామాజిక స్పృహతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కమిషనరేట్‌కు చెందిన అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, జానిమియా, కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ సరిలాల్ సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు కమిషనరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు



**నిజాంసాగర్, (ఉదయం ప్రతినిధి):**
భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు నిజాంసాగర్ మండల తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిలు సిబ్బందితో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
అన్ని సామాజిక వర్గాలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పించిన మహానుభావుడిగా డా. అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిలు మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రతి భారతీయుడి జీవితానికి మార్గదర్శకం. ఆయన ఆశయాలు సమాజానికి శాశ్వత ప్రేరణగా నిలుస్తాయి అన్నారు. ఇంకా, జై భీమ్ అనేది కేవలం నినాదం మాత్రమే కాదు, అది జ్ఞానం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం మనం తీసుకోవాల్సిన ప్రతిజ్ఞ అని పేర్కొన్నారు. అంబేద్కర్ తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసిన త్యాగమూర్తి అని కొనియాడుతూ ఆయన చూపిన మార్గంలో నడవాలని అందరూ సంకల్పించుకోవాలని పిలుపునిచ్చారు. జై భీమ్ అంటే జ్ఞానం వర్ధిల్లాలి అనే సందేశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, జీపీవోలు సంగమేశ్వర్ రెడ్డి, శేఖర్, పాల్గొని "జై భీమ్" నినాదాలతో అంబేద్కర్ కి ఘన నివాళులు అర్పించారు.




## అదనపు కలెక్టర్‌గా ఆర్.ఎస్. చిత్రు

**ఆదిలాబాద్: ఉదయం**
జిల్లా అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.ఎస్. చిత్రు మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, పరిపాలనకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, రెవెన్యూ శాఖ పనుల పురోగతి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విధానాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వర్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భావితరాలకు స్ఫూర్తి

**రామకృష్ణాపూర్, (ఉదయం ప్రతినిధి)**
భారతదేశ రాజ్యాంగాన్ని రూపొందించి, భావితరాలకు స్ఫూర్తిగా అంబేద్కర్ నిలిచారని క్యాతనపల్లి మునిసిపాలిటీ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్మన్ మిట్టపల్లి సరిత లు అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి జయంతి వేడుకలను నిర్వహించారు. ఛైర్మన్, వైస్ చైర్మన్ లు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లతో కలిసి సిహెచ్పి సమీపంలో , ఆదివారం సంత , ఏరియా ఆసుపత్రి లల్లో గల అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని,బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలనుకొనసాగించాలని పిలుపునిచ్చారు. కమిషనర్ మారుతి ప్రసాద్, కార్యాలయ సిబ్బంది, బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రాజా రమేష్, పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్,సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు యాకూబ్ అలీ, వొడ్నాల శ్రీనివాస్, బిఆర్ఎస్,సిపిఐ, కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, మాజీ కౌన్సిలర్లు, యువకులు పాల్గొన్నారు.



## విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొజ్జు



**జన్నారం, (ఉదయం విలేకరి)**
జన్నారం మండలంలోని మొర్రిగూడ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఆవిష్కరించారు.అంబేద్కర్ సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ నూతన విగ్రహాన్ని అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం రోజున సాయంత్రం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు.

## ఏళ్ల నిర్లక్ష్యానికి ముగింపు... గోపాల్‌పేట్ బస్టాండ్‌కు కొత్త రూపు

### రూ.40 లక్షలతో పునర్నిర్మాణం – ఎమ్మెల్యే మదన్ మోహన్ కృషి ఫలితం

**నాగిరెడ్డిపేట్,ఉదయం**
ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గోపాల్‌పేట్ బస్ స్టాండ్‌కు ఏళ్ల తరబడి కొనసాగిన నిర్లక్ష్యానికి ముగింపు పడింది. శిధిలావస్థలో ఉండి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారిన ఈ బస్ స్టాండ్‌ను రూ.40 లక్షల వ్యయంతో పునర్నిర్మించారు. ఇప్పటివరకు బస్ స్టాండ్ దయనీయ స్థితిలో ఉండటంతో, ప్రయాణికులు ఎండలో చెట్ల కింద నిలబడి, వర్షంలో తడుస్తూ బస్సుల కోసం వేచి ఉండాల్సి వచ్చేది. సమస్యపై పలుమార్లు వినతులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో ప్రజల్లో అసహనం నెలకొంది.ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ స్వయంగా స్థలాన్ని పరిశీలించి, వెంటనే చర్యలు చేపట్టారు. రవాణా శాఖ ద్వారా నిధులు మంజూరు చేయించి, ఆధునిక సదుపాయాలతో బస్ స్టాండ్‌ను పూర్తిగా పునర్నిర్మించారు.
ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ,"ప్రజలు చెట్ల కింద బస్సుల కోసం ఎదురుచూస్తున్న దృశ్యం నాకు బాధ కలిగించింది. అప్పుడే శాశ్వత పరిష్కారం తీసుకురావాలని నిర్ణయించుకున్నాను. ఇచ్చిన హామీని నెరవేర్చడం నా బాధ్యత" అని తెలిపారు.కొత్త బస్ స్టాండ్ ప్రారంభంతో గోపాల్‌పేట్ ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. నాగిరెడ్డిపేట్‌లో ₹20 లక్షల షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజనాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించబడనున్న 6 గదుల షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే మదన్ మోహన్ భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న వ్యాపారులకు వాణిజ్య సదుపాయాలు కల్పించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. నిర్మాణం పూర్తయిన తరువాత ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.అలాగే, కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులను పంపిణీ చేశారు.అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొనడంనాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులు తెలిపారు. సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన కృషిని కొనియాడారు.





## సహారా -ఫిక్స్ డిపాజిట్ డబ్బులను చెల్లించాలని బాధితుల ఆందోళన

**మంచిర్యాల, మందమర్రి (ఉదయం ప్రతినిధి)**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మందమర్రి మార్కెట్ లో ఉన్న సహారా కార్యాలయం ముందు సహారా ఇండియా సంస్థ లో మేము ఫిక్స్ డిపాజిట్ చేసిన డబ్బులను కాలపరిమితి దాటిపోయి 45 సంవత్సరాలు గడుస్తున్నా సహారా యాజమాన్యం డబ్బులు చెల్లించకపోవడానికి నిరసన గా బాధితులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లే కార్డ్స్ చేత బూని నిరసన వ్యక్తం చేశారు. సహారా ఇండియా లో మేము ఫిక్స్ డిపాజిట్ చేసిన డబ్బులను వెంటనే చెల్లించాలని లేని యెడల జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సహారా బాధితులు పేర్కొన్నారు. జిల్లా లోని ఎం ఎల్ ఏ లు , రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకట స్వామి , అదే విధంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ సహారా బాధితుల సమస్యనుపరిష్కరించడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా బాధితులు విజ్ఞప్తి చేశారు. మేనేజర్ మా డబ్బులు మాకు వెంటనే ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు,సహారా ఇండియా బాధితుడు గజెల్లి వెంకటయ్య, సహారా బాధితులు సిహెచ్ సంజీవ్ , డి రాజమౌళి , రామ్ నరేష్‌బాబు , సి హెచ్ సంపత్ , ఎస్ మధు , దుర్గం మల్లేశ్వరి , భేరి రమాదేవి , పాల్గొన్నారు.

## గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు



**నాగిరెడ్డిపేట్,ఉదయం**
మండలంలోని గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు బీజేపీ నాయకురాలు కొండ మీరాతాయి హాజరై అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించే దిశగా చూపిన జీవన మార్గమే భారత రాజ్యాంగానికి ప్రాతిపదిక అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆయన ఆలోచనలను అనుసరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మహన్మండ్లు, మాజీ ఎంపీటీసీ దేవిసింగ్, బాలయ్య, వార్డు సభ్యులు రాజు, ఓంకృష్ణ, సిద్ధిరాములు, విష్ణు,గోపాల్,అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలే మార్గం




**ఆదిలాబాద్: ఉదయం**
అంబేద్కర్ ఆశయాలే సమాజ ప్రగతికి మార్గదర్శకమని రీజినల్ మేనేజర్ డి. విజయ భాను పేర్కొన్నారు.ఆదిలాబాద్ ప్రయాణ ప్రాంగణంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రీజినల్ మేనేజర్ డి. విజయ భాను మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుచుకుంటూ ప్రజలకు నిబద్ధతతో సేవలు అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని ఆమె అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఒ బి. శ్రీహర్ష, ఆదిలాబాద్ డిపో మేనేజర్ జి. ప్రతిమారెడ్డి, ఎంఎఫ్ శ్రీకర్, ఆర్ఎం ఆఫీస్ ఎంఎఫ్ రాజేందర్, ఎస్సీ ఎస్టీ గౌరవ అధ్యక్షులు జైశ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## నూతన బోర్ వేయించిన సర్పంచ్



**జన్నారం,ఏప్రిల్ 14(ఉదయం విలేకరి)**
గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ఉండడానికే నూతన బోర్ వేయించామని జన్నారం మండలంలోని లోతొర్రె గ్రామ సర్పంచ్ బోడ శంకర్ అన్నారు. మంగళవారం రోజున ఆ గ్రామంలో గల గోండుగూడా కాలనీలో నూతన బోర్ వేయించి దానికి బోరింగ్ ను అమర్చి గ్రామస్తుల దాహార్తిని తీర్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చేయడం కోసం నూతన బోర్ వేయించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

## మాగి గ్రామంలో ఘనంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**నిజాంసాగర్ (ఉదయం ప్రతినిధి):**
నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో మంగళవారం డా.బీ ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుర్రపు సుమిత్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశానికి అపార సేవలు అందించారని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ప్రతి భారతీయుడికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరికీ విద్యా హక్కు, సమాన అవకాశాలు కలగాలని ఆయన కలలు కనారని, ఆ ఆశయాలను సాధించడం మనందరి బాధ్యత అని ఆమె వివరించారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. యువత చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరాలని, అంబేద్కర్ ఆలోచనలను జీవితంలో అమలు చేయాలని సూచించారు. గ్రామంలో ఐక్యత, సహకారం పెంపొందితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అన్నారు. ఉపసర్పంచ్ మేంగారం కవిత పందరి, రాజ్యం గంగారం, గ్రామపంచాయతీ కార్యదర్శి భారతి, వార్డుల సభ్యులు, ఎర్ర కాశవ్వ ,ధ్యాన బోయిన సాయిలు, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు ఎర్ర సాయిలు, దళిత నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



## మళ్లీ ఎగబాకిన పసిడి ధరలు.. కిలో వెండిపై రూ.5 వేలు పెరుగుదల



కాస్త తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు, ఇవాళ బులియన్ మార్కెట్‌లో మళ్లీ పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో హైదరాబాద్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పెరిగాయి. ఈ మేరకు 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం 10 గ్రాములపై రూ.1,470 పెరిగి రూ.1,53,930కు చేరింది. అదేవిధంగా ఆభరణాల్లో ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,350 ఎగబాకి రూ.1,41,100 వద్ద ట్రేడ్ అవుతోంది. మరోవైపు కేజీ వెండిపై ఒకేసారి రూ.5,000 పెరగడంతో కిలో వెండి ధర రూ.2,65,000కు చేరుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా ఈ ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.






## మార్కెట్లలో మళ్లీ యుద్ధ వణుకు..!

అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు విఫలం కావడం మార్కెట్లను మళ్లీ బెంబేలెత్తించాయి. భారత్ సహా యుఎస్ మార్కెట్లు భారీ నష్టాలను చవి చూశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1600 పాయింట్ల మేర పతనమయ్యింది. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల జరిగిన చర్చలు ఎటువంటి ఒప్పందం లేకుండా విఫలం కావడం, హార్మూజ్ జలసంధిని దిగ్బంధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించడంతో ఉదయం భారత ఈక్విటీ మార్కెట్ భారీ అమ్మకాలను చవిచూసింది. దీనివల్ల ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 56 పైసలు కోల్పోయి 93.39కి పడిపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే సెన్సెక్స్ ఇంట్రాడేలో 1,682 పాయింట్లు లేదా 2.1 శాతం పడిపోయి 75,868.32 వద్ద కనిష్ట స్థాయిని తాకింది. తుదకు కొంత కోలుకుని సెన్సెక్స్ 703 పాయింట్లు 0.91 శాతం నష్టంతో 76,847.57కు పరిమితమయ్యింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 208 పాయింట్లు లేదా 0.86 శాతం నష్టంతో 23,842.65 వద్ద ముగిసింది. ''అమెరికా-ఇరాన్ శాంతి చర్చల విచ్ఛిన్నం, హార్మూజ్ జలసంధిలో అమెరికా నౌకాదళ దిగ్బంధ నం ముడి చమురు ధరలను బ్యారెల్‌కు 100 డాలర్లను పైన పలికింది. పెరిగిన చమురు ధరలు ద్రవ్యోల్బణం, కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలను పెంచుతున్నాయి'' అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. రంగాల వారిగా నిఫ్టీ ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్‌ఎమ్‌సిజి రంగాలు భారీగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా దాదాపు 0.50 శాతం మేర క్షీణించాయి.

## హార్మూజ్ బ్లాకేడ్‌తో భారత్‌పై తీవ్ర ప్రభావం!

హార్మూజ్ జలసంధిని అమెరికా సైన్యం దిగ్బంధించడంతో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన నెలకొంది. సౌదీ అరేబియా సహా పలు దేశాలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రిక్వెస్ట్‌లు చేస్తున్నాయి. చైనా సహా ఇంకొన్ని దేశాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నాయి. అదే సమయంలో.. ఈ బ్లాకేడ్ ప్రభావంతో ప్రపంచ ఇంధన మార్కెట్లు కుదేలవుతున్నాయి. ఈ పరిణామం భారత్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపే చాన్స్ కనిపిస్తోంది. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధర ప్రస్తుతం 99 డాలర్ల వద్ద ఉంది. హార్మూజ్ బ్లాకేడ్ కొనసాగితే అది 150 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ గల్ఫ్ దేశాలపై అధికంగా ఆధారపడుతుంది. చమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి బిల్లులు పెరగడం, ద్రవ్యోల్బణం పెరగడం, వాణిజ్య లోటు పెరిగే అవకాశం లేకపోలేదు. పైగా జలసంధిద్వారా రోజుకు 12మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు సరఫరా జరుగుతుంది. ఈ మార్గం మూసుకుపోతే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తీవ్ర తరం కావొచ్చు. అలాగే పెరిగిన ఇంధన ధరలు నేరుగా రవాణా, విద్యుత్, ఆహార ధరలపై ప్రభావం చూపెట్టొచ్చు. హార్మూజ్ బ్లాకేడ్‌పై భారత్ ఇంకా స్పందిం చాల్సి ఉంది. భారత నౌకలకు హార్మూజ్ జలసంధి మార్గాన్ని ఇరాన్ మూసేసిందని ఒక ప్రచారం నడుస్తోంది. అయితే అది ఉత్తదేనని ఇరాన్ అంటోంది. న్యూఢిల్లీలో ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలి ఎన్‌డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో



మాట్లాడుతూ.. "భారతదేశం మా స్నేహపూర్వక దేశం. హార్మూజ్ మార్గం భారత నౌకలకు తెరిచే ఉంటుంది. అమెరికా ఈ బ్లాకేడ్‌తో తప్పు లెక్కలు వేసింది. ఈ చర్య అంతర్జాతీయ చట్టాలను ధ్వంసం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తుంది'' అని హెచ్చరించారు. మొత్తంగా, హార్మూజ్ బ్లాకేడ్ భారత్‌కు ఇంధన భద్రతా సంక్షోభం తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. ఇరాన్ ఇచ్చిన హా కొంత ఉపశమనం కలిగిస్తోంది. కానీ ధరల పెరుగుదల, సరఫరా అంతరాయం వంటి సమస్యలు భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద సవాలుగా మారే అవకాశం లేకపోలేదు.

## ఇరాన్ యుద్ధం తర్వాత పొంచి ఉన్న ఉద్యోగ సంక్షోభం



ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక రంగాన్ని పశ్చిమాసియా యుద్ధం ఎక్కువ ప్రభావితం చేసింది. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు చీఫ్ అజయ్ బంగా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆయన తెలిపారు. దీర్ఘకాలంలో అంటే వచ్చే పదేళ్లలో కోట్లాది మందిని ఈ యుద్ధం నిరుద్యోగులుగా మార్చగలిగే ప్రమాదం పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. రాబోయే 10 నుంచి 15 ఏళ్లలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సుమారు 120 కోట్ల మంది ప్రజలు పని చేసే వయస్సులోకి ప్రవేశించనున్నారు. ప్రస్తుత ఆర్థిక ధోరణులు కేవలం 40 కోట్ల ఉద్యోగాలను మాత్రమే సృష్టిస్తాయని, దీనివల్ల దాదాపు 80 కోట్ల ఉద్యోగాల కొరత ఏర్పడుతుందని తెలిపారు. ఇరాన్ యుద్ధం, ముడి చమురు ధరల పెరుగుదల వంటి తాత్కాలిక సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం వల్ల, దేశానికి ముఖ్యమైన దీర్ఘకాల ఉద్యోగ సమస్యలు పట్టించుకోకుండా పోతున్నాయని అజయ్ బంగా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు తక్షణం ఎదుర్కొంటున్న సంక్షోభాలను, ఉద్యోగ కల్పన, స్వచ్ఛమైన నీటి లభ్యత, విద్యుదీకరణ వంటి దీర్ఘకాలిక ప్రాధాన్యతలతో సమతుల్యం చేసుకోవాలని వరల్డ్ బ్యాంక్ చీఫ్ సూచించారు. ఉద్యోగాలను కల్పించడంలో విఫలమైతే అది అక్రమ వలసలు, అస్థిరతకు ఆజ్యం పోస్తుందని ఆయన స్పష్టం చేశారు. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా 11.7 కోట్ల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి అంచనాలు చెబుతున్నాయి. తక్షణ సమస్యలైన ద్రవ్యోల్బణం, మార్కెట్ల పతనం, నిధుల కొరతతో పాటు ఉద్యోగాల కొరత, మౌలిక సదుపాయాల కల్పనలో లోపాలు, ఇతర ప్రతికూలతల వంటి దీర్ఘకాల సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వం, బ్యాంకులు, ప్రైవేట్ ఇన్వెస్టర్లు కలిసి పని చేయడం చాలా అవసరమని అజయ్ బంగా వెల్లడించారు.

## ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ దరఖాస్తును వెనక్కి పంపిన ఆర్‌బీఐ




ప్రముఖ ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బీ) యూనివర్సల్ బ్యాంకుగా మారేందుకు ఇచ్చిన దరఖాస్తును భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వెనక్కి పంపింది. అయితే, ఇది దరఖాస్తును రద్దు చేయడం కాదు, అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందించే పూర్తి స్థాయి బ్యాంకుగా మారేందుకు అవసరమైన స్థాయిలో సిద్ధంగా లేనందున దరఖాస్తును తిరిగివ్వడం. బ్యాంకు తన లోన్ బుక్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. లోన్ పోర్ట్‌ఫోలియోను అన్ని విభాగాలకు విస్తరించిన తర్వాత దరఖాస్తును పరిగణలోకి తీసుకుంటామని సూచించింది. ప్రస్తుతం ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ ఇచ్చే రుణాలు ఇంకా పూర్తిగా అన్ని విభాగాల్లో లేవు.ఇప్పటికీ ఎక్కువ లోన్స్ ఒకే రకంగా ఉన్నాయి. ముఖ్యంగా అన్‌సెక్యూర్డ్ లోన్స్ వాటా అధికంగా ఉంది. యూనివర్సల్ బ్యాంక్ కావాలంటే, గృహ, వ్యాపార రుణాలు వంటి సెక్యూర్డ్ లోన్లు ఇంకా మెరుగుపడాలి. ప్రస్తుతం బ్యాంకు సెక్యూర్డ్ లోన్లు 43 శాతం నుంచి 49 శాతానికి పెరిగాయి. అన్‌సెక్యూర్డ్ లోన్లు క్రమంగా తగ్గుతున్నాయి. కానీ, సెక్యూర్డ్ లోన్స్ విభాగంలోని హోమ్, గోల్డ్, ప్రాపర్టీ లోన్లు పెంచాల్సి ఉంది. ఈ కారణంగానే ఆర్‌బీఐ మరింత మెరుగుపడిన తర్వాత యూనివర్సల్ బ్యాంకు హోదా కోసం దరఖాస్తు చేయాలని వెల్లడించింది.

## వచ్చే ఏప్రిల్ నుంచే కేఫ్ 3 నిబంధనలు



కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియెన్సీ 3(కేఫ్ 3) ప్రమాణాల అమలు గడువును ప్రభుత్వం పొడిగించే అవకాశం లేదని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి వాహన తయారీదారులు కఠిన ఇంధన సామర్థ్య నిబంధనలను పాటించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేఫ్ 3 నిబంధనలపై ప్రభుత్వం ఆటో పరిశ్రమ భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది, వారికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, అభిప్రాయాలను క్రమం తప్పకుండా కోరుతున్నామన్నారు. అమలు గడువును 2027, ఏప్రిల్ 1 తర్వాత పొడిగించాల్సిన అవసరం రాకపోవచ్చని ఆయన అన్నారు. కాగా, 'కేఫ్-2027'గా పిలిచే ఈ నిబంధనల ప్రకారం, ప్రతి కారు అన్ని మోడళ్ల సగటు ఫ్యూయెల్ ఎఫిషియెన్సీ, కార్బన్ డయాక్సైడ్ ఎమిషన్ నిర్దిష్ట స్థాయి కంటే తక్కువగా ఉండాలి. మరింత సులభంగా చెప్పాలంటే.. వాహనాలు తక్కువ ఇంధనం, తక్కువ కాలుష్యం వాడాలి. మెరుగైన మైలేజీ ఇవ్వాలి.





## ఆడింది ఒకే మ్యాచ్..కానీ 19 ఏళ్ల రికార్డు బద్దలు కొట్టాడు



సన్ రైజర్స్ హైదరాబాద్ కొత్త బౌలర్ ప్రఫుల్ హింగే అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఆడిన తొలి మ్యాచ్ మొదటి ఓవర్ లోనే మూడు వికెట్లు తీసి చరిత్ర సృష్టించాడు. రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా తన తొలి ఓవర్ లోనే మూడు కీలక వికెట్లు పడగొట్టాడు ప్రఫుల్ హింగే. ఈ క్రమంలోనే 19 సంవత్సరాల ఐపీఎల్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన తొలి క్రికెటర్‌గా హిస్టరీ సృష్టించాడు. గతంలో తొలి ఓవర్ లోనే రెండు వికెట్లు తీసిన సందర్భాలు 32 ఉన్నాయి. కానీ ప్రఫుల్ హింగే మాత్రం మూడు వికెట్లు పడగొట్టి, హైదరాబాద్ జట్టును గెలిపించాడు. హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య నిన్న ఉప్పల్ స్టేడియం వేదికగా మ్యాచ్ జరిగింది. ఇందులో 216 పరుగులు సాధించిన హైదరాబాద్... బౌలింగ్ లో కూడా దుమ్ము లేపింది. ఈ క్రమంలోనే 19 ఓవర్లు ఆడిన రాజస్థాన్ రాయల్స్ 159 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ఐపీఎల్ 2026లో రెండో విజయాన్ని నమోదు చేసుకుంది.

## ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ సంచలన నిర్ణయం



హైదరాబాద్ లోని ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచులో సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన జట్టు తాత్కాలిక సారథి ఇషాన్ కిషన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై తాను జట్టులో వికెట్ కీపింగ్ బాధ్యతల నుండి తప్పుకుంటున్నట్లు వెల్లడించాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 57 పరుగుల భారీ విజయం తర్వాత ఇషాన్ ఈ విషయాన్ని స్పష్టం చేశాడు. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో జట్టును నడిపిస్తున్న ఇషాన్, కేవలం బ్యాటింగ్, కెప్టెన్సీపైనే పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వికెట్ కీపింగ్ చేస్తూ ఫీల్డింగ్ సెట్ చేయడం, బౌలర్లతో నిరంతరం సంభాషించడం కొంత ఇబ్బందిగా మారుతోందని ఇషాన్ అభిప్రాయపడ్డాడు. ''కీపింగ్ చేస్తున్నప్పుడు బౌలర్ల దగ్గరకు వెళ్లి ప్రణాళికల గురించి చర్చించడానికి తగిన సమయం దొరకడం లేదు. మైదానంలో బౌలర్లకు అందుబాటులో ఉండి, ఎప్పటికప్పుడు ఫీల్డ్ మార్పులు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని భావిస్తున్నాను'' అని ఇషాన్ పేర్కొన్నాడు. రాజస్థాన్ రాయల్స్‌పై 91 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్, తన వ్యూహాలతో యువ బౌలర్లు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్‌లను అద్భుతంగా గైడ్ చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ క్రమంలోనే కీపింగ్ బాధ్యతలను వేరే ప్లేయర్‌కు అప్పగించి, తను మాత్రం ఫీల్డ్ లో ఉండి జట్టును నడిపించాలని నిర్ణయించుకున్నట్లు ఇషాన్ కిషన్ ప్రకటించారు.

## వైభవ్‌కు బంపర్ ఆఫర్! బీసీసీఐ సంచలన నిర్ణయం..




ప్రస్తుతం భారత క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్న యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ. వైభవ్‌కు గుడ్‌న్యూస్ వచ్చేసింది. త్వరలోనే తన కెరీర్‌లో మరో మైలురాయిని చేరుకోబోతున్నాడు. 15 ఏళ్ల ఈ కుర్రాడిని సీనియర్ భారత జట్టులోకి అరంగేట్రం చేసేందుకు ఎంపిక చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఐర్లాండ్ పర్యటన కోసం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ వైభవ్‌ను షార్ట్‌లిస్ట్ చేసినట్లు సమాచారం. బెంచ్ స్ట్రెంత్‌ను పరీక్షించే ఉద్దేశంతో ఈ పర్యటనకు యువ ఆటగాళ్లను పంపాలని బీసీసీఐ భావిస్తోందట. ఈ క్రమంలోనే ఐర్లాండ్‌తో పాటు జింబాబ్వే పర్యటనకు కూడా వైభవ్ ఎంపికయ్యే అవకాశం ఉందని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది. ప్రస్తుతం భారత పురుషుల క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్ (16 ఏళ్ల 205 రోజులు) అత్యంత పిన్న వయస్కుడైన డెబ్యూటెంట్ కాగా, మహిళల క్రికెట్‌లో షఫాలీ వర్మ (15 ఏళ్ల 7 నెలల 27 రోజులు) ఆ రికార్డును కలిగి ఉన్నారు. ఒకవేళ వైభవ్ ఐర్లాండ్ సిరీస్‌లో బరిలోకి దిగితే, వీరిద్దరి రికార్డులను అధిగమించి భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత చిన్న వయసులో అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో వైభవ్ ఆడిన ఇన్నింగ్స్‌లు మాజీ దిగ్గజాలను సైతం ఆశ్చర్యపరిచాయి. ఆర్‌సీబీపై 26 బంతుల్లో 78 పరుగులు, సీఎస్‌కేపై 17 బంతుల్లో 52, ముంబై ఇండియన్స్‌పై 14 బంతుల్లో 39 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ఈ అసాధారణ ప్రదర్శనపై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ ప్రశంసల వర్షం కురిపించారు. వైభవ్ వంటి ప్రతిభావంతుదైన ఆటగాడు చాలా అరుదుగా దొరుకుతాడని, భారత్ తరపున అత్యంత పిన్న వయసులో అరంగేట్రం చేసిన ఆటగాడిగా అతను రికార్డు సృష్టించాలని ధుమాల్ ఆకాంక్షించారు. ఇర్ఫాన్ పఠాన్, అనిల్ కుంబ్లే వంటి మాజీ ఆటగాళ్లు కూడా వైభవ్ అంతర్జాతీయ క్రికెట్‌కు సిద్ధంగా ఉన్నాడని మద్దతు తెలుపుతున్నారు.

## ఒక్క ఓవర్.. లక్షల్లో ఫాలోవర్లు!

ఐపీఎల్ ఓ ఆటగాడి జీవితాన్ని ఎలా మారుస్తుందో చెప్పడానికి ప్రఫుల్ హింగే ఓ నిలువెత్తు నిదర్శనం. రాత్రి వరకు ప్రఫుల్ హింగే ఎవరో కూడా చాలా మందికి తెలియదు. విదర్భకు చెందిన ఈ 24 ఏళ్ల పేసర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తన బేస్ ధర రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. అప్పటి నుంచి బెంచ్‌కే పరిమితమైన ప్రఫుల్ హింగేకు.. రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేసే అవకాశం దక్కింది. తన అద్భుత ప్రదర్శనతో కేవలం 6 బంతుల్లోనే ప్రపంచం మొత్తం తన పేరును వెతికేలా చేశాడు. ప్రఫుల్ హింగే అద్భుత ప్రదర్శన అతని సోషల్ డియా ఖాతాపై పెను ప్రభావాన్ని చూపింది. బంతిని అందుకునే ముందు అతని ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య కేవలం 3,000 మాత్రమే. కానీ మ్యాచ్ ముగిసిన కొద్దిసేపటికే అది ఏకంగా 1,61,000కి చేరుకుంది. అంటే దాదాపు 5000 శాతానికి పైగా పెరుగుదల కనిపించింది. అభిమానులు అతని ప్రొఫైల్‌ను లైకులు, కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఓ సాధారణ ఆటగాడు ఒకే ఓవర్‌తో గ్లోబల్ సెన్సేషన్‌గా మారడం ఐపీఎల్ పవర్‌ను మరోసారి నిరూపించింది. ఐపీఎల్ చరిత్రలో ఏ బౌలర్ చేయని అద్భుతాన్ని ప్రఫుల్ హింగే చేసి చూపించాడు. తన ఐపీఎల్ కెరీర్ తొలి ఓవర్లోనే మూడు వికెట్లు తీసి మొదటి బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. రెండో బంతికే ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీని డకౌట్ చేసిన ప్రఫుల్ హింగే.. ఆ తర్వాత ధ్రువ్ జురేల్, లూహాన్-డ్రే ప్రిటోరియస్‌లను పెవిలియన్ పంపాడు. దీంతో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఒక్కసారిగా కోలుకోలేని దెబ్బ తింది. హింగే వేసిన ఆ ఓవర్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత అద్భుతమైన అరంగేట్ర ఓవర్‌గా నిలిచిపోయింది.




## మహిళల టీ20 వరల్డ్ కప్‌కు రికార్డు ప్రైజ్‌మనీ..




మరో 60 రోజుల్లో ఇంగ్లాండ్ వేదికగా మహిళల టీ20 వరల్డ్ కప్ ప్రారంభంకానుంది. ఈ పొట్టి ప్రపంచకప్‌కు సంబంధించిన ప్రైజ్‌మనీని ఐసీసీ రికార్డు స్థాయిలో ప్రకటించింది. ప్రైజ్ పూల్ మొత్తం దాదాపు రూ.82 కోట్లుగా నిర్ణయించింది. గతఎడిషన్ 2024లో ఈ మొత్తం రూ.70 కోట్లకుపైగా ఉంది. ఈ సారి మొత్తాన్ని ఐసీసీ 10 శాతం పెంచింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ.21.8 కోట్లు దక్కనుండగా.. రన్నరప్ టీమ్‌కు రూ.10 కోట్లు అందనున్నాయి. సెస్‌లో ఓడిన రెండు జట్లకు రూ.6.3 కోట్లు పొందుతాయి. ఇక గ్రూపుదశలో గెలిచిన ప్రతి జట్టుకు రూ.29 లక్షలు ఇవ్వనుంది. టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టు కనీసం రూ.2.3 కోట్లతోనే ఇంటికి వెళ్తుందని ఐసీసీ తెలిపింది. గత ఎడిషన్‌లో 10 జట్లు పాల్గొనగా.. టోర్నీ చరిత్రలో తొలిసారిగా ఈ ఎడిషన్‌లో 12 జట్లు పోటీలో ఉన్నాయి. జూన్ 12 నుంచి వరల్డ్ కప్ ప్రారంభంకానుంది. నుంచి ఐసీసీ ట్రోఫీ టూర్ ప్రారంభమైనట్టు ఐసీసీ తెలిపింది.

## సాల్ట్, పాటిదార్ విధ్వంసం.. ముంబైకి హ్యాట్రిక్ ఓటమి



ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠ భరిత పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ 18 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై అద్భుత విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ బ్యాటర్లు ముంబై బౌలర్లను దీటుగా ఎదుర్కొని నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 240 పరుగుల భారీ స్కోరును సాధించారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ కేవలం 36 బంతుల్లోనే 78 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, విరాట్ కోహ్లీ (50) క్లాస్ ఆటతీరుతో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు 120 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన రజత్ పాటిదార్ కేవలం 20 బంతుల్లోనే 53 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అనంతరం 241 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ చివరి వరకు పోరాడి 222 పరుగులు చేయగలిగింది. ముంబై ఇన్నింగ్స్‌లో చివర్లో షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (71 నాటౌట్) ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు కొట్టినంత పని చేసినా, లక్ష్యం పెద్దది కావడంతో విజయం ఆర్‌సీబీనే వరించింది. బెంగళూరు బౌలర్లలో సుయాశ్ శర్మ రెండు వికెట్లతో కీలక పాత్ర పోషించగా, కృనాల్ పాండ్యా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ముంబైని కట్టడి చేశాడు. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఆర్‌సీబీ తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది.

# వుదయం సినిమా

MOVIE TIME!


## బ్యాడ్ బాయ్ కార్తీక్ అందరికి నచ్చుతుంది

### ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో నాగశౌర్య

హీరో నాగ శౌర్య, రామ్ దేశినా (రమేష్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రంతో మాస్ అవతార్‌లో రాబోతున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మించిన ఈ చిత్రం, సూపర్ హిట్ పాటలు, శౌర్యను మునుపెన్నడూ లేని విధంగా ఇంటెన్స్‌గా చూపించిన పవర్‌ప్యాక్డ్ టీజర్, ట్రైలర్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ నెల 17వ తేదీన విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.



## #గోపీచంద్33 కు టైటిల్ భరతవర్ష



హీరో టి. గోపీచంద్, సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చారిత్రక యాక్షన్ డ్రామా #గోపీచంద్33తో తన కెరీర్‌లో ఒక కొత్త శకంలోకి అడుగుపెడుతున్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మాణంలో, పవన్ కుమార్ సమర్పణలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్, గోపీచంద్ కెరీర్ లో అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాలలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. చిత్ర నిర్మాతలు పవర్ ఫుల్ గ్లింప్స్ ద్వారా సినిమా టైటిల్‌ను ఆవిష్కరించారు. క్రీ.శ. 642 నేపథ్యంలో సాగే ఈ గ్లింప్స్, శూల భూమిలో ప్రారంభమై, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో కట్టిపడేసింది. భారీ యుద్ధ సన్నివేశాలు, యుద్ధంలో ఆరితేరిన యోధుల క్లోజప్‌లు, కత్తులు, గొడ్డళ్లు, అగ్నిజ్వాలల మధ్య జరిగే పోరాటాలు కనువిందు చేసే విజువల్ ఫీస్ట్ ని అందించాయి. భరత భూమికి (భారతదేశానికి) ప్రతీకగా నిలిచే 'భరత వర్ష' టైటిల్ రివిల్ కావడం పవర్ ఫుల్ గా వుంది.

"భరతవర్ష" చిత్రం అద్భుతమైన విజువల్స్, ప్రొడక్షన్ డిజైన్, గత యుగాన్ని ఎంతో నైపుణ్యంతో పునర్నిర్మించిన తీరు అద్భుతంగా వుంది. దర్శకుడు సంకల్ప్ రెడ్డి తన విజన్ ని అద్భుతంగా ప్రతిబింబిస్తూ, భారత చరిత్రలో ఎక్కువగా పరిశీలించని ఒక అధ్యాయాన్ని గొప్పగా ఆవిష్కరించారు. భారీ స్థాయి, భావోద్వేగపూరిత కథనం, గొప్ప యాక్షన్ సన్నివేశాలతో ఈ చిత్రం ఆకట్టుకునేలా రూపుదిద్దుకుంటోంది.

## ఎం4ఎం పాటను ప్రశంసించిన బాలకృష్ణ

జో శర్మ ప్రధాన పాత్రలో, ప్రముఖ దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఎం4ఎం (మోటివ్ ఫర్ మర్డర్)' ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "హూ ఈస్ ది కిల్లర్" పాటను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ఈ పాట తాజాగా ఆదిత్య మ్యూజిక్ ద్వారా తెలుగు, హిందీ భాషల్లో విడుదలైంది. ఆకట్టుకునే ట్యూన్‌తో, ఎనర్జిటిక్ మ్యూజిక్ అండ్ విజువల్స్ ఇప్పటికే మంచి స్పందన పొందుతోంది. ఈ మూవీ హీరోయిన్, అమెరికన్ నటి జో శర్మ, ప్రముఖ నటుడు బాలకృష్ణని కలిసి, ఎం4ఎం చిత్రంలోని పాటను ఆయనకు చూపించారు. విజువల్స్, ప్రెజెంటేషన్‌ను చూసి బాలకృష్ణ చిత్రయూనిట్‌ని అభినందించారు. అంతేకాకుండా, "ఎవడు వాడు" అనే క్యాచీ లైన్‌ను ఆయన స్వయంగా హమ్ చేశారు.



## రాకాస 10 రోజుల్లో రూ.22.60 కోట్లు



విడుదలైన 10 రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ.22.60 కోట్ల వసూళ్లను సాధించిన 'రాకాస' సినిమా బాక్సాఫీస్ వద్ద ఇంకా తన సత్తాను చాటుతోంది. రిలీజైన రోజు నుంచి హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమాకు ఇంకా ప్రేక్షకుల ఆదరణ కొనసాగుతుండటం విశేషం. ఇది చూస్తుంటే ఈ సక్సెస్ జోరు మరింతగా కొనసాగుతుందనే సంకేతాలను సూచిస్తోంది. ఈ విజయానికి ప్రధాన కారణం థియేటర్లలో ప్రేక్షకుల నుంచి వస్తోన్న స్పందన. రాకాస సినిమాను ప్రేక్షకులు వారి కుటుంబంతో కలిసి వచ్చి వీక్షించి సరదాగా నవ్వుకుని ఆస్వాదిస్తున్నారు. ఈ రెస్పాన్స్ ప్రతి షోలో కనిపిస్తోంది. ఈ రెస్పాన్స్ కొనసాగుతుండటంతో సినిమాకు ఓ స్థిరమైన రన్ కొనమంచి స్పందన రావడం వల్ల ఈ సినిమాకు థియేటర్స్ లో స్థిరమైన రన్ కొనసాగుతోంది.


## స్పిరిట్ భారీ ధరకు ఒటిటి డీల్!

ప్రభాస్ యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో వస్తోన్న యాక్షన్ మూవీ స్పిరిట్. ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీ ప్రభాస్ కెరీర్‌లో 25వ సినిమాగా నిలవనుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన న్యూస్ టాలీవుడ్‌లో వైరల్‌గా మారింది. ఈ సినిమా డిజిటల్ రైట్స్‌కు సంబంధించిన క్రేజీ టాక్ వినిపిస్తోంది. స్పిరిట్ ఓటీటీ డీల్ భారీ ధరకు కుదిరినట్లు తెలుస్తోంది. డిజిటల్ హక్కుల కోసం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దాదాపు రూ.250 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ డీల్‌పై నిర్మాణ సంస్థ కానీ.. ఓటీటీ కానీ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.



## స్పైడర్‌మ్యాన్ బ్రాండ్ న్యూ డే

### రెండు సరికొత్త పోస్టర్లు విడుదల



అందరి ఫేవరెట్ సూపర్ హీరో 'స్పైడర్‌మ్యాన్' కొత్త సినిమా "స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే" నుండి రెండు అద్భుతమైన పోస్టర్లను సోనీ పిక్చర్స్ 'సినిమాకాన్ 2026'లో విడుదల చేసింది. ఈ సినిమా జూలై 31, 2026న ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. సోనీ హెడ్ టామ్ రోత్‌మాన్ ఈ పోస్టర్లను ఆవిష్కరిస్తూ... "ఇలాంటి స్పైడర్‌మ్యాన్ సినిమాను మేం ముందెన్నడూ తీయలేదు, ఇందులో హీరో టామ్ హాలండ్ నటన అద్భుతంగా ఉంటుంది" అని ప్రశంసించారు. అలాగే టామ్ హాలండ్ మాట్లాడుతూ... "ఇది ఇప్పటివరకు వచ్చిన స్పైడర్‌మ్యాన్ చిత్రాలలో అత్యంత ఎమోషనల్, మెచ్యూర్డ్ సినిమా" అని చెప్పారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ భారీ అంచనాలను పెంచుతూ రికార్డులు సృష్టిస్తోంది. డెస్టిన్ డేనియల్ క్రెట్టన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో టామ్ హాలండ్, జెండయా, జాకబ్ బాటలన్, సాడీ సింక్, మార్క్ రఫ్ఫలో తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ఈ చిత్రాన్ని అన్ని ప్రీమియం ఫార్మాట్లలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది.

## రాజమహేంద్రవరంలో భోగి ప్రారంభం



చార్మింగ్ స్టార్ శర్వానంద్, మాస్ డైరెక్టర్ సంపత్ నంది, కె.కె. రాధామోహన్, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'భోగి' హైఆక్టేన్ యాక్షన్ కొత్త షెడ్యూల్ రాజమహేంద్రవరంలో ప్రారంభం

ఈ ఏడాది వరుస విజయాలతో దూసుకుపోతున్న చార్మింగ్ స్టార్ శర్వానంద్, 'భోగి' చిత్రంతో హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం శర్వానంద్ , బ్లాక్‌బస్టర్ చిత్రనిర్మాత సంపత్ నందిని తొలిసారిగా చేతులు కలిపారు. ప్రతిష్టాత్మక శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మాణంతో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఇది శర్వానంద్ కెరీర్‌లో అత్యంతప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది.

ఫస్ట్‌లుక్ విడుదలకు లభించిన అద్భుత స్పందన నేపథ్యంలో, చిత్ర బృందం ఇప్పుడు రాజమండ్రిలో అత్యంత కీలకమైన, లెన్తీ షెడ్యూల్‌ను ప్రారంభించింది. షూటింగ్ రాంపచోడవరం అడవులలోని కఠినమైన, సవాలుతో కూడిన ప్రదేశాలలో జరగనుంది. ఇక్కడ ఎక్సయిటింగ్, టఫ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు.


ఈ సన్నివేశాలను ప్రముఖయాక్షన్ కొరియోగ్రాఫర్ ధిలీప్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్నారు. ఇవి ప్రేక్షకులను లీనమయ్యేలా చేసే యాక్షన్ అనుభూతిని అందించనునాయి. ప్రధాన తారాగణంతో పాటు శర్వానంద్ కూడా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఇది సినిమా నిర్మాణంలో ఒక కీలక ఘట్టంగా నిలుస్తోంది.

"ఎ బ్లడ్ ఫెస్ట్" అనే ఆకట్టుకునే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న 'భోగి' చిత్రంలో శర్వానంద్ ఒక సరికొత్త అవతార్ లో కనిపిస్తున్నారు. ఇప్పటికే ఆయన ట్రాన్స్ ఫర్మేషన్ అంచనాలు పెంచింది.

## నాగబంధం నుంచి సుర సుర

దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్', విరాట్ కర్ణా హీరోగా నటిస్తున్న చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇందులో పౌరాణిక కథ, చరిత్ర, యాక్షన్‌తో పాటు బలమైన ఎమోషన్స్, సాంస్కృతిక అంశాలు వున్నాయి. చిత్ర బృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సెకండ్ సింగిల్, "సుర సుర" (తెలుగు)ను ఏప్రిల్ 19న విడుదల చేయడానికి సిద్ధమవుతుండటంతో, సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌కు లభించిన అద్భుతమైన స్పందనతో ఈ చిత్రంపై ప్రేక్షకులలో అంచనాలు పెరుగుతున్నాయి.





## మే 1 న పిఠాపురంలో రిలీజ్

సీనియర్ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన 'పిఠాపురంలో అలా మొదలైంది' చిత్రం మే 1 న విడుదల కానుంది. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇందులో ప్రధాన తారాగణం. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్ పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ "ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ కి , 2 పాటలకు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా లో ప్రేమ ఉంది. సునిశిత హాస్యం ఉంది. సెంటిమెంట్ ఉంది. తండ్రీకూతుళ్ల అనుబంధం ఉంది. తప్పటడుగులు వేస్తే యువతరం ఏం కోల్పోతుందో అనే హెచ్చరిక ఉంది. మొత్తంగా అటు పెద్దలకు ఇటు యువత కు మంచి సందేశం ఉంది. మన పక్కింట్లోనో, మన చుట్టూరా కనిపించే సహజమైన పాత్రలే ఈ సినిమాలో కనిపిస్తాయి. నిజంగా కెమెరా పెట్టి లైవ్ చేసినట్టుగా ఉంటుంది ఈ సినిమా. ఇలాంటి కాన్సెప్టులు ఎప్పుడూ ఎవర్ గ్రీన్. నాకు అప్పట్లో ' ప్రేయసి రావే ' ఎలా కెరీర్ టర్నింగ్ పాయింట్ గా నిలిచిందో, ఇప్పుడు ఈ 'పిఠాపురంలో ... అలా మొదలైంది' సినిమా నా కెరీర్ ని టర్న్ చేస్తుందని బలంగా నమ్ముతున్నాను. ప్రముఖ శిల్పి రాజ్ కుమార్ వడయార్ ఇందులో ప్రముఖ పాత్ర లో నటించారు.





## లెనిన్ క్రేజీ అప్డేట్

అక్కినేని హీరో అఖిల్ చాలా కాలం తర్వాత తన సరికొత్త చిత్రం 'లెనిన్' తో వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. మురళీ కిషోర్ దర్శకత్వంలో ఒక ఊర మాస్ రూరల్ డ్రామాగా వస్తున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా, ఈచిత్రం నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన మొదటి పాట మంచి రెస్పాన్స్ అందుకోగా, ఇప్పుడు మేకర్స్ రెండో పాటను సిద్ధం చేశారు. 'యెట్టా యెట్టా' అని సాగే ఈ రెండో పాటను ఏప్రిల్ 16న విడుదల చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా.. విడుదల చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇందులో అఖిల్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేను గట్టిగా హగ్ చేసుకుని, గోదారి గట్టున రొమాంటిక్ మూడ్‌లో కనిపిస్తున్నారు. ఈ పోస్టర్ చూస్తుంటే సినిమాలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ అదిరిపోతుందని అర్థమవుతోంది. కాగా.. ఈ సినిమాలో మొదట శ్రీలీల హీరోయిన్‌గా నటించింది. కొంత షూటింగ్ కూడా పూర్తయిన తర్వాత ఆమెను తొలగించి, ఆ స్థానంలో 'మిస్టర్ బచ్చన్' ఫేమ్ భాగ్యశ్రీ బోర్సేను తీసుకున్న విషయం తెలిసిందే.. దీనికి గల కారణాలు స్పష్టంగా తెలియనప్పటికీ, భాగ్యశ్రీ ఎంట్రీతో ఈ ప్రాజెక్ట్‌కు మరింత గ్లామర్ తోడైందని చెప్పొచ్చు.

## ఎన్టీఆర్ సినిమాలో అలియా భట్



ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రానున్న చిత్రం కోసం అభిమానులతో పాటు సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. దీంతో ఈ భారీ ప్రాజెక్ట్ కు సంబంధించిన వార్తలు క్షణాల్లో వైరల్‌గా మారుతున్నాయి. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్ భాగం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'ఆర్ఆర్ఆర్'తో తెలుగు తెరపై మెరిసిన అలియాభట్ ఇప్పుడు మరోసారి టాలీవుడ్ ప్రేక్షకులకు పలకరించనున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్- ఎన్టీఆర్ ప్రాజెక్ట్‌లో ఆమె కీలకపాత్రలో నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే చిత్రబృందం ఆమెతో సంప్రదింపులు జరిపిందని అలియా కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్ పాత్రలో మొదట మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్రబృందం ఎంపిక చేసింది. అయితే డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆయన అవకాశాన్ని వదులుకున్నారు. ఇప్పుడు ఇదే పాత్రలో బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ పేరు వినిపిస్తోంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.